

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 8.00
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 254



ఆదివారం | 29-12-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి తె. 4.02 తదుపరి అమావాస్య; నక్షత్రం: జ్యేష్ఠ రా. 11.22 తదుపరి మూల; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: సా. 4.18-5.02; అమృతఘడియలు: మ.2.08-3.49; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 5.46

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


అదరగొట్టిన ఆంధ్రా కుర్రోడు



- శతకంతో ఆదుకున్న నితీశ్
- టెస్టుల్లో తొలి సెంచరీ
- ఎంసీజీలో క్లాస్ గేమ్
- బాక్సింగ్ డే టెస్ట్‌లో ఆసీస్‌కు దీటుగా భారత్

21ఏళ్ల కుర్రాడు...88వ నంబరు జెర్సీ వేసుకున్నాడు... 8వ ఆటగాడిగా వచ్చాడు... స్టేడియంలో 80వేల మంది ప్రేక్షకులు... టీవీల ముందు లక్షల మంది వీక్షకులు! ఎదురుగా ఉన్నది కంగారూలు! ఆడుతున్నది ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో! ఎక్కడా తడబడని బ్యాటు... గురి తప్పని షాటు! ఒక్కో పరుగూ జోడిస్తూ సాధించిన సెంచరీ. ఇదీ... విశాఖ కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి సింహనాదం! అంచనాల్లేకుండా ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చిన ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ బాక్సింగ్ డే టెస్టులో భారత జట్టుకు ఆపద్బాంధవుడయ్యాడు. క్లాస్ ఆటతో కంగారూ బౌలర్లకు ఎదురు నిలిచాడు. రక్షణాత్మక ఆటకే పరిమితం కాకుండా.. బ్యాటింగ్ బుక్‌లోని అన్ని షాట్లనూ ఆడుతూ ఔరా అనిపించాడు. వాషింగ్టన్ సుందర్ (50)తో కలసి కీలక భాగస్వామ్యంతో ఫాలో ఆన్ గండం నుంచి తప్పించాడు. విజయంపై ధీమాతో మూడో రోజు మైదానంలోకి వచ్చిన ఆసీస్ జట్టు ఆశలపై నితీశ్ నీళ్లు కుమ్మరించాడు. 10

తారలు.. దిగివచ్చిన వేళ!



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు ఆయనకు చిత్ర పరిశ్రమపై కోపం వచ్చింది. సినిమాల ప్రదర్శనపై ఆంక్షలు విధించడం ద్వారా బడా బడా స్టార్లు తన వద్దకు దేకుతూ వచ్చి సాగిలపడేలా చేసుకున్నారు. ఇప్పుడు పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంఘటనతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా చిత్ర పరిశ్రమను గడగడలాడించారు.

సంధ్యా థియేటర్ సంఘటనలో ఒక మహిళ మృతి చెందిన వెంటనే అల్లు అర్జున్ బేషరతుగా క్షమాపణలు చెప్పి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదు. అంతకు ముందు, ఆ సినిమా సక్సెస్ మీట్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును అల్లు అర్జున్ మరచిపోయారు. ఈ పొరపాటుకు విచారం వ్యక్తం చేయాలని ముఖ్యమంత్రి సన్నిహితులు కొందరు అల్లు అర్జున్‌కు సూచించగా, రాజకీయాలతో తనకు సంబంధం లేదంటూ ఆయన ఆ సూచనను పెడచెవిన పెట్టారు.

భారీగా ఖర్చు పెట్టి గ్రాఫిక్స్ మాయాజాలంతో నటన, కథతో సంబంధం లేని సినిమాలను పెద్ద సినిమాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. సృజనాత్మకత స్థానంలో గ్రాఫిక్స్ చేరాయి. మలయాళ చిత్ర పరిశ్రమనే తీసుకుందాం! అక్కడ తక్కువ బడ్జెట్‌తో అద్భుతమైన కథలను తెరకెక్కిస్తున్నారు.

నటులకు, దర్శకులకు వందల కోట్ల పారితోషికం చెల్లించడం తెలుగు చిత్ర పరిశ్రమలోనే జరుగుతోంది. దీంతో తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రజలలో సానుకూల అభిప్రాయం స్థానే నెగెటివ్ భావన ఏర్పడింది.

హైదరాబాద్‌లో ఉండాలంటే అణిగి మణిగి ఉండాలని, లేదంటే ఆంధ్రాకు వెళ్లిపోవాలని హెచ్చరికలు చేయడం సమంజసం కాదు. ఇలాంటి ధోరణులను అరికట్టాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉంటుంది.

కొత్త పలుకు — -ఆర్కే విశ్లేషణ 4లో..

అంతలేదు పుష్పా

ఎర్ర చందనం వేలానికి స్పందన కరువు

- టన్నుకు టెండరు రేటు రూ.70 లక్షలు
- యాభై లక్షలకే బిడ్లు వేసిన వ్యాపారులు
- తిరుపతి గోడౌన్లలో 5 వేల టన్నుల నిల్వలు
- అందులో అధిక శాతం మూడో రకమే
- కరోనా తర్వాత చైనాలో మారిన సీన్
- ఎర్రచందనం ఫర్నిచర్ పరిశ్రమలు క్లోజ్
- జపాన్, మలేషియా, అరబ్ దేశాల్లోనూ తగ్గిన కొనుగోళ్లు
- చైనాలో ఇప్పుడిప్పుడే తిరిగి తెరుచుకుంటున్న ఫ్యాక్టరీలు



'మంగళం శీనుకు అమ్మితే టన్నుకు యాభై లక్షలు! అదే చెన్నైలో మురుగన్‌కు మనమే నేరుగా అమ్మితే టన్నుకు కోటిన్నర'... ఇది పుష్ప డైలాగ్! ఈ ఒక్క మాటతో మొత్తం ఎర్ర చందనం సిండికేట్‌ను పడేస్తాడు!

ఇదే డైలాగ్‌ను మన అటవీ శాఖ అధికారులకు వినిపిస్తే... 'అంత లేదు పుష్పా! టన్నుకు రూ.50 లక్షలకు కూడా కొనే దిక్కులేదు' అని చెబుతారు. 'ప్రాణాలకు తెగించి ఎర్రచందనం కొట్టి... అష్టకష్టాలు పడి స్మగ్లింగ్ చేయడమెందుకప్పా! టన్నుకు రూ.70 లక్షలు! ఐదు వేల టన్నుల స్టాక్ రెడీగా ఉంది! డబ్బులు కట్టి తీసుకుపో పుష్పా! ఏ షెకావత్తూ నిన్ను అడ్డుకోడు' అని బంపర్ ఆఫర్ ఇచ్చేస్తారు!

ఇదీ... రీల్‌కు, రియల్‌కూ మధ్య తేడా!

(అమరావతి, మంగళం - ఆంధ్రజ్యోతి)

ఎర్రచందనం నిల్వలను విక్రయించేందుకు అటవీ శాఖ అధికారులు నానా తిప్పలు పడుతున్నారు. దీనికి అనేక కారణాలు! అటవీ శాఖ అధికారులు వేలానికి పెట్టిన సరుకులో... చాలా వరకు మూడో రకానిది కావడమే ముఖ్య కారణం! యాంటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత పదేళ్లలో స్వాధీనం చేసుకున్న టన్నుల కొద్దీ ఎర్రచందనం దుంగలను తిరుపతి సమీపంలోని తిమ్మినాయుడిపాలెం గోడౌన్లలో నిల్వ ఉంచారు. సుమారు 40 ఏళ్ల వయసున్న చెట్టు నుంచి ఒకటో రకం ఎర్రచందనం వస్తుంది. అంతకు తగ్గితే రెండో రకం! ఇక... దుంగల సైజును బట్టి మూడో రకంగా వర్గీకరిస్తారు. పట్టుబడిన సరుకులో చాలావరకు మూడో రకమే! అంతోఇంతో దొరికిన మొదటిరకం సరుకు వేలంలో అమ్ముడవుతుంది. రెండో రకంలో సగం, మూడో రకంలో దాదాపు 80 శాతం వరకూ అమ్ముడుపోదు. పదేళ్లుగా నిల్వ ఉన్న ఎర్రచందనంలో మూడో రకమే ఎక్కువగా ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. తిమ్మినాయుడిపాలెం గోడౌన్‌లో ప్రస్తుతం 5,376 టన్నుల ఎర్రచందనం ఉంది. గ్లోబల్ టెండర్ల ద్వారా నిరుడు కొంత ఎర్రచందనం వేలానికి ప్రయత్నించినా.. టెండర్‌దారులు ముందుకు రాలేదు. తాజాగా 905 టన్నులు విక్రయించేందుకు రాష్ట్ర అటవీశాఖ టెండర్లు ఆహ్వానించినా కొనుగోలుదారుల నుంచి

మిగతా 2వ పేజీలో...



ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో ప్రసంగిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

'భాష' ధ్యాస ఉన్నవారికే ఓట్లు! 14

- ప్రజలు ఆ దిశగా అడుగులేయాలి
- అప్పుడే భాషకు ప్రభుత్వాల పెద్దపీట
- వైసీపీ జారీ చేసిన జీవో 85ను రద్దు చేయాలి
- భాషా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి
- సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ ఎన్వీ రమణ
- తానూ వైసీపీ సర్కారు బాధితుడినేనని ప్రారంభోపన్యాసంలో ఉద్ఘాటన

బెజవాడలో ఘనంగా ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రారంభం

నిష్కళంక నాయకా సెలవిక



శనివారం ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంతిమయాత్రలో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

- ఆర్థిక సంస్కర్త మన్మోహన్‌సింగ్‌కు అంతిమ వీడ్కోలు
- యమున ఒడ్డున లాంఛనాలతో అంత్యక్రియలు
- చితికి నిప్పంటించిన పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్
- రాష్ట్రపతి, ప్రధాని, సోనియా, రాహుల్ నివాళి
- శ్మశానవాటికలో అంత్యక్రియలపై కాంగ్రెస్ అభ్యంతరం
- స్మారకానికి స్థలమిస్తాం.. రాజకీయం తగదు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు యావత్ భారతావని కన్నీటి నివాళులర్పించింది. దేశ ఆర్థిక సంస్కర్తకు శనివారం ఉదయం ఢిల్లీలో యమునానది ఒడ్డున ఉన్న నిగమ్ బోధ్ ఘాట్‌లో కేంద్ర ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. మన్మోహన్‌సింగ్ చితికి ఆయన పెద్ద కుమార్తె ఉపిందర్‌సింగ్ నిప్పంటించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, స్పీకర్ ఓంబిర్లా, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,

మిగతా 2వ పేజీలో...

కొత్త సీఎస్‌గా విజయానంద్!

- నేడో రేపో అధికారిక ప్రకటన
- నవంబరులో రిటైర్మెంట్ తర్వాత సాయిప్రసాద్‌కు చాన్స్? 14




అన్నమయ్య జిల్లా గాలివీడులో వైసీపీ దాడిలో గాయపడిన ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

తోలుతీసి కూర్చోబెడతాం

- వైసీపీ నేతలకు అహంకారం తలకెక్కింది.. 11 సీట్లొచ్చినా తగ్గలేదు
- అధికారులపై దాడులు చేస్తే ఎవ్వరినీ సహించేది లేదు 14
- వచ్చి సీమలోనే కూర్చుంటా.. పిచ్చివేషాలు వేస్తే దుస్తులిప్పి కొడతాం
- సీమ వాసులూ.. ధైర్యంగా బయటికొచ్చి దాడులు ఎదుర్కోండి
- ప్రభుత్వం అండగా ఉంటుంది.. సింహాద్రిపురం రైతు ఆత్మహత్యపై సమగ్ర విచారణకు ఆదేశించాం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్
- వైసీపీ దాడిలో గాయపడ్డ ఎంపీడీవో జవహర్‌బాబుకు పరామర్శ

ఏఐతో వైద్య సేవలు



- సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ఏఐ వినియోగానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఆరోగ్యశాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం
- 190 కొత్త 108 అంబులెన్సుల కొనుగోలుకు ఆమోదం 13
- అంబులెన్స్‌ల సిబ్బందికి అదనంగా రూ.4 వేల అలవెన్సు
- బీమా విధానంలో ఎన్టీఆర్ వైద్య సేవ.. ప్రతి మండలంలో జనఔషధి

భార్యాపిల్లలను బలిపెట్టి రైతు బలవన్మరణం

- ఒక్కొక్కరినీ బైక్‌పై పొలానికి తీసుకెళ్లి దారుణం 3
- రుణ ఒత్తిళ్లు తట్టుకోలేకే.. కడప జిల్లాలో పెను విషాదం



సహనటికి లైంగిక వేధింపులు..
కన్నడ టీవీ నటుడు చరిత్ అరెస్టు



బెంగళూరు, డిసెంబరు 28: కన్నడ టీవీ నాటికల్లో ప్రముఖ నటుడు చరిత్ బాలప్ప శుక్రవారం అరెస్టు అయ్యాడు. సహ నటిని లైంగిక వేధింపులకు గురి చేయడం, మాట వినకుంటే చంపేస్తానని బెదిరించాడనే ఆరోపణలపై బెంగళూరులోని రాజేశ్వరీ పేట పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కన్నడలో ముద్దు లక్ష్మి అనే నాటికతో పేరొందిన చరిత్.. పలు తెలుగు నాటికల్లోనూ నటించాడు. కన్నడ, తెలుగు నాటికల్లో నటించే ఓ నటి(29) బాలప్ప తనని వేధిస్తున్నాడంటూ డిసెంబరు 13న పోలీసులను ఆశ్రయించింది. చరిత్ ప్రేమ పేరుతో తనకు దగ్గరై బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదు చేసింది. కాగా, చరిత్‌కు ఇది వరకే వివాహమవ్వగా న్యాయస్థానం ద్వారా భార్య నుంచి విడాకులు తీసుకున్నారు. భరణం కోసం నోటీసులు పంపిన మాజీ భార్యను చరిత్ బెదిరించడంతో జూన్‌లో ఆయనపై ఓ కేసు నమోదైంది.

దల్లేవాల్ ఆరోగ్యంపై సుప్రీం ప్రత్యేక విచారణ

న్యూఢిల్లీ, డిసెంబరు 28: రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న వృద్ధ నాయకుడు జగజిత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి క్షీణించిన నేపథ్యంలో శనివారం సుప్రీంకోర్టు అసాధారణ రీతిలో విచారణ జరిపింది. పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, ఇతర డిమాండ్లను ఆమోదించాలంటూ గత నెల 26 నుంచి ఆయన పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ వద్ద దల్లేవాల్ దీక్ష చేస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన వెకేషన్ బెంచ్ ప్రత్యేక విచారణ జరిపింది. ఆస్పత్రిలో చేరేలా దల్లేవాల్‌ను నచ్చజెప్పాలని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకు మంగళవారం వరకు గడువు ఇచ్చింది. ఆయనను ఆస్పత్రికి తరలించేందుకు అవసరమైన ప్రయాణ సౌకర్యాల కోసం కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపింది. తాత్కాలిక ఆస్పత్రైనా ఏర్పాటు చేసి తరలించాలని సూచించింది.

కేంద్ర బడ్జెట్‌లో ఐటీ ఉపశమనం!

- రూ.15 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను తగ్గించే అవకాశం
- కొత్త పన్ను విధానం వారికి వర్తింపు!

న్యూఢిల్లీ, డిసెంబరు 28: వచ్చే ఫిబ్రవరి1న ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు కొంత ఊరట లభించే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా వార్షికంగా రూ.15 లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జించే వారు చెల్లించే ఆదాయం పన్నును తగ్గించాలని కేంద్రం యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, పన్ను తగ్గింపు ఉపశమనం 2020 పన్ను విధానాన్ని ఎంచుకున్న వారికి అమలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విధానంలో ఇంటి అద్దెలు వంటి మినహాయింపులను మినహాయించారు. ఈ విధానంలో వార్షిక ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉంటే 5% నుంచి 20% వరకు పన్ను విధిస్తున్నారు. అంతకు మించిన ఆదాయం ఉన్న వారు 30 శాతం పన్ను చెల్లించాల్సి వస్తోంది. కాగా, పన్ను రేట్లను తగ్గించడం వల్ల ఎక్కువ మంది కొత్త విధానాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

పాక్‌పై అఫ్ఘాన్ ప్రతీకార దాడులు

- 19 మంది సైనికుల మృతి

కాబూల్, డిసెంబరు 28: తమ దేశంపై దాడులకు ప్రతీకారంగా తాము పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు జరిపామని అఫ్గానిస్థాన్ రక్షణ మంత్రిత్వశాఖ శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఈ దాడుల వల్ల పాకిస్థాన్‌కు ఏ మేరకు నష్టం వాటిల్లింది మాత్రం వెల్లడించలేదు. అయితే ఈ దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన 19 మంది సైనికులు మృతిచెందారని హురియత్ డైలీ న్యూస్ వెల్లడించింది. ఈ దాడుల్లో అఫ్గానిస్థాన్‌కు చెందిన ముగ్గురు సైనికులు కూడా మృతి చెందినట్లు పేర్కొంది.

మనోళ్ల ఖర్చు ఎక్కువే

- నెలవారీ కుటుంబ వ్యయం తెలుగు రాష్ట్రాల్లోనే అధికం
- తెలంగాణ పట్టణాల్లో రూ.9,131; ఏపీలో 9,877

న్యూఢిల్లీ, డిసెంబరు 28: ప్రతినెల కుటుంబ అవసరాలకు మీరు ఎంత ఖర్చుపెడుతుంటారు? గ్రామీణ కుటుంబమైతే ఎంత ఖర్చు పెడతారు? పట్టణాల్లో ఉండే కుటుంబానిదెంత ఖర్చు? ఆసక్తికరమైన విషయమే కదా ఇది! పట్టణాల్లో కుటుంబాల నెలవారీ తలసరి వినియోగం (ఎంపీసీఈ)లో తెలుగు రాష్ట్రాలు మిగతా రాష్ట్రాలకన్నా ముందున్నాయి. తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కుటుంబాలు నెలకు రూ.9,131 ఖర్చు పెడుతుంటే, ఏపీ పట్టణప్రాంతాల్లో ఈ లెక్క రూ.9,877గా ఉంది. తెలంగాణ పల్లెల్లోని కుటుంబాలు నెలకు రూ.5,675 చొప్పున ఖర్చు చేస్తుంటే.. ఏపీలోనైతే గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,107 ఖర్చు చేస్తున్నాయి. దేశంలో పేదరికం, అసమానతలు, కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకు 'గృహ వినియోగ వ్యయ సర్వే 2023-24' పేరుతో 2023 ఆగస్టు-2024 జూలై మధ్య రాష్ట్రాలవారీగా ఓ సర్వే నిర్వహించారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,54,357 మంది నుంచి, పట్టణ ప్రాంతాల్లో 1,07,596 మంది నుంచి వివరాలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా కుటుంబాలు నెలవారీగా పెడుతున్న ఖర్చులో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. కేరళ, తెలంగాణ, తమిళనాడు, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలు నెలవారీ తలసరి వినియోగానికి చేస్తున్న ఖర్చులు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉండడం విశేషం.

సర్వే విశేషాలు ఇవీ..

కేరళ: గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.6,611 ఖర్చు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.7834 ఖర్చు చేస్తున్నారు.

తమిళనాడు: గ్రామీణ కుటుంబాలు రూ.5,872 ఖర్చు పెడుతుండగా, పట్టణాల్లోని కుటుంబాలు రూ.8,325 ఖర్చు చేస్తున్నాయి.

కర్ణాటక: పట్టణ ప్రాంతాల్లో రూ.8,169 ఖర్చు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఖర్చు నెలకు రూ.5,068గా ఉంది.

జాతీయ స్థాయి: గ్రామీణ ప్రాంతాల్లో సగటు ఖర్చు రూ.4,122, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు రూ.6,996 ఖర్చు చేస్తున్నారు.

పారిశ్రామిక రాష్ట్రాలు: పారిశ్రామిక రాష్ట్రాలుగా పేరొందిన గుజరాత్, మహారాష్ట్రలలో జాతీయ సగటుకు కొంత అటు ఇటుగా కుటుంబాల నెలవారీ ఖర్చులు ఉన్నాయి.



శ్రీనగర్-జమ్మూ హైవేపై మంచులో చిక్కుకున్న లారీలు

మంచులో చిక్కుకున్న కశ్మీర్, హిమాచల్

- *రోడ్లపై దట్టంగా మంచు.. నిలిచిపోయిన వేలాది వాహనాలు*

న్యూఢిల్లీ, డిసెంబరు 28: చలిగాలులతో ఉత్తర భారతదేశం గడ్డకట్టుకుపోతోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లను మంచు దుప్పటి కప్పేస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచు రోడ్లపై అంగుళాల మేర పేరుకుపోతోంది. దీంతో, ముందుకు కదల్లేక వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కాజీగుండ్ ప్రాంతంలో శ్రీనగర్-జమ్మూ హైవేపై 2వేలకు పైగా వాహనాలు మంచులో చిక్కుకుపోయాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో సోలాంగ్ నాలా మార్గంలో వెయ్యికి పైగా వాహనాలు, 5వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. పోలీసులు రోడ్లపై మంచును తొలగించి వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. సహాయచర్యలు కొనసాగుతున్నాయి. మంచు కారణంగా శ్రీనగర్-లేహ్, శ్రీనగర్-జమ్మూ హైవేలను మూసివేశారు. గుల్‌మార్గ్‌లో మంచులో చిక్కుకుపోయిన పలువురు పర్యాటకులను సైనికులు కాపాడారు. చలిగాలులు, మంచు కారణంగా కశ్మీర్ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కాలేజీల్లో పరీక్షలను కూడా వాయిదా వేశారు. ఇక, హిమాచల్ ప్రదేశ్‌లో ఐదు జిల్లాల్లో విపరీతమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రాబోయే రెండు మూడు రోజుల్లో పంజాబ్, యూపీ, బిహార్, జార్ఖండ్, జమ్మూకశ్మీర్, చండీగఢ్, ఢిల్లీ, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో ఉష్ణోగ్రతలు 3-5డిగ్రీల మేర పడిపోవచ్చని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. చలి కారణంగా హరియాణాలో పాఠశాలలకు జనవరి 1 నుంచి 15వరకు సెలవులు ప్రకటించారు.

నిష్కళంక నాయకా.. సెలవిక!



మన్మోహన్ అంతిమ యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ మంత్రి రాజ్‌నాథ్, త్రివిధ దళాల అధిపతులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సహా పలు రాష్ట్రాల సీఎంలు మన్మోహన్ అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు. ఆర్మీ ఫిరంగి వాహనంలో ఏఐసీసీ కార్యాలయం నుంచి మన్మోహన్ భౌతికకాయాన్ని నిగమ్ బోధ్ ఘాట్‌కు అంతిమయాత్రగా తీసుకొచ్చారు. అనంతరం 21 తుపాకులతో త్రివిధ దళాల సైనిక వందనం ఇచ్చాయి. మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్ , రెండో కుమార్తె దమన్ సింగ్, మూడో కుమార్తె అమృత్ సింగ్ నిగంబోధ్ ఘాట్ వద్ద అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తన చివరి ప్రయాణంలోనూ డాక్టర్ మన్మోహన్‌సింగ్ తనకు ఇష్టమైన నీలి రంగు తలపాగా ధరించేలా ఏర్పాట్లు చేశారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గ్యాల్ వాంగ్‌చుక్ సహా పలువురు విదేశీ నేతలు సైతం అంత్యక్రియలకు హాజరయ్యారు. సిక్కు మత సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చితిని పేర్చి పార్థివదేహాన్ని దహనం చేశారు.

ఏఐసీసీలో పార్థివదేహం

మన్మోహన్ గురువారం రాత్రి మృతి చెందగా శుక్రవారం ఆయన నివాసంలో పార్థివ దేహాన్ని ఉంచారు. శనివారం ఉదయం గురుద్వార్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమారు 9 గంటలకు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ మన్మోహన్ సింగ్ భౌతిక కాయానికి కాంగ్రెస్ నేతలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక సహా కాంగ్రెస్ నేతలు, అభిమానుల నివాళుల తర్వాత 10 గంటలకు అంతిమ యాత్రను ప్రారంభించారు. రాహుల్‌గాంధీ మన్మోహన్ పాడెను మోశారు. పార్థివదేహంతో పాటు అదే వాహనంలో నిగమ్ ఘాట్‌కు వెళ్లారు. అదే వాహనంలో సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉన్నారు. రాహుల్‌గాంధీ స్వయంగా రేవంత్‌రెడ్డిని పిలిచి పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించిన వారిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, సర్వే సత్యనారాయణ, కేవీపీ రామచంద్ర రావు, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేష్ రెడ్డి, దామోదర్ రావు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మాటల యుద్ధం

అంతిమ సంస్కారం, స్మారక స్థూపంపై కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం జరిగింది. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన మన్మోహన్‌ను బీజేపీ సర్కారు అవమానించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఆయన బతికున్నంత కాలం ఎప్పుడైనా గౌరవించారా? అంటూ బీజేపీ ఎదురు దాడికి దిగింది. స్మారక నిర్మాణం చేపట్టేందుకు వీలున్న స్థలంలోనే మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు నిర్వహించాలని కాంగ్రెస్ కోరింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం ఉదయం ప్రధాని మోదీతో ఫోన్‌లో ఈ విషయం మాట్లాడారు. ఆ తర్వాత లేఖ రాశారు. మాజీ ప్రధానులు, రాజనీతిజ్ఞులకు అంత్యక్రియలు నిర్వహించిన ప్రదేశంలోనే స్మారకాలు ఏర్పాటు చేయడం దేశంలో సంప్రదాయంగా వస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఖర్గే లేఖపై కేంద్ర హోంశాఖ వివరణ ఇచ్చింది. మన్మోహన్ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని తెలిపింది. స్మారకం నిర్మాణం కోసం ట్రస్టును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వెల్లడించింది. కేంద్రం స్పందించిన తీరుపై కాంగ్రెస్ అసహనం వ్యక్తం చేసింది. మరోవైపు, మన్మోహన్ మరణంపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోందని బీజేపీ జాతీయ నేత సుధాన్షు త్రివేది మండిపడ్డారు. ఇదిలా ఉండగా, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణించినపుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) కనీసం సంతాప సభ నిర్వహించలేదని ఆయన కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ మండిపడ్డారు. మన్మోహన్‌కు స్మారకం నిర్మించాలని ఖర్గే మోదీకి ప్రతిపాదన చేసిన నేపథ్యంలో శర్మిష్ఠ ఈ మేరకు 'ఎక్స్'లో స్పందించారు. '2020 ఆగస్టులో నాన్న చనిపోయినప్పుడు కాంగ్రెస్ నాయకత్వం కనీసం సంతాపం తెలిపేందుకు సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు' అని శర్మిష్ఠ పేర్కొన్నారు.

కేంద్రం అవమానించింది: రాహుల్‌గాంధీ

మన్మోహన్‌ను కేంద్రం అవమానించిందని రాహుల్ ఆరోపించారు. "మన్మోహన్ భారతదేశానికి ముద్దుబిడ్డ. ఆయన హయాంలో దేశం ఎంతో అభివృద్ధి చెందింది. ఆర్థిక రంగంలో దేశం అద్భుతంగా ఎదగడంలో మన్మోహన్ సేవలు వెలకట్టలేనివి. అటువంటి గొప్ప మనిషిని ఎన్డీఏ ప్రభుత్వం అవమానించింది. ఇప్పటివరకు దేశానికి ప్రధానులుగా చేసిన వారికి అంత్యక్రియలు అధికారిక శ్మశాన వాటికలో జరిగేవి. దీనివల్ల ప్రధానుల అంతిమ సంస్కారాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. మరి మన్మోహన్ సింగ్ విషయంలో మాత్రం ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో నిర్వహించారు. అది ముమ్మాటికీ మన్మోహన్‌ను అవమానించడమే" అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.



మన్మోహన్ భౌతికకాయం వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నివాళి



మన్మోహన్ పాడెను మోస్తున్న రాహుల్ గాంధీ

లోకం తీరు



వైవీ రెడ్డి బంగారు సలహా!

- యశ్వంత్ సిన్హాతో పాటు మన్మోహన్ సింగ్‌కు బంగారం తాకట్టు ప్రతిపాదన

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

విదేశీ మారక నిల్వల విషయంలో దేశం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణమది. కేవలం వారం రోజుల దిగుమతులకు మాత్రమే సరిపడేలా విదేశీ మారకం నిల్వలు ఉన్నాయి. అలాంటి తరుణంలో మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. బంగారాన్ని తాకట్టు పెట్టడం ద్వారా విదేశీ మారక నిల్వలు పెంచాలని నిర్ణయించారు. వాస్తవానికి మన్మోహన్‌సింగ్ కన్నా ముందు ఆర్థిక మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హాకు కూడా బంగారం విక్రయించి చమురు దిగుమతులకు అవసరమైన నిధులు సర్దుబాటు చేశారు. ఈ ఇద్దరు ఆర్థిక మంత్రులకు బంగారం తాకట్టు సలహా ఇచ్చింది. దాన్ని పూర్తిగా అమలు చేసిన అధికారి వైవీ రెడ్డి. యశ్వంత్ సిన్హా 20 టన్నుల బంగారాన్ని స్విట్జర్లాండ్‌లో తాకట్టు పెట్టారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రిగా వచ్చిన మన్మోహన్‌సింగ్ మరో 47 టన్నుల బంగారాన్ని బ్రిటన్‌లో తాకట్టుపెట్టి అప్పులు తీసుకొచ్చారు. ఆ తర్వాత దేశంలో క్రమేణా ఆర్థిక సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వారిలో మన్మోహన్‌సింగ్ తోపాటు వైవీ రెడ్డి కూడా ఒకరనేది కొందరికే తెలుసు. కడప జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన వైవీ రెడ్డి అంతర్జాతీయంగా ఆర్థిక సంస్కరణల్లో నిపుణుడిగా పేరుగాంచారు. గల్ఫ్‌లోని బహ్రెయిన్ ప్రభుత్వంతోపాటు చైనాతో సహా అనేక దేశాలతో, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఐరాస ఆర్థిక సంస్కరణ విభాగాల్లో వైవీ రెడ్డి పని చేశారు. ఐఏఎస్ అధికారిగా నల్గొండ, గుంటూరు సహా పలు జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేసి ఆర్థిక శాఖకు వచ్చారు. ఆర్థిక రంగంలో ఆయనకున్న అపార అనుభవంతో ఆ తర్వాత ఆయన ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారు.

పీపీపీ విధానంలో కొత్త ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, డిసెంబరు 28: భారతీయ రైల్వేస్.. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నూతన ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. రానున్న నెలల్లో ఈ విధానంలో భాగంగా మినరల్ కారిడార్లు వంటి నూతన వాణిజ్యపరమైన లైన్లను నిర్మించాలని ప్రతిపాదిస్తున్నట్టు ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అయ్యే ఖర్చును తగ్గించుకోవా లన్న ఉద్దేశంతో భారతీయ రైల్వేస్ ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, పీపీపీ విధానం వైపు మారాలని ప్రతిపాదించినప్పటికీ 2025-26 బడ్జెట్‌లో మూలధన వ్యయానికి సంబంధించి భారీ ఊతాన్ని భారతీయ రైల్వేస్ పొందే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. కాగా 2031 నాటికి ప్రతిపాదిత ఇంధన, మైనింగ్, సిమెంట్ రైల్ కారిడార్లకు రూ.5.25 లక్షల కోట్లకు పైగా వ్యయం అవుతుందని అంచనా. మరోవైపు, రైళ్లకు సంబంధించిన కొత్త టైమ్ టేబుల్‌ను భారతీయ రైల్వేస్ వచ్చే జనవరి 1న విడుదల చేయనుంది.

వ్యవసాయ ఉత్పత్తులకు ఏకరూప జాతీయ మార్కెట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 28: దాదాపు మూడేళ్ల కిందట మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి, రైతుల ఆందోళనలతో వెనక్కి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విషయంలో సంస్కరణలు తీసుకువచ్చింది. ఈ క్రమంలో తాజాగా మరో కొత్త ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం దేశవ్యాప్తంగా ఏకరూప జాతీయ మార్కెట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. నూతన విధానం కింద ఒకే లైసెన్సు, ఒకే రిజిస్ట్రేషన్ వ్యవస్థ, ఒకేసారి చెల్లించేలా ఫీజు ఉండనున్నాయి. ఇక, ఈ ముసాయిదా ప్రకారం.. ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. వీటి ద్వారా ఉత్పత్తి, ఎగుమతిదారులు, రిటైల్ వ్యాపారులు, వ్యవస్థీకృత రిటైల్ వ్యాపారులు నేరుగా విక్రయాలు జరుపుకోవచ్చు. అదేవిధంగా గిడ్డంగులు, శీతల గోదాములను ప్రత్యేక మార్కెట్లుగా గుర్తిస్తారు. అలాగే, ప్రైవేటు ఈ-ట్రేడింగ్ వేదికల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ రుసుములను ఒకేసారి నిర్ణయిస్తారు.

ఆస్ట్రేలియా, జర్మనీకి చలో చలో!

పైచదువుల కోసం భారత విద్యార్థుల మొగ్గు.. శాశ్వత నివాసం, ఉపాధి అవకాశాలూ పరిగణనలోకి

- కఠిన వీసా నిబంధనలతో అమెరికా, యూకేకు దూరం

న్యూఢిల్లీ, డిసెంబరు 28: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తమ ఇమిగ్రేషన్ విధానాలను సవరిస్తున్నాయి. కొన్ని దేశాలు వీసా నిబంధనలను సడలిస్తుంటే మరికొన్ని కొత్తగా పరిమితులు విధిస్తున్నాయి. ఈ మార్పుల ప్రభావం విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనుకొనే భారతీయ విద్యార్థులపై పడుతోంది. కొన్నేళ్లుగా మన దేశ విద్యార్థులకు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా గమ్యస్థానాలుగా ఉన్నాయి. చదువు పూర్తయిన తర్వాత ఉపాధితో పాటు శాశ్వత నివాసానికి అవకాశం కల్పించే దేశాలవైపు ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ విషయంలో ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ వంటి దేశాలు భారతీయ విద్యార్థులకు ఆకర్షణీయమైన ఎంపికలుగా మారుతున్నాయి. దీనికి విరుద్ధంగా అమెరికా, యూకే ఈ ప్రక్రియలను సరళతరం చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు మొదటి ఎంపికగా ఉన్న అమెరికాకు కొంతకాలంగా దరఖాస్తులు తగ్గుముఖం పట్టాయి. సంక్లిష్టమైన వీసా నిబంధనలు, పెరుగుతున్న తిరస్కరణ రేట్లు, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వంటి అంశాలు విద్యార్థులను పునరాలోచనలో పడేస్తున్నాయి. ట్రంప్ మళ్లీ అధికారంలోకి రావడంతో భారతీయ విద్యార్థులకు మరింత అనుకూలమైన ఇమిగ్రేషన్ విధానాలు, గ్రీన్ కార్డు జారీలో సడలింపులు ఇస్తారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

కెనడా ఆంక్షలు కఠినతరం

స్నేహపూర్వ వీసా విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలతో భారతీయ విద్యార్థులకు కెనడా



చాలాకాలంగా కీలక గమ్యస్థానంగా ఉంది. అయితే కఠినమైన ఇమిగ్రేషన్ నిబంధనలు, పరిమితమైన అనుమతులు దరఖాస్తుల సంఖ్య క్షీణతకు కారణమవుతున్నాయి. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ 2024లో 4,37,000 స్టడీ పర్మిట్లను కేటాయించడం అంతర్జాతీయ విద్య పట్ల కెనడా నిబద్ధతకు నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. భారతీయ విద్యార్థుల పట్ల యూకే మిశ్రమ వైఖరి కనబరిచింది. గ్రాడ్యుయేట్ విద్యార్థులు చదువులు పూర్తి చేసిన తర్వాత రెండేళ్ల పాటు పనిచేయడానికి అనుమతిస్తుంది. పీజీ విద్యార్థులు డిపెండెంట్లను తీసుకురావడంపై ఆంక్షలు విధించడం వారిని కలవరపెడుతోంది. విపరీతమైన రద్దీ, వనరుల కేటాయింపులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 2025 నాటికి విదేశీ విద్యార్థుల నమోదును 2,70,000కు పరిమితం చేయాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్ట్రేలియా వర్సిటీల్లో సీట్ల కోసం పోటీ మరింత పెరిగినప్పటికీ కెనడా తరహాలో పొడిగించిన పోస్టు స్టడీ వర్క్ ప్రయోజనాలు విద్యార్థులను ఊరిస్తున్నాయి.

నిబంధనలు సడలించిన జర్మనీ

భారతీయ విద్యార్థులకు జర్మనీ అత్యుత్తమ ఎంపికగా మారుతోంది. పోస్టు స్టడీ వర్క్ ఎంపికలు ప్రధాన ఆకర్షణగా మారాయి. నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తూ నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు ఏటా 90వేల వీసాలు జారీ చేయాలని ఆ దేశం యోచిస్తోంది. వీసా నిబంధనల్లో మార్పులతో విద్యార్థులు సంప్రదాయ గమ్యస్థానాలను పక్కన పెట్టి ఫ్రాన్స్, ఐర్లాండ్, ఫిన్లాండ్ తదితర ప్రత్యామ్నాయాలనూ అన్వేషిస్తున్నారు.

ఇమిగ్రేషన్ నిబంధనలు సవరించిన న్యూజిలాండ్

న్యూజిలాండ్ ప్రభుత్వం అక్రెడిటేటెడ్ ఎంప్లాయర్ వర్క్ వీసా (ఏఈడబ్ల్యూవీ) నిబంధనలు సవరించింది. సగటు వేతన పరిమితిని తొలగించడం, వలసదారులకు పని అనుభవాన్ని మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించడం, కొత్తగా సీజనల్ వీసాలను ప్రవేశపెట్టడం వంటి మార్పులు వచ్చే జనవరి నుంచి నాలుగు దశల్లో అమలులోకి రానున్నాయి. తాజా సవరణలతో ఎంప్లాయర్ అక్రెడిటేషన్ కోసం సగటు ప్రాసెసింగ్ సమయం 62 రోజుల నుంచి 14 రోజులకు తగ్గింది. అలాగే జాబ్ చెక్ ఉత్పాదకత రెట్టింపు కానుంది. ఉద్యోగుల సగటు వేతన పరిమితిని వచ్చే మార్చిలో తొలగించనున్నారు. ఈ మార్పుల ప్రభావం ప్రస్తుత ఉపాధి ఒప్పందాలపై ఉండదు. నివాస అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఉద్యోగులు తప్పనిసరిగా సంపాదించాల్సిన వేతనంలో ఏ మార్పు లేదు. ఏఈడబ్ల్యూవీ వలసదారులు తమ పిల్లలను తీసుకురావడానికి ఏటా కనీసం 55,844 న్యూజిలాండ్ డాలర్లు (దాదాపు రూ.27 లక్షలు) సంపాదించాల్సి ఉంటుంది.

అంత లేదు పుష్పా!

(మొదటి పేజీ తరువాయి)

స్పందన కనిపించలేదు. గత ఏడాది కాలంలో మూడుసార్లు టెండర్లు పిలిచినా.. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఆసక్తి చూపలేదు. అటవీశాఖ టన్ను ధర రూ.70 లక్షలుగా నిర్ణయించింది. కానీ, ఎక్కువ మంది టెండరుదారులు రూ.50 లక్షలకు మించి బిడ్లు వేయలేదు. టెండర్ రేటుకు బిడ్లు వేసిన ఒకరిద్దరు వ్యాపారులు కొనుగోలు చేసిన సరుకు కూడా 30% మించలేదు. 2022లో 500 టన్నులు వేలం వేయగా.. ఇంకా 4,900 టన్నులు మిగిలి ఉంది. అందులో 2023లో లాట్‌ల వారీగా 400-500 టన్నుల చొప్పున రెండు సార్లు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచారు. కానీ టెండర్ రేటు కన్నా తక్కువ కోట్ చేస్తూ బిడ్లు వచ్చాయి. అనుకున్న ధరకు కాస్త అటూఇటుగా ఉన్న బిడ్లను మాత్రమే ఖరారు చేసి, మిగతా లాట్‌ల వేలాన్ని అధికారులు ఆపేశారు.

కరోనా దెబ్బ...

2016-19 మధ్య నిర్వహించిన వేలంలో టన్ను ఎర్రచందనం రూ.70-75 లక్షలు పలికింది. నాటి గరిష్ఠ ధరనే ఇప్పుడు కనీస ధరగా నిర్ణయించారు. ఎర్రచందనాన్ని అధికారికంగా కొనే కంపెనీలు చైనాలో పది దాకా ఉన్నాయి. మన దేశానికి చెందిన వారెవరు వేలంలో కొన్నా... చైనా కంపెనీలకు అమ్మాల్సిందే. అయితే... కరోనా సమయంలో చైనా సంస్థలు తమ కార్యకలాపాలను నిలిపివేశాయి. ఎర్రచందనం ఆధారిత పరిశ్రమలు మూతపడ్డాయి. దీంతో... రాష్ట్రంలో నిర్వహించే ఎర్రచందనం వేలానికి స్పందన కనిపించడంలేదు. మరోవైపు.. జపాన్, మలేషియా, సింగపూర్, అరబ్ దేశాల్లో విలాసవంతమైన భవన నిర్మాణం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. ఎర్రచందనంతో తయారయ్యే ఫర్నిచర్, ఉపకరణాలకు డిమాండ్ పడిపోయిందని పేర్కొంటున్నారు. చైనాకు సంబంధించిన రెండు కంపెనీలు ఇప్పుడే తమ కార్యకలాపాలు ప్రారంభించాయని... మరికొన్నీ అదే బాటలు ఉన్నాయని తెలిసింది. దీంతో... ఎర్ర చందనానికి మునుపటి డిమాండ్ వస్తుందని అధికారులు ఆశాభావంతో ఉన్నారు.


ఇదీ కారణం...

ఎర్రచందనాన్ని ఆన్‌లైన్‌లో వేలం ద్వారా విక్రయించడానికి చేసిన ప్రయత్నం సత్ఫలితాలు ఇవ్వకపోవడం నిజమే! కరోనా కారణంగా చైనా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో అక్కడి పరిశ్రమలు భారీగా మూతపడ్డాయి. అందులో ఎర్రచందనం ఆధారిత పరిశ్రమలు కూడా ఉన్నాయి. ఎర్రచందనంతో తయారయ్యే ఫర్నిచర్, ఇతర పరికరాలు జపాన్, థాయ్‌లాండ్ దేశాలకు చైనా నుంచే ఎగుమతి అవుతాయి. చైనాలోనే పరిశ్రమలు మూతపడడంతో ఇతర దేశాల్లో కూడా కొనుగోలుదారులు తగ్గుముఖం పట్టారు. దీంతో గ్లోబల్ టెండర్లకు పెద్దగా స్పందన రాలేదు. అయినప్పటికీ... తక్కువ ధరకు అమ్మడానికి సిద్ధంగాలేం. చైనాలో మూతపడ్డ ఎర్రచందనం ఆధారిత పరిశ్రమలు ఇప్పుడిప్పుడే తెరుచుకుంటున్నాయి."

- సెల్వం, సీసీఎఫ్, తిరుపతి

శేషాచలమే కేంద్రం

'ప్రపంచంలో ఎక్కడా దొరకని సరుకు... మన శేషాచలం అడవుల్లోనే ఉండాది'... ఈ మాట నిజం. చైనా, జపాన్, మలేషియా, సింగపూర్, అరబ్ దేశాల్లో సంపన్నులు ఎర్రచందనం కర్రతో ఫర్నిచర్ చేయించుకుని హోదా ప్రదర్శిస్తారు. ఈ కర్రతో చేసే ఫర్నిచర్ 50 ఏళ్లయినా చెక్కు చెదరదు. ఈ డిమాండ్‌ను గమనించిన స్మగ్లర్లు శేషాచలం కొండల నుంచి ఎర్రచందనాన్ని నరికి అక్రమంగా దేశ విదేశాలకు సరఫరా చేసి కోట్లకు పడగలెత్తుతున్నారు. అటవీ సిబ్బందిని సైతం హత్య చేసి ఎర్రచందనం దుంగలను ఎత్తుకెళ్లిన సందర్భాలున్నాయి. ఈ అరుదైన సంపదను ప్రభుత్వ ఆదాయ వనరుగా మార్చుకోవాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర విభజన తర్వాత టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో స్మగ్లింగ్‌ను కట్టడి చేశారు. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌ను దాదాపు నిర్వీర్యం చేసింది. కనీస పర్యవేక్షణ లేకుండా ఐజీ పోస్టు తీసేసి పనిష్మెంట్ కింద ఒక ఎస్పీ స్థాయి అధికారిని బలవంతంగా నియమించడంతో శేషాచలంలో అరుదైన వృక్ష జాతితో పచ్చగా ఉన్న అటవీ ప్రాంతం మోడు బారింది.


అసెంబ్లీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్

రాజ్యాంగ రచనలో తెలుగు వారి పాత్ర చిరస్మరణీయం

అసెంబ్లీ కేలండర్‌ను ఆవిష్కరించిన చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా 2025వ సంవత్సరానికి నూతన కేలండర్‌ను ఆంధ్రప్రదేశ్ శాసనవ్యవస్థ ప్రత్యేకంగా రూపొందించింది. ఆనాటి రాజ్యాంగ రచనలో భాగస్వాములైన తెలుగు ప్రముఖులను స్మరించుకునేలా ఆ కేలండర్‌ను తీర్చిదిద్దింది. ఈ వినూత్న కేలండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉండవల్లిలోని నివాసంలో ఆవిష్కరించారు. రాజ్యాంగాన్ని రూపొందించడానికి బాధ్యత వహించిన నాయకులను, దార్శనికులను స్మరించుకోవడం సంతోషంగా ఉందని, రాజ్యాంగ రచనలో వారి పాత్ర చిరస్మరణీయమని సీఎం అన్నారు. ఆ ప్రముఖుల గొప్పతనాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు.

సామాజిక మాధ్యమాల్లో శాసన వ్యవస్థ సమాచారం

ఆంధ్రప్రదేశ్ శాసనవ్యవస్థ కోసం తొలిసారి ప్రవేశపెట్టిన సామాజిక మాధ్యమాల ఖాతాలను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. 'ఎక్స్', యూట్యూబ్‌లో @LegisAndhra ద్వారా, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో @Legisandhra ద్వారా శాసనవ్యవస్థ సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని జాతీయ మానవ హక్కుల సంఘం ఛైర్‌పర్సన్ విజయభారతి, రాష్ట్ర హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరూప్ గోస్వామి, రాష్ట్ర మంత్రి సవిత తదితరులు శనివారం దర్శించుకున్నారు.



ఎల్లుండి ఒకేషనల్ ట్రైనర్ పరీక్ష

అమరావతి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య ట్రైనర్ల ఎంపికలో భాగంగా ఒకేషనల్ ట్రైనర్ అభ్యర్థులకు మంగళవారం (31వ తేదీ) కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నట్టు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో 16 సెంటర్లు ఇందుకోసం ఏర్పాటుచేశామన్నారు. ఎంపికైన ట్రైనర్లు సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులను బోధిస్తారన్నారు.

జైలు ఇన్‌చార్జి వేధిస్తున్నారు

- విశాఖ సెంట్రల్ జైలు ఎదుట వార్డర్ల ఆందోళన

ఆరిలోవ (విశాఖపట్నం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని కేంద్ర కారాగారం ఎదుట జైలు వార్డర్లు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఆందోళనకు దిగారు. తమను విధి నిర్వహణ పేరుతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు వేధిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులు వచ్చే వరకు కదిలేది లేదంటూ భీష్మించారు. దీనిపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు వివరణ ఇస్తూ.. వార్డర్లు జయకృష్ణ, శంభు విధుల్లోకి వచ్చినప్పుడు తరచూ గంజాయితో వస్తున్నారని, దీనిపై సమాచారం ఉండడంతోనే వారిద్దరినీ తనిఖీ చేశామని తెలిపారు. జైలు నిబంధనలకు లోబడి, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే నడుచుకుంటున్నామన్నారు.

భార్యాపిల్లలను బలిపెట్టి రైతు బలవన్మరణం


నాగేంద్ర కుటుంబ సభ్యులు

సింహాద్రిపురం/పులివెందుల టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే అతని వ్యసనం! కానీ అరుగాలం కష్టించినా పెట్టుబడులూ రాకపోగా అప్పులపాలయ్యాడు. రుణదాతల ఒత్తిడి ఎక్కువ కావడంతో తట్టుకోలేక.. భార్య, ఇద్దరు పిల్లలను బలిపెట్టి తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. కడప జిల్లా సింహాద్రిపురం మండలం దుద్దెకుంట్ల గ్రామానికి చెందిన రైతు కొమెర నాగేంద్ర(41)కు భార్య వాణి(33), కుమారుడు భార్గవ్ (13), కుమార్తె గాయత్రి(12) ఉన్నారు. నాగేంద్ర తన ఎకరన్నర పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేసేవారు. చీడపీడలు, తెగుళ్లతో సరైన దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.20 లక్షలు అప్పులపాలయ్యారు. వడ్డీలు పెరిగిపోవడం, రుణ దాతల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో నాగేంద్ర తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తోట వద్దకు తొలుత భార్యను, అనంతరం కూతురిని తర్వాత కుమారుడిని బైక్‌పై తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరిని గొంతుకు తాడు బిగించి హతమార్చి, తానూ అక్కడే గేటుకు ఉరివేసుకున్నారు. రాత్రి పొద్దుపోయాక కూడా వారు ఇంటికి రాకపోవడంతో నాగేంద్రకు తల్లి ఫోన్ చేయగా సెల్ స్విచ్చాఫ్ వచ్చింది. ఈ విషయం తెలిసి బంధువులు, గ్రామస్థులు గాలించగా అర్ధరాత్రి దాటాక తోట దగ్గర నాగేంద్ర, వాణి, భార్గవ్, గాయత్రి విగతజీవులై కనిపించారు. ఘటనపై కలెక్టర్ శ్రీధర్ ఆరా తీశారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ మాట్లాడుతూ.. అప్పుల బాధతో భార్యాపిల్లలను హత్య చేసి నాగేంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆత్మహత్యకు ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా.. ఈ ఘటనపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు.

ఐఎంఏ రాష్ట్ర శాఖకు జాతీయ పురస్కారాలు



జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్న ఐఎంఏ రాష్ట్ర శాఖ సభ్యులు

గవర్నర్‌పేట, డిశంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 99వ జాతీయ మహాసభల్లో ఆంధ్రప్రదేశ్ శాఖ సభ్యులకు పలు జాతీయ పురస్కారాలు లభించాయి. హైదరాబాద్‌లో శుక్రవారం ప్రారంభమైన మహాసభలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు (నంద్యాల) డాక్టర్ గుర్రాల రవికృష్ణకు సామాజిక సేవలో డాక్టర్ జ్యోతిప్రసాద్ గంగూలీ స్మారక పురస్కారం, చెవి, ముక్కు, గొంతు వైద్యనిపుణులు డాక్టర్ మధుసూదనరావు (నంద్యాల)కు ఐఎంఏ జీవితకాల సాఫల్య పురస్కారం లభించింది. ఐఎంఏలో జాతీయ స్థాయిలో సేవలు చేసిన సేవలకు డాక్టర్ రాయపు రమేష్ (తిరుపతి)కు డాక్టర్ ఏకెఎన్ సిన్హా పురస్కారం లభించింది. గత రెండు సంవత్సరాలుగా ఏపీ శాఖ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన డాక్టర్ పోలవరపు ఫణిధర్, ఎక్కువ రక్తదాన శిబిరాలు నిర్వహించిన కావలి ఐఎంఏ శాఖకు, ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి (గుంటూరు), మహిళా విభాగం నుంచి డాక్టర్ హేమలత (అనంతపురం), రాజమండ్రి ఐఎంఏ శాఖ కార్యదర్శి డాక్టర్ పిడుగు విజయభాస్కర్‌కు ఐఎంఏ జాతీయ అధ్యక్షుని ప్రత్యేక ప్రశంసాపత్రాలు లభించాయి. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనీల్ నాయక్, నూతన అధ్యక్షుడు డాక్టర్ భానుషాలి నుంచి వీరు పురస్కారాలు అందుకున్నారు. జాతీయ పురస్కారాలు అందుకున్న వారిని ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు వీఎస్ ప్రసాద్, శ్రీహరిరావు, డాక్టర్ పిఎస్ శర్మ, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ కిషోర్, డాక్టర్ మూర్తి, శ్రీనివాసరాజు, డాక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

తారలు.. దిగివచ్చిన వేళ!

చిత్ర పరిశ్రమ ప్రముఖులను ఏ ముఖ్యమంత్రి ఎక్కువగా భయపెట్టారు? జగన్మోహన్‌రెడ్డి - రేవంత్‌రెడ్డిలలో ఎవరు మంచివాళ్లు? ఎవరు కాదు?... సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా ఈ చర్చ రచ్చ చేస్తోంది. రేవంత్‌రెడ్డితో పోల్చితే జగన్‌రెడ్డి ఎంత మంచివాడో తెలుసా? అని జగన్ అభిమానులు ప్రచారం చేసుకోగా, శాసనసభలో మా ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలో వాస్తవం లేదంటారా? సినిమా వాళ్లకు ఎందుకంత బలుపు? అని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, తెలంగాణ వాదులమని చెప్పుకొనేవాళ్లు విరుచుకుపడ్డారు. దీంతో సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన ఘటన పక్కకు పోయి, ఆంధ్రా-తెలంగాణ వివాదం తెరమీదకు వచ్చింది. గోటితో పోయే వివాదం గొడ్డలి దాకా వచ్చింది. ఫలితంగా చిత్ర పరిశ్రమ ప్రముఖులు వణికిపోయారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు ఆయనకు చిత్ర పరిశ్రమపై కోపం వచ్చింది. సినిమాల ప్రదర్శనపై ఆంక్షలు విధించడం ద్వారా బడా బడా స్టార్లు తన

> సంధ్యా థియేటర్ సంఘటనలో పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్‌తోపాటు మాజీ మంత్రి కేటీఆర్ ఖండించడం కూడా అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. తనకు రాజకీయాలతో సంబంధం లేదని అల్లు అర్జున్ చెప్పుకుంటున్నప్పటికీ ఈ ఖండనల వల్ల ఆయనకు రాజకీయం అంటుకుంది. అరెస్టు సమయంలోనూ, జైలు నుంచి తిరిగి వచ్చినప్పుడు అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి సినిమా ప్రముఖులు బారులు తీరడం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌కు కోపం తెప్పించి ఉంటుంది. ఆయనకు కాలు విరిగిందా? చేయి విరిగిందా? పరామర్శలు ఎందుకు? అని ముఖ్యమంత్రి నిలదీశారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తప్పు చేశారు. ఆయన కూడా అల్లు అర్జున్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి సిల్లీ తప్పులు చేయడం చంద్రబాబుకు అలవాటే. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌తో చంద్రబాబుకు సత్సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబును రేవంత్ కూడా గౌరవిస్తున్నారు. అల్లు అర్జున్‌ను పరామర్శించడం అంటే రేవంత్ సర్కార్ తప్పు చేసిందన్న భావన ప్రజల్లో కల్పించడమే అవుతుంది.

వద్దకు దేకుతూ వచ్చి సాగిలపడేలా చేసుకున్నారు. ఇప్పుడు పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంఘటనతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా చిత్ర పరిశ్రమను గడగడలాడించారు. అయితే, జగన్‌రెడ్డిలాగా రేవంత్‌రెడ్డి మొరటుగా వ్యవహరించకుండా, సంధ్యా థియేటర్ ఘటనను చట్టపరంగా తనకు అనుకూలంగా మార్చుకున్నారు. తన చర్యలు, ప్రకటనల ద్వారా చిత్ర పరిశ్రమను దారిలోకి తెచ్చుకోవడంతోపాటు తెలంగాణ ప్రజల దృష్టిలో తానే నిజమైన స్టార్ అని రుజువు చేసుకున్నారు. అల్లు అర్జున్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలను దాదాపు 70 శాతం మంది ప్రజలు సమర్థిస్తున్నట్టు సమాచారం. టీ కప్పులో తుఫాను వంటి ఒక సమస్య ఇంత రచ్చకు దారి తీయడం వెనుక కారణం ఏమిటి? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అంత కోపం ఎందుకు వచ్చింది? అనే విషయం ఇప్పుడు చూద్దాం!

వరుస పొరపాట్లు...

సంధ్యా థియేటర్ సంఘటనలో ఒక మహిళ మృతి చెందిన వెంటనే పుష్ప-2 సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన అల్లు అర్జున్ బేషరతుగా క్షమాపణలు చెప్పి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదు. అంతకు ముందు, ఆ సినిమా సక్సెస్ మీట్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును అల్లు అర్జున్ మరచిపోయారు. ఈ పొరపాటుకు విచారం వ్యక్తం చేయాలని ముఖ్యమంత్రి సన్నిహితులు కొందరు అల్లు అర్జున్‌కు సూచించగా, రాజకీయాలతో తనకు సంబంధం లేదంటూ ఆయన ఆ సూచనను పెడచెవిన పెట్టారు. దీంతో ప్రభుత్వ పెద్దలకు కోపం వచ్చింది. అంతే, రేవతి మృతి సంఘటనలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఒక రాత్రి అతను జైల్లో ఉండాల్సి వచ్చింది. హైకోర్టు నుంచి మధ్యంతర బెయిల్ పొందినప్పటికీ పోలీసుల విచారణపై స్టే లేనందున అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు రప్పించి గంటలపాటు విచారించారు. అదే సమయంలో ఇకపై తెలంగాణలో సినిమా టికెట్ ధరలను పెంచడానికి అనుమతి ఇవ్వబోమని, బెనిఫిట్ షోలకు కూడా పర్మిషన్ ఇవ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభ సాక్షిగా ప్రకటించారు.

ముఖ్యమంత్రి సన్నిహితులు సూచించిన విధంగా అల్లు అర్జున్ విచారం వ్యక్తం చేసి ఉంటే వ్యవహారం ఇంత దూరం వచ్చి ఉండేది కాదు. ఫలితంగా కడవడంత గుమ్మడి కాయ కత్తిపీటకు లోకువ అన్నట్టుగా ఎంత పెద్ద స్టార్ అయినా పొలిటికల్ స్టార్ ముందు తల వంచాల్సిందేనని రేవంత్‌రెడ్డి రుజువు చేశారు. కారణమేదైనా, గోటితో పోవాల్సిన దానిని గొడ్డలి దాకా తెచ్చుకున్నారు. తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవు, సినిమా టికెట్ ధరలను పెంచుకోనివ్వమని ముఖ్యమంత్రి ప్రకటించడంతో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు వణికిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శాంతింపజేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. ఇంతకూ బెనిఫిట్ షోలు, పెద్ద సినిమాల విడుదల సందర్భంగా టికెట్ల ధరలు పెంచుకోవడం అనే సంస్కృతి ఎందుకొచ్చింది? దాన్ని ఎవరు తీసుకొచ్చారు? గతంలో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు బాధితుల సహాయార్థం బెనిఫిట్ షోలను ప్రదర్శించేవారు. ఇప్పుడు సినిమాలపై పెట్టిన పెట్టుబడిని త్వరితగతిన రాబట్టుకోవడానికి ప్రత్యేక షోలు వేస్తున్నారు.

చిన్నా-పెద్దా 'చిత్రాలు'


చిత్ర పరిశ్రమలో ఇటీవలి కాలంలో అనేక పెడ ధోరణులు ప్రవేశించాయి. సినిమా నిర్మాణ వ్యయం అదుపు తప్పింది. పాన్ ఇండియా సంస్కృతి వచ్చింది. ప్రాంతీయ భాషా చిత్రాల్లో నటించే వారిని పాన్ ఇండియా స్టార్లుగా ప్రచారం చేయడం మొదలైంది. ఒక సినిమా పూర్తి కావడానికి వెయ్యి కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. దీంతో పెద్ద సినిమాలు, చిన్న సినిమాలు అనే విభజన జరిగింది. భారీగా ఖర్చు పెట్టి గ్రాఫిక్స్ మాయాజాలంతో నటన, కథతో సంబంధం లేని సినిమాలను పెద్ద సినిమాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. సృజనాత్మకత స్థానంలో గ్రాఫిక్స్ చేరాయి. మలయాళ చిత్ర పరిశ్రమనే తీసుకుందాం! అక్కడ తక్కువ బడ్జెట్‌తో అద్భుతమైన కథలను తెరకెక్కిస్తున్నారు. ఊరూ పేరూ తెలియని నటులతో సినిమాలు తీసి ప్రేక్షకాదరణ పొందుతున్నారు. భాష తెలియకపోయినా తెలుగు వాళ్లు కూడా మలయాళ సినిమాలను చూసి ఆనందిస్తున్నారు. తెలుగులో బాహుబలి, ఆర్ఆర్ఆర్, పుష్ప వంటి సినిమాలతో అతి భారీ బడ్జెట్ సినిమాలు తీశారు. ఈ సినిమాలకు ఇతర భాషలలో కూడా ఆదరణ లభించడంతో తెలుగు సినిమా ఖ్యాతి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చేరిందని గొప్పలు చెప్పుకున్నారు. ఉదాహరణకు పుష్ప-2 సినిమాకు రూ.1350 కోట్లు ఖర్చు చేశారని ప్రచారం జరిగింది. ఇందులో సింహభాగం ఆ సినిమాలో లీడ్ రోల్ పోషించిన అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ పారితోషికంగా తీసుకున్నారు. అల్లు అర్జున్‌కు 350 కోట్లు, సుకుమార్‌కు 150 కోట్లు చెల్లించినట్టు వార్తలు వచ్చాయి. మన దేశంలో ఇప్పటివరకు అత్యధిక పారితోషికం తీసుకున్న నటుడిగా అల్లు అర్జున్ రికార్డులకు ఎక్కారు. నటులకు, దర్శకులకు వందల కోట్ల పారితోషికం చెల్లించడం తెలుగు చిత్ర పరిశ్రమలోనే జరుగుతోంది. దీంతో తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రజలలో సానుకూల అభిప్రాయం స్థానే నెగెటివ్ భావన ఏర్పడింది. ఇంత భారీ బడ్జెట్ సినిమాలు అవసరమా? అనే చర్చ మొదలైంది. ఒక సినిమా నిర్మాణానికి రెండు మూడేళ్ల సమయం కూడా తీసుకుంటున్నారు. ఫలానా హీరోకు అన్ని వందల కోట్లు, ఇన్ని వందల కోట్లు చెల్లించారన్న వార్తలు వస్తుండటంతో ప్రజల్లో సహజంగానే తెలియని అసూయ ఏర్పడుతోంది. వెరసి చిత్ర పరిశ్రమ పట్ల ఇప్పుడు ఎవరికీ సానుభూతి లేకుండా పోయింది. భారీ బడ్జెట్ సినిమాల పేరిట ప్రేక్షకులను దోచుకుంటున్నారన్న అభిప్రాయం క్రమంగా ప్రజల్లో ఏర్పడింది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా పెట్టుబడులతో పోల్చితే లాభాలు అందుకు తగినట్టుగా ఉండని సందర్భాలే అధికంగా ఉంటున్నాయి. బాహుబలి సినిమా నిర్మాతలకు, కొనుగోలుదారులకు అసలు లాభాలు వచ్చాయో లేదో తెలియని పరిస్థితి. భారీ బడ్జెట్‌తో తీస్తున్న తెలుగు సినిమాలతో పోల్చితే స్వల్ప బడ్జెట్‌తో మలయాళంలో నిర్మిస్తున్న చిత్రాలకే అనేక రెట్ల లాభాలు వస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. సందేశాత్మక చిత్రాలు అనేవి తెలుగులో దాదాపు కనుమరుగయ్యాయి. కథా బలంతో పాటు నటనకు ఆస్కారం ఉన్న మలయాళ చిత్రాలను తెలుగువాళ్లు కూడా ఆదరిస్తున్నప్పుడు మనం కూడా ఆ దిశగా ప్రయత్నం చేద్దామన్న ఆలోచన మనవాళ్లకు రావడం లేదు. పుష్ప చిత్రంలో అల్లు అర్జున్ పోషించిన పుష్పరాజ్ పాత్ర ఎర్ర చందనం స్మగ్లర్‌ది. స్మగ్లర్‌ను కథానాయకుడిగా చూపించడం ఏమిటి? అని ప్రముఖ అవధాని గరికపాటి నరసింహారావు ప్రశ్నించగా, పోలీసు అధికారిని దుస్తులు విప్పించి నగ్నంగా నడిపించిన పాత్ర పోషించిన వారికి జాతీయ పురస్కారం ఇవ్వడం ఏమిటి? అని తెలంగాణ మంత్రి సీతక్క ప్రశ్నించారు. ఈ ప్రశ్నలలో హేతుబద్ధత లేకపోలేదు.

మారిన 'హీరోలు'

గతంలో కథానాయకుడి పాత్ర పోషించినవారు చెడుపై పోరాటం చేసేవారు. ఇప్పుడు కథానాయకుడే విలన్ లక్షణాలు పుణికి పుచ్చుకుంటున్నారు. దీని ప్రభావం సమాజంపై కూడా పడుతోంది. ఒకప్పుడు చెడు వ్యసనాలు ఉన్న మగ పిల్లలను ఆడపిల్లలు ఇష్టపడేవారు కారు. ఇప్పుడు ఏ వ్యసనం లేని వాడిని పప్పుగాడు అని ఆడపిల్లలు ముద్దుగా పిలుచుకుంటున్నారు. సమాజం పోకడలనే తాము సినిమాలలో వాడుకుంటున్నామని చిత్ర పరిశ్రమకు చెందినవాళ్లు అంటుండగా, సినిమాల ప్రభావంతోనే యువత చెడిపోతోందన్న వాదన అవతల పక్షం నుంచి వస్తోంది. ఇప్పుడు మళ్లీ అసలు విషయానికి వద్దాం!

> సినిమా పరిశ్రమ వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తోంది. ఈ వాస్తవాన్ని అనుచిత వ్యాఖ్యలు చేసేవారు గుర్తుంచుకోవాలి. అతి భారీ బడ్జెట్ చిత్రాలు నిర్మించడం, పెట్టుబడులు తిరిగి రాబట్టుకునేందుకు టికెట్ ధరలను వెయ్యి రూపాయల వరకు పెంచడం, ప్రేక్షకులపై భారం మోపడం దీర్ఘకాలంలో మంచిది కాదని చిత్ర పరిశ్రమ గుర్తించాలి.

సినిమాల విడుదల సందర్భంగా గతంలో కూడా తొక్కిసలాటలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో అవి వివాదాస్పదం కాలేదు. ఎందుకంటే అప్పట్లో సినిమా నటులను ప్రజలు ఇష్టపడేవారు, గౌరవించేవారు. ఇప్పుడు సినిమా నటులకు స్టార్‌డమ్ మాత్రమే ఉంటోంది. గౌరవం ఉండటం లేదు. దీనికి తోడు తెలుగునాట రాజకీయాలు ఎక్కువ. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నియోజకవర్గంలో వైసీపీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి కోసం అల్లు అర్జున్ ప్రచారం చేశారు. అల్లు అర్జున్‌కు అంత స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆయన మద్దతు తెలిపిన అభ్యర్థి ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అంటే ప్రజలు సినిమా వాళ్లను స్టార్లుగానే చూస్తారుగానీ, ఎన్నికలకు వచ్చేసరికి వారిని గుడ్డిగా ఆదరించరని స్పష్టమవుతోంది. ఈ వాస్తవం తెలుసుకోకుండా నటులు స్టార్‌డమ్‌ను తలకెక్కించుకొని తమను తాము 'డెమీ గాడ్స్'గా భావిస్తూ భ్రమల్లో బ్రతుకుతుంటారు. బౌన్సర్స్‌ను కాపలాగా పెట్టుకొని దర్పం వొలకబోస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సంధ్య థియేటర్ సంఘటన జరిగింది. తొక్కిసలాట సంఘటనపై అల్లు అర్జున్ వెంటనే స్పందించకపోవడం, తర్వాత 25 లక్షల పరిహారాన్ని రేవతి కుటుంబానికి ప్రకటించడం జరిగింది. అన్నిటికి మించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటనను తప్పు పట్టే విధంగా విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు. ఫలితంగా ఈ వివాదం రాజకీయ మలుపు తిరిగింది. విచిత్రం ఏమిటంటే, వాస్తవ పరిస్థితిని అల్లు అర్జున్‌కు చెప్పడానికి ఎవరూ సిద్ధపడలేదట! హీరో గారికి కోపం వస్తుంది, మూడ్ మారిపోతుందని ఆయన చుట్టూ ఉన్నవారు అన్నారట! అనేక ఎగుడు దిగుడులు చూసిన అల్లు అరవింద్ అయినా తండ్రిగా కల్పించుకొని విలేకరుల సమావేశం వద్దని కుమారుడిని వారించి ఉండాల్సింది. అల్లు అర్జున్ తండ్రి మాట కూడా వినరు అని అంటారు. మొత్తం మీద ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టుగా ఈ వ్యవహారం పుణ్యమా అని మొత్తం చిత్ర పరిశ్రమ నష్టపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వంతో మధ్యవర్తిత్వం జరపడానికి కూడా చిత్ర పరిశ్రమ ప్రముఖులు సాహసం చేయలేకపోయారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు చొరవ తీసుకొని చిత్ర పరిశ్రమ ప్రముఖులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. సినిమాల నిర్మాణానికి అంతర్జాతీయ వేదికగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు దిల్ రాజు ప్రకటించారు. ఇందుకోసమైతే సదరు సమావేశం అవసరమే లేదు. అంటే, తమ మనసులోని కోర్కెలను ముఖ్యమంత్రి ముందు చెప్పుకోవడానికి కూడా చిత్ర పరిశ్రమ పెద్దలు సాహసం చేయలేకపోయారు. శాసనసభలో తాను చేసిన ప్రకటనకు కట్టుబడి ఉంటానని రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ ధరల పెంపు విషయం గురించి చిత్ర పరిశ్రమ ప్రముఖులు అడగలేకపోయారని భావించాలి. ముఖ్యమంత్రిని శాంతింప చేయడమే ప్రధాన అజెండా కనుక ఆ దిశగా సినీ ప్రముఖులు కొంత మేరకు సక్సెస్ అయ్యారని భావించవచ్చు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ మాత్రం మొహమాటపడకుండా సినిమా వాళ్లకు షరతులు విధించారు. ప్రభుత్వ సహకారం కావాలంటే మాదక ద్రవ్యాలను అరికట్టడంలో, టూరిజం ప్రమోషన్‌కు సినీ ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రచారం చేయాలని కరాఖండీగా చెప్పారు. దీంతో తానేమిటో రేవంత్‌రెడ్డి రుజువు చేసుకున్నారు. ముఖ్యమంత్రిని శాంతింపజేయడానికి సినిమా ప్రముఖులు శాలువాలు కప్పి బొకేలు ఇవ్వడంలో పోటీపడ్డారు. సమీకృత గురుకులాల అభివృద్ధికి సినిమాల ప్రదర్శనపై శిస్తు విధిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అన్నిటికీ తలలు ఊపిన సినిమా ప్రముఖులు తమకు ఏం కావాలో అడగలేకపోయారు. మొత్తమ్మీద అల్లు అర్జున్ ప్రారంభంలోనే కొంత లౌక్యం ప్రదర్శించి ఉంటే ఈ వ్యవహారం టీ కప్పులో తుఫానులా తేలిపోయి ఉండేది. తెలుగు స్టార్లు, ఆ మాటకు వస్తే ఏ భాషకు చెందిన స్టార్లయినా పులులు, సింహాలు కారని, రాజకీయ అధికారానికి తలవంచకపోతే తిప్పలు తప్పవని ఈ వ్యవహారంతో మరోమారు స్పష్టమైంది.



అనుచిత వ్యాఖ్యలు తగవు...

అయితే, ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలతోపాటు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ వంటి వాళ్లు కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించే ప్రయత్నం చేశారు. హైదరాబాద్‌లో ఉండాలంటే అణిగి మణిగి ఉండాలని, లేదంటే ఆంధ్రాకు వెళ్లిపోవాలని హెచ్చరికలు చేయడం సమంజసం కాదు. మొట్టమొదటగా తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పుడు మద్రాసులో స్థిరపడిన తెలుగు చిత్ర పరిశ్రమను హైదరాబాద్‌కు ఆహ్వానించారు. అక్కినేని నాగేశ్వరరావు, డి.రామానాయుడు, కృష్ణ వంటి వాళ్లకు స్టూడియోల నిర్మాణాలకు భూములు కేటాయించారు. సినిమా ప్రముఖుల నివాసాల కోసం ప్రస్తుత ఫిల్మ్‌నగర్‌లోని స్థలాలు కూడా ఆయనే కేటాయించారు. చెన్నారెడ్డితోపాటు ఆ తర్వాత ముఖ్యమంత్రుల కృషి కారణంగా చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇప్పుడొక దురదృష్టకర సంఘటన జరిగిన కారణంగా... ఉంటే ఉండండి లేదంటే పోండని హెచ్చరించడం సమర్థనీయం కాదు. ఇలాంటి ధోరణులను అరికట్టాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉంటుంది. స్టార్లుగా వెలుగొందుతున్న వాళ్లు కూడా అహం తగ్గించుకోవాలి. పుష్ప-2 సినిమాలో స్మగ్లర్‌తో ఫొటో దిగడానికి నిరాకరించిన ముఖ్యమంత్రినే మార్చినట్టు చూపించి ఉండవచ్చు కానీ, నిజ జీవితంలో ముఖ్యమంత్రులతో పెట్టుకుంటే ఏమవుతుందో యావత్ సినిమా పరిశ్రమకూ ఇప్పుడు తెలిసి వచ్చింది. సంధ్యా థియేటర్ సంఘటనలో పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి కేటీఆర్ ఖండించడం కూడా అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. తనకు రాజకీయాలతో సంబంధం లేదని అల్లు అర్జున్ చెప్పుకుంటున్నప్పటికీ ఈ ఖండనల వల్ల ఆయనకు రాజకీయం అంటుకుంది. అరెస్టు సమయంలోనూ, జైలు నుంచి తిరిగి వచ్చినప్పుడు అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి సినిమా ప్రముఖులు బారులు తీరడం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌కు కోపం తెప్పించి ఉంటుంది. ఆయనకు కాలు విరిగిందా? చేయి విరిగిందా? పరామర్శలు ఎందుకు? అని ముఖ్యమంత్రి నిలదీశారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తప్పు చేశారు. ఆయన కూడా అల్లు అర్జున్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి సిల్లీ తప్పులు చేయడం చంద్రబాబుకు అలవాటే. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చంద్రబాబుకు సత్సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబును రేవంత్ కూడా గౌరవిస్తున్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌ను పరామర్శించడం అంటే రేవంత్ సర్కార్ తప్పు చేసిందన్న భావన ప్రజల్లో కల్పించడమే అవుతుంది.

తప్పదు... తగ్గాలి

ఇప్పటికైనా చిత్ర పరిశ్రమ ప్రముఖులు, ముఖ్యంగా స్టార్లు తమ పరిధులను గుర్తించి మెలగడం మంచిది. చిత్ర పరిశ్రమ మొత్తం టర్నోవర్ ఏడాదికి రెండు మూడు వేల కోట్లకు మించి ఉండదు. ఇంతకంటే ఎక్కువ టర్నోవర్‌తో వ్యాపారాలు చేస్తున్న సంస్థలు హైదరాబాద్‌లో వేల సంఖ్యలో ఉన్నాయి. వారెవరికీ దక్కని గుర్తింపు, గౌరవం చిత్ర పరిశ్రమ వారికి వస్తున్నాయంటే అందుకు గ్లామర్ ప్రధాన కారణం. ఈ గ్లామర్‌ను గ్లామర్‌గానే చూడకుండా తాము ఇంత, తాము అంత అనుకుంటే ఎదురు దెబ్బలు తప్పవు. సినిమా పరిశ్రమ వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తోంది. ఈ వాస్తవాన్ని అనుచిత వ్యాఖ్యలు చేసేవారు గుర్తుంచుకోవాలి. అతి భారీ బడ్జెట్ చిత్రాలు నిర్మించడం, పెట్టుబడులు తిరిగి రాబట్టుకునేందుకు టికెట్ ధరలను వెయ్యి రూపాయల వరకు పెంచడం, ప్రేక్షకులపై భారం మోపడం దీర్ఘకాలంలో మంచిది కాదని చిత్ర పరిశ్రమ గుర్తించాలి. మితిమీరిన అహంకారం వల్ల అనర్థమే తప్ప ప్రయోజనం ఉండదు. అల్లు అర్జున్ వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. పుష్ప-2 సినిమా సక్సెస్‌ను కూడా ఆయన ఆస్వాదించలేకపోతున్నారు. సినిమా బాగా రావడానికి అల్లు అర్జున్ విపరీతంగా కష్టపడతారని, ఆయనలా కష్టపడే నటుడు మరొకరు లేరని నిర్మాతలు చెబుతుంటారు. కష్టపడే మనస్తత్వంతో పాటు కాస్త వినయం కూడా అలవర్చుకుంటే అల్లు అర్జున్ మరిన్ని విజయాలను అందుకుంటారు. మొన్నటి సమావేశం తర్వాత వివాదం ప్రస్తుతానికి సమసిపోయింది. ముఖ్యమంత్రి చెబుతున్నట్టుగా మునుముందు ఇటువంటి దురదృష్టకర ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత చిత్ర పరిశ్రమ పైనే ఉంటుంది. ప్రేక్షకులలో నటులపై ఉండే క్రేజ్‌ను సినిమా ప్రమోషన్లకు ఉపయోగించుకొనే విధానానికి చిత్ర పరిశ్రమ ఇకనైనా స్వస్తి చెప్పాలి. సినిమా విడుదల సందర్భంగా మొదటి రోజు మొదటి ఆటను ప్రేక్షకులతో కలసి కూర్చొని థియేటర్లలో చూసే విధానానికి స్టార్లు కూడా దూరంగా ఉండాలి. ఏ సినిమాకైనా మొదటి ఆటలో ఆ హీరో అభిమానులు అధికంగా వస్తారు. అలాంటప్పుడు వారి మధ్యకు వెళ్లి సినిమా చూస్తే తొక్కిసలాట జరగకుండా ఉంటుందా? మొత్తమ్మీద 'అంతా నీవల్లే' అనే నిందను బన్నీ భరించాల్సి వస్తోంది. ఇతర స్టార్లు భవిష్యత్తులో ఇలాంటి దుస్థితి తమ దాకా రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని ఆశిద్దాం!

> ఇప్పుడు సినిమా నటులకు స్టార్‌డమ్ మాత్రమే ఉంటోంది. గౌరవం ఉండటం లేదు. దీనికి తోడు తెలుగునాట రాజకీయాలు ఎక్కువ. గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల నియోజకవర్గంలో వైసీపీ నుంచి పోటీ చేసిన అభ్యర్థి కోసం అల్లు అర్జున్ ప్రచారం చేశారు. అల్లు అర్జున్‌కు అంత స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆయన మద్దతు తెలిపిన అభ్యర్థి ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. అంటే ప్రజలు సినిమా వాళ్లను స్టార్లుగానే చూస్తారుగానీ, ఎన్నికలకు వచ్చేసరికి వారిని గుడ్డిగా ఆదరించరని స్పష్టమవుతోంది. ఈ వాస్తవం తెలుసుకోకుండా నటులు స్టార్‌డమ్‌ను తలకెక్కించుకొని తమను తాము 'డెమీ గాడ్స్'గా భావిస్తూ భ్రమల్లో బ్రతుకుతుంటారు. బౌన్సర్స్‌ను కాపలాగా పెట్టుకొని దర్పం వొలకబోస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సంధ్య థియేటర్ సంఘటన జరిగింది.

> శాసనసభలో తాను చేసిన ప్రకటనకు కట్టుబడి ఉంటానని రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో బెనిఫిట్ షోలు, సినిమా టికెట్ ధరల పెంపు విషయం గురించి చిత్ర పరిశ్రమ ప్రముఖులు అడగలేకపోయారని భావించాలి. ముఖ్యమంత్రిని శాంతింపచేయడమే ప్రధాన అజెండా కనుక ఆ దిశగా సినీ ప్రముఖులు కొంత మేరకు సక్సెస్ అయ్యారని భావించవచ్చు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ మాత్రం మొహమాటపడకుండా సినిమా వాళ్లకు షరతులు విధించారు. ప్రభుత్వ సహకారం కావాలంటే మాదక ద్రవ్యాలను అరికట్టడంలో, టూరిజం ప్రమోషన్‌కు సినీ ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రచారం చేయాలని కరాఖండీగా చెప్పారు. దీంతో తానేమిటో రేవంత్‌రెడ్డి రుజువు చేసుకున్నారు. ముఖ్యమంత్రిని శాంతింపజేయడానికి సినిమా ప్రముఖులు శాలువాలు కప్పి బొకేలు ఇవ్వడంలో పోటీపడ్డారు. సమీకృత గురుకులాల అభివృద్ధికి సినిమాల ప్రదర్శనపై శిస్తు విధిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అన్నిటికీ తలలు ఊపిన సినిమా ప్రముఖులు తమకు ఏం కావాలో అడగలేకపోయారు. మొత్తమ్మీద అల్లు అర్జున్ ప్రారంభంలోనే కొంత లౌక్యం ప్రదర్శించి ఉంటే ఈ వ్యవహారం టీ కప్పులో తుఫానులా తేలిపోయి ఉండేది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

మారుపాకలో బాల్య మధురిమలు



> అప్పుడు సినిమాలు, టీవీలు లేవు కాబట్టి సమయం అంతా పరిసరాల కమనీయ దృశ్యాలే కంటి నిండ కదలాడేవి. విద్యుత్ లేదు కాబట్టి రాత్రి కిరోసిన్ నూనెతో ఎక్కాలను, ఖందిల్లను వెలిగించేవారు. రాత్రిపూట మసిబడ్డ బుగ్గలను తుడవడం, కాలిన వత్తులను సరిచేయడం జాగ్రత్తగా నూనె పోయడం ఒక నైపుణ్యంతో కూడుకున్న పని.

నా చిన్ననాటి జ్ఞాపకాలు, వేములవాడ మండలం మారుపాక గ్రామం - కోనరావుపేట మండలం నాగారం గ్రామాల నుండి మొదలవుతాయి. అందులో మారుపాకలో మా కుటుంబం నివసించిన ఊరి ఆవలి గుడిసె ప్రత్యేకం. మాకు రెండు గ్రామాలలో ఆస్తులు ఉన్నాయి. పంచుకుంటే మారుపాకలో ఇళ్లు (గడీ) రాలేదు. అందుకే ఊరి బయట గుడిసెలో కాలం గడిపి నాగారంలో ఒక చిన్న ఇల్లు కట్టారు. అయితే మా తాత గారు (అమ్మ తండ్రిగారు) ఇంటి నిర్మాణానికి బాగా సహాయం చేశారని చెబుతుండేవారు. ఆ గ్రామం పెద్ద అడవిలో ఉండేది కాబట్టి ఎక్కువ కాలం మారుపాకలో గుడిసెలోనే కాలం గడిచిపోయింది. కానీ చివరికి నాన్న నాగారంలోనే చనిపోవడం జరిగింది. అందుకే ఆ గ్రామాన్నే నా వ్యవసాయ క్షేత్రంగా ఎంచుకున్నాను. ఎన్నిసార్లో ఆ గ్రామాన్ని వదిలిపెట్టే పరిస్థితులు వచ్చినా నన్ను మాత్రం వెంటాడి తిరిగి గ్రామానికి తెచ్చుకున్నది నాగారం గ్రామం. ఆ అనుబంధం కూడా చెరిగిపోనిది. ఆర్థికంగా ఎంతో నష్టం జరిగినా సంతోషంగా భరించాను. నా సమయం వృథా అయినా, ఎంతో మంది తీవ్రమైన విమర్శలు చేసినా నాకు మాత్రం సంతృప్తినిచ్చింది నాగారం.

మారుపాక గుడిసెలలో పొద్దున్నుంచి రాత్రి పడుకునే వరకు దోమలు, ఈగలు, కోళ్లు, పశువులు, లేగదూడలు, చెట్లు, చేమలు, పువ్వులు, పొదలు, పురుగులు దాదాపు వెన్నంటే ఉండేవి. అప్పుడప్పుడు తేళ్లు, పాములు దర్శనమిచ్చేవి. చాలా వరకు పారిపోయేవి. దొరికిన వాటిని చంపేవారు. అప్పుడు సినిమాలు, టీవీలు లేవు కాబట్టి సమయం అంతా పరిసరాల కమనీయ దృశ్యాలే కంటి నిండ కదలాడేవి. వర్షాకాలం రాగానే ముళ్ల కంపతో గుడిసె చుట్టూ కొంచెం ఎత్తుతో గోడ మాదిరి నిర్మాణం చేసి, చిన్నగా దాన్ని ఒక చోట వదిలి కట్టెలలో చిన్న తలుపు మాదిరిగా అడ్డం ఉంచేవారు. మా గుడిసెకు తలుపు, తాళం లేదని గర్వంగా రాసుకుంటున్నాను. ముళ్లకంప పైన రకరకాల మొక్కలు తీగలు పారి పువ్వులు పూసి, కాయలు కాసి కంపను కనపడకుండా దాచేవి. గుడిసె చుట్టూ అల్లుకుపోయిన పచ్చదనం, పువ్వుల అందం కొన్ని మాసాలు అద్భుతంగా ఉండేది. విద్యుత్ లేదు కాబట్టి రాత్రి కిరోసిన్ నూనెతో ఎక్కాలను, ఖందిల్లను వెలిగించేవారు. సాయంత్రం అయితేనే ఇది ఒక పెద్దపని. రాత్రిపూట మసిబడ్డ బుగ్గలను తుడవడం, కాలిన వత్తులను సరిచేయడం జాగ్రత్తగా నూనె పోయడం ఒక నైపుణ్యంతో కూడుకున్న పని. ఇంటి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న గూళ్లల్లో మట్టి ప్రమిదలలో నూనె పోసి ఇంట్లో దూదితో తయారుచేసిన వత్తులను వెలిగించేవారు. దేవుళ్ళ దగ్గర మట్టి మాణిక్యాలను వెలిగించేవారు. ఇవన్ని ఉన్నా ఎక్కువ సమయం చీకట్లోనే గడిచేది.

వెన్నెల రాత్రులు ఎప్పుడెప్పుడని ఎదురు చూసేవాళ్లము. పంకాలు లేవు కాబట్టి ఉడకపోసినా సహజంగా అనిపించేది. వానకాలంలో కంపనాటడం, ఎండకాలంలో తీయడం, ఒక పెద్ద ప్రక్రియ. కంప తీయటానికి ఉపయోగించే రాగోల (పంగలాంటి పెద్ద కట్టె) పనితనం ఆకర్షణీయంగా ఉండేది. రాత్రిపూట చలికాలంలో గుడిసె ముందు కట్టెలు కాల్చి మంట పెట్టేవారు. అందులో ఒక పెద్ద మొద్దు ఎప్పుడూ మెల్లమెల్లగా కాలుతూనే ఉండేది. అవసరం అయినప్పుడు దాని పైననే ఎండిన పుల్లలు, ఒక చిన్న కంప, ఆకులు వేసి ఊదితే కొంతసేపు చలి కాపుకునే మంట వచ్చేది. దాని చుట్టు గుండ్రంగా కూర్చునేవారము.

గుడిసె ముందు రోలు, రోకలి, గుడిసె లోపల కాగులు, కుండలు, కూజాలు, గిలాసలు, చెంబులు, గంగాలాలు, కొప్పెరలు, దేకీసలు, పొయ్యిలు, దాలి, శిబ్బి కవ్వం, వేలాడుతున్న ఉట్లు, చల్ల కుండ, పల్లాలు, కూర్చుండే చాపలు, పండుకునే చాపలు, మంచాలు, పరుపులు, దుప్పట్లు, మెత్తలు, జంబుకానాలు, తెల్లవారంగానే బట్టలను చుట్టి ఒక్కొక్కదాన్ని గడెంచ మీద పేర్చేవారు. అల్మారాలు మాత్రం ఉండేవి కావు. మా నాన్న నవారు మంచం మీద, మిగిలిన వారందరం నులక మంచాల మీద, చాపల మీద పండుకునేవారం. పొద్దున లేవంగానే బొగ్గు పొడితో అందరం పండ్లు తోముకునేది. మా నాన్నగారు పండ్ల పుల్ల వేసుకునేది. పండ్ల పుల్లలు కట్టలుగా ఉంచేవారు. అందులో కొన్న యాప పుల్లలు, మధ్యలో ముద్ర బెండ చెట్ల పుల్లలు ఉండేవి. అప్పుడప్పుడు అవి వేసుకొని మా గొప్పతనాన్ని ఎవరికీ తెలియకుండా చాటుకునేవారం. ఆ కాలం నుండే టీ త్రాగుటం అందరికి అలవాటు అయ్యింది. "దాలి" అనేది వంటింట్లో భూమిలో రెండు, మూడు అడుగుల లోతున చతురస్రాకారంలో త్రవ్వి దానిలో పిడకలు వేసి, పైన కుండ పెట్టి దానిలో పాలు పోసి, పిడకలకు నిప్పంటిస్తే అది పొద్దుటి నుండి మధ్యాహ్నం వరకు మెల్లమెల్లగా కాగుతుండేది. కుండకు ఒక శిబ్బి (మేదరి వాళ్ళ అల్లినవి) అడ్డంగా మూత మాదిరి పెట్టేది. మొత్తం దాలిపైన సందులుగా కట్టెతో చేసిన తలుపుతో మొత్తం దానిని మూసేది. దానిని దాలిపైన ఉండే జాలి అని పిలిచేవారు. అది ఒక కట్టె కిటికీగా ఉండేది. పాలు పొంగి, మెల్లమెల్లగా కాగుతుండేవి. వేడి మాత్రం శిబ్బి నుండి బయటకు పోయేది. మధ్యాహ్నం పాలు గోధుమ రంగు వచ్చేంత వరకు కాగిన తర్వాత, తీసేసి చల్లార్చి తోడు పెట్టేవారు. ఈ కుండను ఉట్టిమీద పెట్టేవారు. పాల మీది మీగడకు ఒక అద్భుతమైన రుచి, పెరుగైన తర్వాత కూడా ఈ మీగడ మరొక రకమైన రుచినిస్తుంది. పాలు కాగిన తరువాత వాటినే తోడుకని వేరే కుండలో పోసినప్పుడు వేడికి అడుగంటిన పాలు గోధుమ రంగుతో కుండకు అతుక్కుపోయి ఉండేది. దాన్ని కైశిప్ప (కప్పే)తో రాకి తీసిన దాన్ని గోకు అనేవారు. కొన్ని చెంచాలు మాత్రమే వచ్చే దీన్ని చెక్కరలో కలుపుకొని పిల్లలు తినేవారు.

నల్ల తుమ్మ చెట్ల పొదలలో పూసిన పసుపు పచ్చని పువ్వులు ఇంటి చుట్టూ ఉండేవి. ఎక్కడ పడితే అక్కడ పాకిన కట్లె పూవులు, గన్నేరు, మల్లె, ఆకాశ మల్లె పూలు వాటి వాసన అద్భుతంగా ఉండేది. బంతిపూలు, చామంతి, నందివర్ధన పూవులు, గునుక, తంగేడు, మందారం తదితర పూవులు బతుకమ్మ పండుగ నాడు ప్రతి ఇంట్లో చేరేవి. గునుక పూవులకు రకరకాల రంగులు వేసి వరుసలుగా పేర్చి వాటి మధ్యన తంగేడు ఇతర పూవుల వరుసలతో గుండ్రంగా బతుకమ్మను పేర్చేవారు. ఊరిలో ఎవరి బతుకమ్మ పెద్దది అనే చర్చ కొన్ని రోజులు నడిచేది. సద్దుల బతుకమ్మనాడు ఊరి చెరువులో బతుకమ్మలను విడిచేవారు. ఈ పండుగ నాడు మహిళలు దాదాపు అన్ని కులాలవారు కలిసిమెలిసి గుండ్రంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడడం చరిత్రాత్మకం. చివరగా అందరూ తెచ్చుకున్న పిండి వంటల పంపకాలు ఆహ్లాదకరంగా ఉండేది. ఈ పండుగలు తెలంగాణా వారు ఎక్కువ ఉన్న ఇతర రాష్ట్రాలు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో కూడా జరుగుతుండేవి. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణా ఉద్యమ సందర్భంగా దీని ప్రచారం ఎక్కువై ప్రపంచంలోని చాలా దేశాల్లో బతుకమ్మ ఆటలు మహిళలు ఆడి-పాడి ప్రత్యేక తెలంగాణా ఆకాంక్షను తెలియజేశారు. నేలరాలిన మోదుగు పూవులను ఏరుకొని రంగులను తయారు చేసుకునేవారం. ఇప్ప పూవులను ఏరుకునేవారం. కొన్నిసార్లు వేకువజామున గ్రామ ప్రజలు, మహిళలు ఇప్ప పూవులను ఏరుకునే సందర్భంలో ఎలుగుబంట్ల దాడులకు గురయ్యేవారు. మల్లెపూలల్లో బొడ్డుమల్లె, సన్నజాజి మల్లె ఇంకా రకరకాల మల్లె పూలను పిచ్చిగా ప్రేమించేవాడిని. వాటిని నా జేబులో వేసుకోవడం రాత్రి మంచంలో పరచుకోవడం, పడుకొని ఆకాశంలో నక్షత్రాలను, మేఘాలను, చంద్రుని చూస్తూ నిద్రలోకి జారుకోవడం దినచర్యగా ఉండేది. మా బాపు (నాన్న) తోట్లోకి పోయేటప్పుడు చేతిలో కర్రా, రూమి టోపీ పెట్టుకునేవాడు. ఇంటికి వచ్చిన తరువాత టోపీ తీస్తే అందులో దాచిన ఎన్నో మల్లెలు కిందపడితే వాటిని ఏరుకునేవారం, నవ్వుకునేవారం, మా నాన్నగారు కూడా సంతోషంగా ఉండడం అప్పుడే చూసేది. మా నాన్నగారితో కలిసి ఉండే క్షణాలు అసలు జ్ఞాపకమే లేవు. ఎప్పుడూ దూరంగానే ఉండేది. పూజ చేసుకుంటున్నప్పుడు మాత్రం మేము ముందర కూర్చుండేవారం. వారు కళ్ళు మూసుకొని జపం చేస్తున్నప్పుడు మేము కళ్ళు తెరుచుకొని కొబ్బరి ముక్కలు చెక్కర కలిపిన పలహారం వైపు చూస్తుండేవారం. మాకు పలహారం పెట్టిన తరువాత పరుగు తీసేవారం. నాకు ఒక చిత్రమైన ఆలోచన ఉండేది. మా నాన్న ఎప్పుడైనా పనిమీద ఏదైనా ఊరికి పోతారా అని ఎదురుచూసేవారం. ఆనాడే మాకు ఆడినంత ఆట, పాడినంత పాట.

• చెన్నమనేని విద్యాసాగర్‌రావు
మహారాష్ట్ర మాజీ గవర్నర్
(స్వీయచరిత్ర 'ఉనిక' నుంచి)

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 29 డిసెంబరు 2024





కమనీయం.. కూచిపూడి నాట్యం

రెండోరోజూ ఘనంగా నాట్యోత్సవాలు

8లో

- అలరించిన పలు నాట్యాంశాలు
- ప్రత్యేక ఆకర్షణగా శివతాండవం, యక్షగానం
- ప్రశంసలు అందుకున్న క్షీరసాగరమదనం
- కళాకారులకు ఘన సత్కారం

దేవి, గిరీష్ చంద్రాల నాట్య అభినయం

కవులు, రచయితల కలాల నుంచి జాలువారిన సాహితీ స్రవంతులు.. వాటిపై సంపూర్ణ అవగాహనకు ఏర్పాటుచేసిన ప్రత్యేక సదస్సులు.. నిశీధి నుంచి నింగిలో జాబిలి వరకూ అణువణువూ ఆత్మావలోకనం చేసే విజ్ఞాన నిధులతో ఓ అక్షర యాగానికి అంకురార్పణ జరిగింది. సాహితీవాడ బెజవాడలో తెలుగు వెలుగులు ప్రసరించాయి. కేబీఎన్ కళాశాల వేదికగా ప్రపంచ రచయితల ఆరో మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తమిళనాడు, కర్ణాటక, ఒడిసా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, ఆరు దేశాల నుంచి తెలుగు రచయితలు హాజరయ్యారు. మహాసభల్లో మహిళా రచయితలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ అంశాలపై నిర్వహించిన సదస్సుల్లో ప్రసంగించిన వక్తలు తెలుగు పరిరక్షణకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

తేటతేట తెలుగులా..





సాహితీ గ్రంథాలను చదువుతున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కాంగ్రెస్ నేత తులసీరెడ్డి తదితరులు

- ప్రపంచ రచయితల ఆరో మహాసభలు ప్రారంభం
- దేశ విదేశాల నుంచి హాజరైన ప్రతినిధులు
- తెలుగు పరిరక్షణకు పోరాటం చేయాలని వక్తల పిలుపు
- స్ఫూర్తినింపిన సదస్సులు

6లో



తెలుగుతల్లి వేషధారణలో కళాకారిణి

8వ తరగతి విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్

నలుగురిలో ఇద్దరిని పట్టుకున్న స్థానికులు
మచిలీపట్నంలో ఘటన

6లో

మార్కెట్ యార్డు చైర్మన్ల ఎన్నిక పోటాపోటీ

- నందిగామ మార్కెట్ యార్డు చైర్మన్‌పైనే అందరి దృష్టి
- పోటీ పడుతున్న నందిగామ, చందర్లపాడు నేతలు
- రిజర్వేషన్ ఎవరికి కేటాయిస్తారన్న అంశంపై చర్చ
- కంచికచర్ల యార్డుకు ఓ నేత పేరు దాదాపు ఖరారు
- ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో టీడీపీ నేతలు

నందిగామ, డిసెంబరు 28 : ప్రతిష్టాత్మక మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కోసం ఆశావహులు కోటి ఆశల్లో ఉన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే తరువాత చెప్పుకోదగిన పదవి ఇది. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతలు ఈ పదవిపై కన్నేశారు. ఈ క్రమంలో ఈ పదవి భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆశావహుల్లో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. ఎవరికి వారు ఈ పీఠం దక్కించుకునేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల ట్విస్టు ఇవ్వడంతో అయోమయంలో పడ్డారు. రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనన్న ఉత్కంఠలో ఓసీ సామాజికవర్గాలకు చెందిన ఆశావహులు ఉండగా, బీసీ, ఎస్సీ సామాజికవర్గాలకు చెందినవారిలో మాత్రం రిజర్వేషన్ల ఆశలు చిగురించాయి.

రిజర్వేషన్లపైనే ఆశలు

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం ఆరు మార్కెట్ కమిటీలు ఉండగా, అందులో ఓసీలకు మూడు, బీసీలకు రెండు, ఎస్సీలకు ఒక కమిటీని కేటాయించాలని నిర్ణయించారు. ఈ మొత్తంలో సగభాగం మూడు యార్డులు ఆయా కేటగిరీల్లో మహిళలకు కేటాయించారు. ఆ ప్రక్రియ దాదాపు పూర్తయింది. అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు నియోజకవర్గంలోని కంచికచర్ల యార్డును ఓసీ జనరల్‌కు, నందిగామ యార్డును బీసీ జనరల్‌కు కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. కంచికచర్ల యార్డుకు ఓ కీలక నేత పేరును ఇప్పటికే ఖరారు చేసినట్లు తెలియవచ్చింది. సామాజిక మాధ్యమాల్లోనూ ఆ నేత పేరు ప్రచారం సాగడంతో ఇతరులెవరూ ఆ పదవిపై దృష్టి పెట్టలేదు. నందిగామ యార్డుకు మాత్రం ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. ఈ యార్డును బీసీలకు కేటాయించినట్లు రెండు రోజులుగా వార్తల వస్తున్న నేపథ్యంలో ఆ సామాజికవర్గ


మిగతా 6లో..

మరో ప్లాన్

ఇంద్రకీలాద్రి అభివృద్ధి పనులకు మరో మాస్టర్ ప్లాన్

- బ్లూప్రింట్‌గా వ్యవహరిస్తూ రూపకల్పన
- వైసీపీ హయాంలోని ప్లాన్‌కు పడని ఆమోదముద్ర
- అయినా పనులు ప్రారంభించేసిన గత పాలకులు
- తాజా బ్ల్యూప్రింట్‌తో నిర్మాణ పనులపై సందిగ్ధం
- ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణం నిలుపుదల

రెండడుగులు ముందుకు.. నాలుగడుగులు వెనక్కు.. అన్న చందంగా ఉంది దుర్గగుడి అభివృద్ధి పనుల తీరు. ఇప్పటికే మూడు మాస్టర్ ప్లాన్లు రూపొందించగా, అసలు ఏ ప్లాన్ ప్రకారం పనులు జరుగుతున్నాయో తెలియని సందిగ్ధం నెలకొంది. తాజాగా నాల్గో మాస్టర్ ప్లాన్ తెరపైకి రావడంతో ప్రస్తుతం జరుగుతున్న పనులపై అనుమానాలు నెలకొన్నాయి.



దుర్గగుడి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రి అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు ప్రశ్నార్థకంగానే మిగులుతున్నాయి. ఒకదాని తర్వాత మరొకటి మాస్టర్ ప్లాన్లు తయారవుతున్నా ఒక్కటి కూడా అమలుకు నోచుకోవట్లేదు. తాజాగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన అధికారులు మరో కొత్త ప్రణాళికను జత చేశారు. కొద్దిరోజులుగా దేవస్థాన అధికారులు ఓ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. దీన్ని మాస్టర్ ప్లాన్‌గా కాకుండా బ్లూప్రింట్‌గా వ్యవహరిస్తున్నారు.

డ్రోన్ సర్వే పూర్తి

కొత్తగా రూపొందించనున్న బ్లూప్రింట్‌కు సంబంధించి ఇంద్రకీలాద్రిపై ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తయింది. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ ఈ సర్వేను పూర్తి చేసిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఇంద్రకీలాద్రిపై ప్రధానాలయం, ఆలయం వెనుక ఉన్న ఇంద్రగిరులు, మల్లేశ్వరస్వామి ఆలయం, మహామండపం, కనకదుర్గానగర్ ప్రాంతాల్లో ఈ డ్రోన్ సర్వే చేశారు. దీనికి అనుగుణంగా బ్లూప్రింట్‌ను తయారు చేస్తున్నారు.

తాజా ప్లాన్‌తో కలిపి మొత్తం నాలుగు

ఇంద్రకీలాద్రికి ఇప్పటికే మూడు మాస్టర్ ప్లాన్లు ఉన్నాయి. వీటిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. దీని ప్రకారమే కనకదుర్గానగర్‌లో మల్లేశ్వరస్వామి ఆలయం మెట్ల వద్ద అన్నదాన భవనం, మహామండపం పక్కన ప్రసాదాల తయారీ పోటు నిర్మిస్తున్నారు. కన్సల్టెన్సీ సంస్థ, దేవస్థాన అధికారులు కలిసి తయారుచేసిన ఈ ప్లాన్‌కు అప్పటి ప్రభుత్వం ఆమోదముద్ర వేయలేదు. తన పాలనలో కాగితాలకు ఎక్కి, త్రీడీ డిజైన్లను తీసుకున్న ఈ ప్లాన్‌కు ఆమోదముద్ర వేయకపోవడం గమనార్హం. అయినప్పటికీ కనకదుర్గానగర్‌లో నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ ప్లాన్‌లో చూపించిన ఎలివేటెడ్ క్యూలైన్ నిర్మాణాన్ని మాత్రం తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎలివేటెడ్ క్యూలైన్‌కు అవసరమైన గోతులను తవ్వారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం గద్దె దిగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవస్థాన అధికారులతో జరిగిన సమావేశాల్లో ఎలివేటెడ్‌పై కొత్తకొత్త అభిప్రాయాలు వచ్చాయి. ఎలివేటెడ్‌ను ఏం చేయాలన్న దానిపై తుది నిర్ణయం వచ్చే వరకు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని భావించారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ప్రసాదం తయారీ పోటు, అన్నదాన కాంప్లెక్స్ పనులు పూర్తయ్యేలోపు కొత్తగా రూపొందిస్తున్న బ్లూప్రింట్‌కు ఒక రూపు వచ్చే అవకాశాలున్నాయి. ఆ తర్వాత దాని ప్రకారం పనులు జరుగుతాయి.

ఆవును తప్పించబోయి అనంతలోకాలకు..

తాడిగడప వందడుగుల రోడ్డులో కారు ప్రమాదం.. ఇద్దరు మృతి

అడ్డొచ్చిన ఆవు కూడా అక్కడికక్కడే కన్నుమూత

ప్రాణాలతో బయటపడిన విద్యార్థి షకీర్

మృతుల్లో ఒకరు ఎస్‌బీఐ మేనేజర్, మరొకరు సనత్‌నగర్‌వాసి

కళాశాలలో కుమారుడిని వదిలిపెట్టేందుకు వస్తుండగా ఘటన

పెనమలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుమారుడిని తాడిగడప వందడుగుల రోడ్డులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో వదిలిపెట్టేందుకు కారులో బయలుదేరిన ఎస్‌బీఐ మేనేజర్ అకస్మాత్తుగా అడ్డొచ్చిన ఆవును తప్పించబోయి ఆవును, వందడుగుల రోడ్డు దాటుతున్న మరో వ్యక్తి స్కూటీని ఢీకొన్నారు. అనంతరం కారు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎస్‌బీఐ మేనేజర్‌తో పాటు స్కూటీపై వెళ్తున్న వ్యక్తి మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ఆవు అక్కడికక్కడే కన్నుమూసింది. కారులో ఉన్న విద్యార్థి ప్రాణాలతో బయటపడ్డాడు. శనివారం ఉదయం స్థానిక పంటకాల్వ రోడ్డులోని కొత్త వంతెన దిగువన జరిగిన ఈ ప్రమాదం స్థానికులను కలచివేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరులోని ఎస్‌బీఐలో మేనేజరుగా పనిచేస్తున్న రషీద్ (50) నరసరావుపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భార్యతో కలిసి పటమట పండరీపురంలో నివాసముంటున్నారు. కుమారుడు షకీర్ హసన్ చదువుతున్న కళాశాలకు దగ్గర్లో ఉంటూ ఇంటి వద్ద నుంచి రోజూ కుమారుడిని వందడుగుల రోడ్డులోని కళాశాల వద్ద తండ్రి రషీద్ వదిలిపెట్టి గుంటూరు వెళుతుండేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కుమారుడిని కళాశాల వద్ద వదిలిపెట్టేందుకు కారులో వందడుగుల రోడ్డువైపు రషీద్ బయల్దేరారు.

మిగతా 6లో..





ప్రమాదంలో నుజ్జయిన కారు (ఇన్‌సెట్‌లో) మృతుడు రషీద్ (ఫైల్)

తల్లిని హతమార్చిన తనయుడు, కోడలు

- ఆస్తి ఇవ్వడానికి నిరాకరించడంతో హత్య
- దిండు తలపై పొత్తి కిరాతకంగా..
- తల్లి బంగారు ఆభరణాలతో పరార్
- గుణదలలో జరిగిన ఘోర ఘటన
- నిందితులిద్దరూ అరెస్టు

8లో



బాబోయ్ కొండనాగు


జగ్గయ్యపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కృష్ణానగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో శనివారం కొండనాగు కనిపించింది. మోటారు బాక్సు కిందకు చేరిన ఈ పామును 'స్నేక్' సుధాకర్ చాకచక్యంగా పట్టుకున్నారు. నాలుగు అడుగుల పొడవున్న ఇది కొండనాగు అని, అడవుల్లోనే సంచరిస్తుందని ఆయన చెప్పారు. అనంతరం ఆ పామును సురక్షిత ప్రాంతంలో వదిలారు.

కందిపప్పు చేతికందేనా?

- పూర్తిస్థాయిలో కందిపప్పు ఇస్తామని మంత్రి నాదెండ్ల ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో ఇంకా ప్రొక్యూర్ చేయని సివిల్ సప్లయిస్
- కట్టిన డీడీలకు డబ్బు వెనక్కిరాదని డీలర్ల ఆందోళన
- కార్డుదారులు గోల చేస్తారని ఎండీయూ ఆపరేటర్ల ఆవేదన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఈనెల నిత్యావసరాల కోటాలో భాగంగా కందిపప్పు తగినంతగా రాకపోవడంతో డీలర్లు ఆందోళన చెందుతున్నారు. కొత్త సంవత్సరంలో కార్డుదారులందరికీ కందిపప్పు అందించాలని, ఆ మేరకు ప్రొక్యూర్‌మెంట్ జరపాలని ఓవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్నా.. మరోవైపు సివిల్ సప్లయిస్ అధికారులు శనివారం నాటికి కూడా కందిపప్పును సమకూర్చలేకపోయారు. సివిల్ సప్లయిస్ అధికారుల ఆన్‌లైన్ డేటా ప్రకారం శనివారం సాయంత్రం నాటికి ఉమ్మడి కృష్ణాజిల్లాలో కేవలం పావువంతు కార్డులకు సరిపడా కందిపప్పు కూడా దిగుమతి కాలేదు. కృష్ణాజిల్లాలో మొత్తం 5,17,145 రేషన్ కార్డులుండగా, ఇక్కడి రేషన్ దుకాణాలకు కేవలం 69 వేల కేజీల కందిపప్పే చేరింది. ఎన్టీఆర్ జిల్లాలో 5,97,990 రేషన్ కార్డులుండగా, 1,81,710 కేజీలే డీలర్లకు అందుబాటులోకి వచ్చింది. దీంతో ఎండీయూలకు ఎలా ఇచ్చేదని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. కందిపప్పు ఇస్తామని ముందస్తుగా ప్రకటించడం వల్ల కార్డుదారులు గొడవ చేస్తారని ఎండీయూ ఆపరేటర్లు భయపడుతున్నారు. పూర్తిస్థాయిలో సరుకు వస్తుందని తాము డీడీ డబ్బులు చెల్లించామని, అవి తిరిగి వెనక్కి వచ్చే పరిస్థితి లేదని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇంకా మూడు రోజుల సమయమే ఉండటంతో ఈలోపు కందిపప్పును ప్రొక్యూర్‌మెంట్ చేయగలరా? రేషన్ డిపోలకు అందించగలరా? అనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఉపాధి నిధి



8లో

వికసిత్ భారత్ పేరిట మొగల్రాజపురంలోని పీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళా నిరుద్యోగులకు వరంలా మారింది. ఈ ఇంటర్వ్యూలకు దాదాపు 5,500 మంది హాజరు కాగా, 1,400 మంది ఉద్యోగాలు సాధించారు. 66 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా, ఎంపికైన వారికి ఎంపీ కేశినేని చిన్న నియామక పత్రాలు అందజేశారు.


ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో మార్పు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీ రమణ, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, మండలి బుద్ధప్రసాద్


ప్రదర్శనగా ఉంచిన అతిపెద్ద పుస్తకం దివ్యవేదవాణి

తెలుగు పరిరక్షణ అందరి బాధ్యత

ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో వక్తలు

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. కేబీఎన్ కళాశాలలో శనివారం ప్రారంభమైన ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి, సినీగేయరచయిత భువనచంద్ర, పలువురు రచయితలు హాజరయ్యారు.

తెలుగు పదాలతో ఒక వాక్యమైనా చెప్పలేకపోతున్నాం

» ఎమ్మెల్యే సుజనాచౌదరి



విజయవాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పూర్తి తెలుగు పదాలు ఉపయోగించి ఒక వాక్యాన్ని కూడా చెప్పలేని పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణచౌదరి(సుజనా చౌదరి) అన్నారు. కేబీఎన్‌కళాశాలలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో ఆయన మాట్లాడారు. 'మార్పు' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. మాతృభాషపై పట్టు సాధించినప్పుడు పర భాషలను నేర్చుకోవడం ఎంతో సులువుగా ఉంటుందన్నారు. పరభాష మోజులో తెలుగును విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతీయ, కులమత వ్యత్యాసాలు లేకుండా తెలుగు భాష పరి రక్షణకు పాటుపడాలన్నారు. మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్ ఇంగ్లీష్‌లో మాట్లాకుండా ఇండియా టీంకు ఎంపికై కెప్టెన్ అయ్యారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఇంటి నుంచే తెలుగు అలవాటుచేసుకోవాలి

» డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వీసీ కేఆర్ రజిని

విజయవాడ కల్చరల్: 'ఇంటి నుంచే తెలుగు మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. తెలుగుభాషను సంరక్షించుకోవడంలో ప్రతి తెలుగు వ్యక్తి బాధ్యత వహించాలి. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, మాతృభాష పట్ల బాధ్యతను తెలుసుకోవాలి.' అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వీసీ కేఆర్ రజిని అన్నారు. చెరుకూరి రామోజీరావు వేదికపై నిర్వహించిన మహిళా ప్రతినిధుల సదస్సులో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె ప్రసంగించారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. రచయిత్రులు కాకినాడ చెందిన విజయ కట్టా, స్ఫూర్తి, హైదరాబాద్‌కు చెందిన ఇంద్రగంటి జానకిబాల, నెల్లూరుకు చెందిన కల్లకూరు జయప్రద, విశాఖపట్నానికి చెందిన బి.హేమలత, హైదరాబాద్‌కు చెందిన స్వాతిశ్రీపాద, భానుమతి, బాపట్లకు చెందిన భవానీదేవి, హైదరాబాద్‌కు చెందిన కేతవరపు రాజశ్రీ, వెలవోలు నాగరాజ్యలక్ష్మి, తాటికోల పద్మావతి, విజయవాడ చెందిన కాపూరి సత్యవతి, హైదరాబాద్‌కు చెందిన అల్లూరి గౌరీలక్ష్మి తెలుగు భాష వైభవాన్ని వివరించారు. దాశరథి సభా వేదికపై తొలుత కవిత సదస్సు నిర్వహించారు. అనంతపురానికి చెందిన డాక్టర్ రాజయ్య సభకు అధ్యక్షత వహించారు. మంగళగిరికి చెందిన డాక్టర్ పాలపర్తి శ్యామల ఆనంద ప్రసాద్, ఆంధ్ర సారశ్వత్ పరిషత్తు చక్రవధువుల రెడ్డప్ప, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి తెలగరెడ్డి సత్యానందం, కరీంనగర్‌కు చెందిన నామని సుజనాదేవి, జమ్మలమడుగుకు చెందిన కుందా భాస్కర్, హైదరాబాద్‌కు చెందిన రమాజ్ శాండిల్య, శ్రీకాకుళానికి చెందిన భోగిల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


మహిళా ప్రతినిధుల సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కేఆర్ రజిని

పుస్తకాల ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: ఆంధ్ర మహాభారతం సూక్ష్మ పరిశీలన విశిష్ట సన్నివేశాలు, గద్వాల్ సోమన్న రచించిన తారాజువ్వలు, రేపటి వెలుగులు పుస్తకాలను ఆవిష్కరించి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు అంకితం చేశారు. కల్వకుంట్ల రాజేష్ రెడ్డి రచించిన వెలుగు మువ్వలనే పుస్తకాన్ని, భవానీ శంకర్ రచించిన విపంచిక ఖండ కావ్యం, బెల్లంకొండ శ్రీనివాస్ రచించిన ఆమె నవలను ఆవిష్కరించారు. ఈ గ్రంథాలన్నింటిని సుప్రీంకోర్టు మాజీ సీజే నూతలపాటి వెంకటరమణ, సతీష్‌రెడ్డి, మండలి బుద్ధప్రసాద్‌ఆవిష్కరించారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా దుబాయ్‌కు చెందిన డాక్టర్ తాడేపల్లి రామలక్ష్మి, అమెరికాకు చెందిన అశ్వినీ ఫణీంద్ర, ప్రమోద ఫణీంద్ర మాట్లాడారు.

సాంకేతికత ఆధారంగా డిక్షనరీలు

సాంకేతికత ఆధారంగా డిక్షనరీలను సులభంగా రూపొందించడం, ఒకేసారి మూడు భాషలకు సంబంధించిన అర్థాలు వివరించటం, ఈజీగా డౌన్లోడ్ చేసుకునే పద్ధతులను గుంటూరుకు చెందిన పెద్ద సాంబశివరావు వివరించారు. జగ్గయ్యపేటకు చెందిన సరికొండ నరసింహరాజు తల్లడిల్లే తల్లి వేదం కవిత్వాన్ని వినిపించారు. బెంగళూరుకు చెందిన ఏఎస్‌సీ రావు, నౌకాపు వెంకటరమణ, కప్ప దుర్గారావు, జె.సీతాపతిరావు, అక్కినేనిభవానీప్రసాద్ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు 2034లోనే

» ఎంపీ బాలశౌరి స్పష్టీకరణ

మచిలీపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'ఒకే దేశం.. ఒకేసారి ఎన్నికల నినాదంలో భాగంగా జమిలి ఎన్నికలు 2034లో జరిగే అవకాశం ఉందని ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం విలేకరులకు తెలిపారు. జమిలి ఎన్నికలపై నివేదిక తయారుచేసే కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నానని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లో పర్యటించి అక్కడి ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను, సలహాలను తెలుసుకుని నివేదిక అందజేస్తామన్నారు. ఈ నివేదికలు అందాకనే జమిలీ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జమిలీ ఎన్నికల నిర్వహణ కమిటీలోని 21 మంది సభ్యులలో తనకు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. 2027లో జమిలి ఎన్నికలు జరవగవని ఇప్పటికే స్పష్టంచేశారని ఎంపీ తెలిపారు.

అనంతలోకాలకు..

(5వ పేజీ తరువాయి)

పంటకాల్వ రోడ్డులోని సిద్ధార్థ వంతెన దిగువకు వెళ్తుండగా, దారిలో అకస్మాత్తుగా కారుకు అడ్డంగా ఒక ఆవు వచ్చింది. వెంటనే రషీద్ ఆవును తప్పించే క్రమంలో ఆవును, వందడుగుల రోడ్డు దాటేందుకు స్కూటీపై వెళ్తున్న సనత్‌నగర్‌కు చెందిన షేక్ రహీం(58)ను ఢీకొన్నారు. ఈ క్రమంలో అదుపుతప్పిన కారు పక్కనే ఉన్న కాల్వలో పడిపోయింది. కారులో ఇరుక్కున్న రషీద్‌కు, కారు ఢీకొని షేక్ రహీంకు బలమైన గాయాలయ్యాయి. రషీద్, రహీంలను ట్రాఫిక్ సీఐ వెంకట్ నేతృత్వంలో సిబ్బంది దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారు అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. రషీద్ కుమారుడు షకీర్ హసన్‌కు స్వల్పగాయాలయ్యాయి. కారు బలంగా ఢీకొనడంతో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. అప్రమత్తమైన పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నియంత్రించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటాపోటీ

(5వ పేజీ తరువాయి) నాయకులు అప్రమత్తమయ్యారు.

నందిగామ యార్డుకు పోటీ

నందిగామ యార్డు పరిధిలో నందిగామ, చందర్లపాడు మండలాలు ఉన్నాయి. ఇటీవల నందిగామ మండలంలోని జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన ఏటిపట్టు గ్రామాలను జగ్గయ్యపేట యార్డు పరిధిలో చేర్చారు. దీంతో నందిగామ మండలంలోని 12 గ్రామాలతో పాటు చందర్లపాడు మండలాలు ఆ యార్డు పరిధిలో మిగిలాయి. నందిగామ మండలం నుంచి ఒకరిద్దరు టీడీపీ నాయకులు ఈ పదవికి పోటీలో ఉండగా, చందర్లపాడు మండలం నుంచి చాలామందే ఉన్నారు. నందిగామ నుంచి పోటీ పడుతున్న ఒకరిద్దరు నేతలు బీసీ కేటగిరీలో అల్పసంఖ్యాక కులాలకు చెందినవారు కావడంతో పాటు సగం మండలం మాత్రమే యార్డు పరిధిలో ఉంది. దీంతో ఈ పదవి చందర్లపాడు మండలానికే దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. చందర్లపాడు మండలం నుంచి బీసీ సామాజికవర్గాలకు చెందిన సీనియర్ నాయకులు బరిలో ఉన్నారు. ముఖ్యంగా యాదవ, రజక సామాజికవర్గాలకు చెందిన నాయకులు పోటీలో ఉన్నారు. వీరంతా ఎవరికి వారు ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కాగా, సీనియారిటీ, విధేయత తదితర అంశాల ఆధారంగా చైర్మన్ పదవిని కట్టబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైసీపీ సభ్యత్వం తీసుకున్నట్టు చలసాని ఆంజనేయులుపై తప్పుడు ప్రచారం

» సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు వైసీపీ సభ్యత్వం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతుంది. ఈ విషయం ఆయన దృష్టికి వెళ్లటంతో హనుమాన్ జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2019లోనే వైసీపీ సభ్యత్వ నమోదును నిలిపివేసింది. పార్టీ సభ్యత్వం తీసుకున్నప్పుడు రెండేళ్ల కాల పరిమితి మాత్రమే ఉంటుంది. అయితే చలసాని ఆంజనేయులు వైసీపీలో చేరి పార్టీ సభ్యత్వం తీసుకుని 2024 వరకు సభ్యత్వం చెల్లుబాటు అయ్యే విధంగా నకిలీ కార్డు తయారు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. తనపై ఇలాంటి దుష్ప్రచారాలు రావటం బాధాకరమన్నారు.

ఎస్సీల సమగ్ర వివరాలు అందించండి

» అధికారులకు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా ఆదేశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎస్సీ, ఉపకులాల రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై పూర్తిగణాంకాలతో వివరాలు అందజేయాలని అధికారులను ఎస్సీ కులాల వర్గీకరణపై రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆదేశించారు. ఏకసభ్య కమిషన్ శనివారం జిల్లాలో పర్యటించింది. ఎస్సీ సామాజికవర్గాల నుంచి వినతులు స్వీకరించడానికి ముందు జడ్పీ సమావేశపుహాలులో రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులతో సమావేశం నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పు, కేంద్రప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ఏకసభ్య కమిషన్‌ను నియమించిందన్నారు. రాష్ట్రంలో జిల్లాల విభజన జరగకముందు ఉన్న 13జిల్లాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీల్లోని 59 కులాల స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నిశాఖల అధికారులు తమ పరిధిలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలు, వారి కేడర్‌ను, ఉపకులాల వారీగా అందజేయాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం జనాభా 45.17లక్షల మంది ఉన్నారని కలెక్టర్ బాలాజీ తెలిపారు. వీరిలో మాదిగలు 4,44,734, మాలలు 3,89,665మంది ఉన్నారన్నారు. జిల్లాపరిషత్, డీపీవో, డీఆర్‌డీఏ, మునిసిపల్ కార్పొరేషన్, ఆర్టీసీ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి ఉపకులాల వివరాలను రాజీవ్ రంజన్‌మిశ్రా అడిగి తెలుసుకున్నారు.

పటిష్ట బందోబస్తు

ఎస్సీవర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు వినతులు ఇచ్చేందుకు భారీగా ఎస్సీలు జిల్లాపరిషత్ కన్వెన్షన్‌హాలుకు తరలివచ్చారు. అలాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. కన్వెన్షన్‌హాలులోని వేదికపై కాకుండా పక్కనే ఉన్న హాలులో వినతులు స్వీకరించారు. హాలు బయట ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఏ ప్రాంతంనుంచి, ఏయే సంఘాల నుంచి ఎంతమంది వచ్చారో నమోదు చేసుకుని, వారికి టోకెన్లు అందజేసి కమిషన్ ఎదుటకు పంపారు. ఒకానొక సమయంలో కొందరు సభ్యులు జైభీమ్, ఎమ్మార్పీఎస్ ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు వారిని కట్టడిచేశారు. మాల, మాదిగలతోపాటు అనుబంధకులాలుగా ఉన్న రెల్లి, బుడగ జంగాలు, బేడ, బైండ్ల, మాస్టీన్, ఎస్సీకాపు, బీసీ-సీలుగా ఉన్న ఎస్సీలు, ఎస్టీలు, ఎస్సీ ఉద్యోగ సంఘాలనాయకులు వినతులు అందజేశారు.


ఎస్సీ నాయకుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

ఎనిమిదో తరగతి విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్

» నలుగురు యువకుల ఘాతుకం..

» దేహశుద్ధి చేసి ఇద్దరిని పోలీసులకు అప్పగించిన స్థానికులు

» పారిపోయిన మరో ఇద్దరు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో దారుణం జరిగింది. గం జాయి మత్తులో నలుగురు యువకులు ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై శనివారం గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. ఈ ఘటన నగరంలో సంచలనం రేకెత్తించింది. నగరానికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై గంజాయి మత్తులో నలుగురు యువకులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల వారు పరుగెత్తుకుంటూ వచ్చి వారికి దేహశుద్ధి చేశారు. ఇద్దరు పారిపోయారు. మరో ఇద్దరిని ఇనకుదురు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. చుట్టుపక్కల వారు ఇచ్చిన ఫిర్యాదుపై ఇనకుదురు సీఐ పరమేశ్వర్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ అబ్దుల్‌సుభాన్ తెలిపారు.

భర్త, అత్త, మామలపై కేసు

విద్యాధరపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మంటూ వేధిస్తున్న భర్త, అతని తల్లిదండ్రులపై శనివారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శృంగేరి శారదానగర్‌కు చెందిన ఉద్దంటి వెంకట లావణ్యకు 2012 ఫిబ్రవరి 17న గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, రెడ్డిపాలేనికి చెందిన ఉద్దంటి సుధాకర్‌తో పెద్దల సమక్షంలో వివాహమైంది. రూ.2లక్షలు, ఇతర లాంఛనాలు ఇచ్చారు. కొన్ని రోజులు సక్రమంగా ఉన్నా, తర్వాత భర్త, అతని తల్లిదండ్రుల సూచనలతో లావణ్యను పుట్టింటి నుంచి అదనంగా డబ్బులు తెమ్మంటూ వేధించటం ప్రారంభించాడు. సొమ్ముతేకుంటే సుధాకర్‌కు మరో వివాహం చేస్తామని మామ బెదిరించటమేకాక, ఆమెను ఇంటి నుంచి పంపించివేశారు. పెద్దల సమక్షంలో లావణ్యను బాగా చూసుకుంటానని, ఇబ్బంది పెట్టనని చెప్పి కాపురానికి తీసుకెళ్లాడు. తర్వాత ఇద్దరు పిల్లలు పుట్టారు. మళ్లీ పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మంటూ లావణ్యను ఆమె పిల్లలను పంపించి వేశారు. దీంతో లావణ్య తల్లిదండ్రులు, మరికొందరు పెద్దలు సుధాకర్ తల్లిదండ్రులను, సుధాకర్‌ను ప్రశ్నించారు. వారి సమక్షంలోనే బెదిరించడంతో పోలీసులకు లావణ్య ఫిర్యాదు చేసింది.

వివాహిత ఆత్మహత్యాయత్నం

భర్త, అతని కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు శనివారం భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. గుడివాడ ప్రాంతానికి చెందిన చంద్రికకు నాలుగేళ్ల క్రితం భవానీపురం ఏకలవ్యనగర్‌కు చెందిన సంగం దుర్గామల్లేశ్వరరావుతో వివాహమైంది. రూ.5లక్షలు విలువైన స్థలం, మరో రూ.5లక్షల విలువైన బంగారు ఆభరణాలను దుర్గామల్లేశ్వరరావు తల్లిదండ్రులకు కట్నంగా ఇచ్చారు. పెళ్లయిన కొన్ని నెలలు దుర్గామల్లేశ్వరరావు బాగానే ఉన్నా తర్వాత భార్యను అనుమానించడం మొదలు పెట్టాడు. భర్తతో పాటు అతని తల్లిదండ్రులు శారద, వెంకట్రావ్, కుటుంబసభ్యులు గౌతమ్‌శంకర్, గౌతమి, రోజా కూడా సూటిపోటిమాటలతో వేధిస్తున్నారు. ఈనెల 22న చంద్రిక తన ప్రాజెక్టుకోసం ఫోన్ చూసుకుంటుండగా, ఎవరితో చాటింగ్ చేస్తున్నావంటూ భర్త అనుమానించాడు. అసభ్యకరంగా దూషించాడు. భర్త, అతని కుటుంబసభ్యుల మాటలు తాళలేక చంద్రిక ఈనెల 23న బాత్‌రూమ్‌లు శుభ్రపరిచే రసాయనం తాగింది. దుర్గామల్లేశ్వరరావు తండ్రి వెంకట్రావ్ ఆమెతో గొడవపడి కొట్టాడు. ఆమెకు ముఖంపై గాయమైంది. అనంతరం వారే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. దీనిపై యచంద్రిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా జగ్గయ్యపేట

» పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం


స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఎంపీ కేశినేని చిన్ని

జగ్గయ్యపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేటను స్వచ్ఛాంధ్ర పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అభివృద్ధి చేస్తామని, పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రాం తెలిపారు. శనివారం విజయవాడలో పట్టాభి, ఎండీ అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు హాజరయ్యారు. జగ్గయ్యపేటలో రోజుకు 18 టన్నుల తడి, పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని, పట్టణ శివారు విలియంపేటలో చెత్తను డంప్ చేస్తున్నామని, అక్కడి ప్రజలు డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తున్నారని వారు వివరించారు. చెత్తను శుద్ధి చేసేందుకు ప్లాంట్ మంజూరు చేయాలని, ప్లాంట్ నుంచి వచ్చిన వేస్ట్‌ను స్థానిక కర్మాగారాలకు అందిస్తామని తెలిపారు. పట్టణ అవసరాలకు జేసీబీ ఇవ్వాలని, ఎలక్ట్రికల్ ఆటోలతో ఇబ్బందిగా ఉందని, వాటిస్థానంలో డీజిల్, పెట్రోల్ ఆటోలు ఇవ్వాలని కోరారు. ఎర్ర కాల్వ మొత్తం సిల్ట్ తీయడానికి ప్రత్యేక కూలీలు, ఇతర సామగ్రిని సమకూర్చాలని, రోడ్లను శుభ్రం చేసేందుకు స్వీపింగ్ మిషన్లు ఇవ్వాలని వారు కోరారు.


డిగ్రీలు ప్రదానం చేస్తున్న సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ వెంకటేశ్వరరావు, అకాడమీ చైర్మన్ ఎం.రాజయ్య

సిద్ధార్థ దంత వైద్య విద్యార్థుల సేవలు భేష్

» దంత వైద్య కళాశాల స్నాతకోత్సవంలో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ పి.వెంకటేశ్వరరావు

గన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ వారిని ఉన్నతులుగా సిద్ధార్థ అకాడమీ తీర్చిదిద్దుతోంది. ఖర్చుకు వెనకాడకుండా అన్ని రకాల యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో దంత వైద్య విద్యార్థులు ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలతో సేవలందిస్తున్నారు.' అని అకాడమీ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ కళాశాలలో యూజీ 15వ బ్యాచ్, పీజీ 11వ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమం శనివారంనిర్వహించారు. 106 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వీసీ విచ్చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.నాగసాయి మధుసూదనరావు పాల్గొన్నారు.

మత్స్య సంపద వృద్ధికి కృషి: కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మత్స్య సంపదను వృద్ధి చేయడంతో పాటు మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. భవానీఘాట్‌లో శనివారం కృష్ణానదిలో చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి ఆయన పాల్గొన్నారు. మత్స్య సంపదను పెంచటానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో చేప పిల్లలను వదిలామని, 7 నెలల తరువాత మత్స్యకారులు ఉచితంగా చేపలను పట్టుకుని విక్రయించుకుని ఆర్థిక ప్రయోజనం పొందొచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు ఆర్థిక ప్రయోజనం కల్పించేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంపై ఆయన అవగాహన కల్పించారు. భవానీపురం వద్ద కృష్ణానదిలో 7.50 లక్షల రాగండి రకం చేప పిల్లలను విడుదల చేశామని, అవి పెరిగి 5.25 లక్షల కిలోల మేరకు ఎదుగుతాయన్నారు. కిలో రూ.100 చొప్పున విక్రయించినట్లయితే మత్స్యకారులకు రూ.525 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. మత్స్య శాఖ కమిషనర్ టి.డోలాశంకర్, జిల్లా మత్స్య శాఖ అధికారి సి.హెచ్.ఎ్న.చక్రాణి, డెవలప్‌మెంట్ ఆఫీసర్ టి.అఖిల, విఫ్ఎ ఎలియా రామారావు, తహసీల్దార్ ఇంయాఆజ్ పాషా పాల్గొన్నారు.


కృష్ణానదిలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు


అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

విద్యుత్ చార్జీలపై వైసీపీ ఆందోళన విడ్డూరం: ఎమ్మెల్యే గద్దె

పటమట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నాయకులు ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అదానీ నుంచి రూ.2వేల కోట్ల కమీషన్లు తీసుకుని రాష్ట్ర ప్రజలపై లక్ష కోట్లు రూపాయల భారాన్ని మాజీ సీఎం జగన్ మోపారని గద్దె ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనంటూ 2019 ఎన్నికల్లో ప్రచారం చేసిన జగన్ ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.16వేల కోట్ల భారాన్ని మోపారన్నారు. జగన్‌రెడ్డి విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. జగన్ అవినీతి, ధనదాహం వలనే ప్రజలపై భారం పడిందని గద్దె తెలిపారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ ● చుట్టుగుంట నుంచి ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు ర్యాలీ

గుణదల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానాన్ని 2020ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ. 5వేల కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్, తల్లికి వందనం నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చుట్టుగుంట నుంచి ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద నిర్వహించిన సభలో ఎ.అశోక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థల పరం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. నూతన విద్యావిధానం 2020 వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని ప్రక్షాళన చేస్తామని అధికారంలోకి వచ్చి నేడు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే భవిష్యత్ పోరాటాలకు యువత సంసిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీవో 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీఎంబర్స్ మెంట్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్, జిల్లా మహిళా కన్వీనర్ జాహిద, ప్రణీత, జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి, మాధవ్, నగర నాయకులు ఓజేశ్వేన్, వాసు, ఇనోష్, హాసిని, షణ్ముఖ, ప్రసాద్, భార్గవ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణ పాల్గొన్నారు.




చుట్టుగుంట నుంచి ఎస్ఆర్ఆర్ కళాశాల వరకు ర్యాలీగా వస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

జూట్, క్లాత్ బ్యాగులు వాడాలి


మాట్లాడుతున్న సంధ్య

పటమట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : జూట్ బ్యాగులు లేదా క్లాత్ బ్యాగులు వాడాలని ఢిల్లీకి చెందిన ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సంధ్య సూచించారు. పటమటలంకలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంధ్య మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అతిగా ఉపయోగించడం వలన కలిగే నష్టాలు, భవిష్యత్తును ఏ విధంగా విచ్ఛిన్నం చేస్తుందీ విశదీకరించారు. జన జీవనమే కాకుండా జల జీవనం ఏ విధంగా నష్టపోతుందీ, ప్లాస్టిక్‌ను ఏలా నియంత్రించవచ్చు తెలియజేశారు. ప్రతీ విద్యార్థి కనీసం 10 మందిని చైతన్యవంతులుగా చేసి ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. ప్రజాప్రగతి ట్రస్ట్ సభ్యులు వాసుదేవరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీరరాజు, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్రవర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.











టీటీడీ నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ


టీటీడీకి పంపుతున్న కూరగాయల లారీ వద్ద పారిశ్రామికవేత్త కొలుసు కృష్ణకాంత్ యాదవ్

మొగల్రాజపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ నిత్యాన్నదానానికి 18 సంవత్సరాలుగా నిరంతరం కూరగాయలు పంపించే అదృష్టం కలిగిందని ప్రముఖ పారిశ్రామికవేత్త కొలుసు కృష్ణకాంత్ యాదవ్ చెప్పారు. కస్తూరిబాయి పేట పుష్ప హోటల్ సమీపంలో శనివారం టీటీడీకి పది టన్నుల కూరగాయలతో వెళుతున్న లారీకి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ మహత్కార్యానికి ఆద్యులైన మండవ కుటుంబరావు ఆశయాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మరడ నాగేంద్ర, మాజీ కార్పొరేటర్ గోగినేని సుజాత, అనుమోలు శ్రీనివాస్, మువ్వా కోటేశ్వరరావు, బొప్పన చంద్రశేఖర్, పువ్వాడ మాలకొండయ్య, బద్దిరెడ్డి కిరణ్, ఏ జగన్మోహన్ రెడ్డి, కడియాల విజయ్‌కుమార్, ఐలాపురం అరుణ్, అన్నే శ్రీనాథ్, గంతకోరు ద్వారకానాథ్, కొణిదన శ్రీకాంత్, కాసరనేని చంద్రశేఖర్, పలువురు ధార్మిక ఆధ్యాత్మిక వాదులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్స్ డే అధికారికంగా నిర్వహించాలి

● సబ్కా జిల్లా కార్యదర్శి ఘంటా సత్య సధీర్

లబ్బీపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్స్ డేని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కాంట్రాక్ట్ అసోసియేషన్(సబ్కా) కృష్ణా జిల్లా కార్యదర్శి ఘంటా సత్య సధీర్ ప్రభుత్వాన్ని కోరారు. సబ్కా డైరీ 2025 ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం కర్నూలు పట్టణంలో జరగనున్న నేపథ్యంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన సబ్కా ప్రతినిధులు శనివారం లబ్బీపేటలోని సబ్కా కార్యాలయం నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్లకు కొంతమేర బిల్లులు చెల్లించి తమ జీవితాలను ఆదుకుందని చాలా సంతోషంగా ఉందని అన్నారు. మిగిలిన బిల్లులు కూడా చెల్లించాలని, కాంట్రాక్టర్స్ డే ని కూడా అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్కా సభ్యులు ఎం.సాయి, కే.కృష్ణంరాజు, డి.వెంకటేశ్వరరాజు, జి.ప్రకాష్, టి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



కర్నూలు తరలి వెళుతున్న సబ్కా సభ్యులు

ఆరోగ్య సమస్యల పరిష్కారానికి హెల్త్ టెక్నాలజీ అసెస్‌మెంట్


మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్

మొగల్రాజపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం చేసే పరిశోధనలకు హెల్త్ టెక్నాలజీ ఎసెస్‌మెంట్ ఉపయోగపడుతుందని ఇండియా మెడ్రోనిక్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ డాక్టర్ జగదీష్ చెప్పారు. ఆర్థిక సామాజిక కారణాల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల పరిష్కారంపై అన్వేషణ గురించి అవగాహన కల్పించేందుకు ట్రాన్స్‌ఫార్మింగ్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ అనే అంశంపై కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం శనివారం సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వివిధ డిజిటల్ పద్ధతుల ద్వారా సేకరించిన వివరాలను పలు కోణాలలో పరిశీలించడం ద్వారా ఏ సమస్యతో ఎంతమంది, ఏ వర్గానికి చెందిన వారు అనే గణాంకాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ. సునీత, డాక్టర్ బి. అనుపమ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడి చేసిన జల్లాపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ నాయకుడు కళ్లే నాగేశ్వరరావు


బైరాను అభినందిస్తున్న కళ్లే నాగేశ్వరరావు

విజయవాడ లీగల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవోపై దాడి చేసిన వైసీపీ నాయకుడు, మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జల్లా సుదర్శన రెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు, న్యాయవాది కళ్లే నాగేశ్వరరావు కోరారు. కళ్లే నాగేశ్వరరావు శనివారం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీఓపీ) బైరా రామకోటేశ్వరరావును ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బైరాను ఆయన దుశ్శాలువాతో సత్కరించారు. బైరా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో తప్పు చేసిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్థాయీ సంఘ సమావేశంలో 20 అంశాలకు ఆమోదం

చిట్టినగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):నగరపాలకసంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 20అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 28 అంశాలపై చర్చించి 20అంశాలను ఆమోదించారు. 6 అంశాలను వాయిదా వేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీలో మూలకు చేరిన జనరేటర్

అత్యవసర పరిస్థితుల్లో అద్దెకు తెస్తున్న వైనం



ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కళాశాల (ఎస్ఎంసీ)లో కొన్ని సంవత్సరాలుగా జనరేటర్ మరమ్మతులకు గురై మూలన పడి ఉంది. ఇటీవల కళాశాల ప్రాంగణంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పాడైన సమయంలో బాలుర, బాలికల వసతి గృహాలకు విద్యుత్ సరఫరాను అందించేందుకు బయట నుంచి రెండు జనరేటర్స్ అద్దెకు తెచ్చి అద్దె చెల్లించారే తప్ప ఉన్న దాన్ని బాగు చేసుకుందామనే ఆలోచన కళాశాల యాజమాన్యం చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో అద్దెకు జనరేటర్లు లభ్యం కాకుంటే విద్యార్థులకు తిప్పలు తప్పవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఎంసీలో జరుగుతున్న ఇలాంటి తంతులపై నిఘా పెట్టి ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జెస్సీరాజ్‌కు శాప్ చైర్మన్ అభినందనలు



విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభతో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ప్రధాన మంత్రి బాల పురస్కార్-2025 అందుకున్న నగరానికి చెందిన మాత్రపు జెస్సీరాజ్‌ను శాప్ చైర్మన్ రవినాయుడు తన కార్యాలయంలో శనివారం అభినందించారు. ప్రభుత్వం నుంచి ఇక మీదట పూర్తి సహకారం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ధర్నాచౌక్ : తెలుగు భాష పుట్టుక, వ్యాప్తి గురించి తొలిసారి జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తొలి తెలుగు దివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం భారత్ అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసీ అన్నారు. ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రెండు రోజులపాటు మహాసభలు జరుగుతాయన్నారు. శనివారం మీడియాతో మాట్లాడారు. తెలుగురాష్ట్రాలోని విద్యా, సాహితీవేత్తలు, శాసన పరిశోధకులు, చరిత్రకారులు పాల్గొంటారన్నారు.

మల్టీపర్పస్ యూజ్ స్టేడియం నిర్మిస్తాం

శాప్ చైర్మన్ రవినాయుడు


కాలనీవాసులతో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

భారతీనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న యువత క్రీడలు ఆడుకోవడంతో పాటు శాప్ తరపున క్రీడాశిక్షణ తరగతులను నిర్వహించే విధంగా మల్టీ పర్పస్ యూజ్ స్టేడియంను నిర్మాణం చేస్తామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నాడు. తూర్పు పరిధి 4వ డివిజన్‌లోని వెటర్నరీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న నెహ్రూ యువజన కేంద్రభవనాన్ని శాప్ చైర్మన్ రవినాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వానికి చెందిన నెహ్రూ యువజన కేంద్ర భవనం గత కొంతకాలంగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లకు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో వారు తన దృష్టికి తీసుకురావడంతో స్థలాన్ని పరిశీలించానని అన్నారు. ఈ స్థలాన్ని మల్టీపర్పస్ యూజ్ స్టేడియంగా ఉపయోగిస్తామన్నారు. స్థానికంగా ఉన్న యువకులు ఆడుకోవడంతోపాటు శాప్ తరపున నిర్వహించే శిక్షణా తరగతులకు ఉపయోగపడేలా ఈ స్థలాన్ని తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ స్థలానికి సంబంధించిన మంత్రిత్వ శాఖతో మాట్లాడి త్వరలోనే ఈ స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని అందరికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామని రవినాయుడు అన్నారు. స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ ఈ స్థలాన్ని త్వరలోనే స్థానికులకు, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా తయారుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వేదవ్యాస్, స్వర్ణఆంజనేయులు, నెల్లూరు సుబ్బారావు, కరణం శ్రీను, యుగంధర్, జాస్తి కృష్ణారావు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.


అమరావతిలోని టీటీడీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న లయోలా వాకర్స్

వాకింగ్‌కు అనుమతి రావాలని వెంకటేశ్వరస్వామికి పూజలు

భారతీనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కళాశాల యాజమాన్య వైఖరిని వ్యతిరేకిస్తూ వాకింగ్‌కు అనుమతి కావాలని లయోలా వాకర్స్ సభ్యుల చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం లయోలా వాకర్స్ అమరావతి వాకర్స్ సభ్యులు అమరావతిలోని టీటీడీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం ఉదయం లయోలా కళాశాల మెయిన్ గేట్ వద్ద వాకింగ్‌కు అనుమతి కావాలని చేపట్టే నిరసన కార్యక్రమంలో ఎక్కువ సంఖ్యలో వాకర్స్ సభ్యులు పాల్గొనాలని వాకర్స్ సంఘ ప్రతినిధులు పిలుపు ఇచ్చారు

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంతో పీబీ సిద్ధార్థ ఎంవోయూ

మొగల్రాజపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు వారితో పీబీ సిద్ధార్థ కళాశాల తెలుగు శాఖ ఎంవోయు కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహిత్యానికి చెందిన పలు కార్యక్రమాలను ఉమ్మడిగా మూడు సంవత్సరాల పాటు నిర్వహించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మాడభూషి సంపత్ కుమార్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎస్.శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.నీరజ, జి.శేషారత్నం, డాక్టర్ ఎన్. సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



ఘల్లు ఘల్లు ఘల్లుమంటు..

నాట్య పరిమళాలను వెదజల్లిన కూచిపూడి నృత్యాంశాలు



కూచిపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ మిషన్ సహకారంతో కూచిపూడి శ్రీ సిద్దేంద్ర కళాపీఠంలో 2వ రోజు ప్రదర్శించిన పలు నృత్యా నృత్యాంనంశాలు నాట్య పరిమళాలు వెదజల్లి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని గావించాయి. తొలుత ఇందిరా పరాశరం బృందం రంగపూ జ అంశాన్ని ప్రదర్శించి శ్రీకారం చుట్టారు. ప్రవాస భారతీయురాలు సాహితీ నడింపల్లి నారాయణీయం అంశంలో చూపిన హావభావాలు ఆకట్టుకున్నాయి. అనంతరం తేజస్వి ప్ర ఖ్యా, కొలువిదే గణపతి, శివతాండవం అంశాలు ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపజేశారు. మాధ భుషిణి రమణ, జగదానంద కారక అంశాన్ని, ఉదిశెట్టి వినీలరావు క్షీరసాగర, శయన అంశాలను ప్రదర్శించి మెప్పించారు. అనంతరం యామిని సరిపల్లి బృందం పూ జా నృత్యం, అభిజ్ఞాన శాకుంతలం వంటి అంశాలు ప్రదర్శించి ఔరా అనిపించారు. పసుమర్తి శేషుబాబు బృందం శ్రీరామనాటకం, కూచిపూడి యక్షగానం అంశా న్ని ప్రదర్శించి భక్తిభావంలో ముంచెత్తారు. అనుపమ మోహన్ జయదేవుని అష్టపది, వాయురూపం అంశాలను ప్రదర్శించగా, పద్మప్రియ, ఆశా ప్రియలు రాజగోపాలం భజే అం శాన్ని ప్రదర్శించారు. బాలాత్రిపుర సుందరి బృందం పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం కొరియోగ్రఫీలో రూ పొందించిన క్షీరసాగర మదనం నృత్య రూపకం ప్రదర్శించారు. వైజయంతి కాశీ బృందం దేహం దేవాలయం అం శాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తా రు. ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి కళాకారులకు జ్ఞాపికలు అందించి సత్కరించారు.

నాట్య తరంగిణి పుస్తకావిష్కరణ

కూచిపూడి నాట్యోత్సవాల్లో భాగంగా వీణామూర్తి విజయ్ రచించిన నాట్య తరంగిణి పుస్తకాన్ని పలువురు కళాకారులు శ్రీ సిద్దేంద్ర యోగి కళావేదికపై శనివారం ఆవిష్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ మాట్లాడుతూ నాట్య ప్రాశస్త్యాన్ని, కళాకారుల జీవిత విశేషాలు, నాట్యానికి సంబంధించిన పలు అంశాలు విశదీకరించే ఇలాంటి రచనలు యువ కళాకారులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. వేదాంతం వెంకటాచలపతి, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

నేడు పతాక నాట్య స్థూప ఆవిష్కరణ

కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి పతాక నాట్య స్థూపాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్టు ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకట నాగ చలపతి తెలిపారు. దేశవిదేశాల్లోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన కళాకారుల సమక్షంలో భాగవతుల రామకృష్ణ శర్మ కుంచె నుంచి జాలువారిన ఈ పతాకం స్వర్ణోత్సవాల సందర్భంగా ఆవిష్కరించనున్నారు.



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న నిర్వాహకులు, కళాకారులు, తేజస్వి బృందం అభినయం, నాట్య తరంగిణి పుస్తకావిష్కరణలో పాల్గొన్న వేదాంతం రాధేశ్యామ్, కళాకారులు

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలంలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని శ్రీశైల మహాక్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులు భక్తులతో కిటకిటలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి దర్శనార్థం తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు సమర్పించారు. కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

'పరకామణి' వ్యవహారంలో విచారణ పూర్తి: టీటీడీ ఈవో

» విజిలెన్స్ నివేదిక వచ్చాక చర్యలు

తిరుమల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణిలో దొంగతనం వ్యవహారంపై స్టేట్ విజిలెన్స్ విచారణ పూర్తయిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. నివేదిక అందాక చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏకాదశిరోజు ఉదయం 4.45 గంటలకు వీఐపీలకు, ఉదయం 8 గంటలకు టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు దర్శనాలు మొదలవుతాయన్నారు. ఆ పదిరోజుల్లో సుమారు 7 లక్షల మందికి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. దర్శన టికెట్లు, టోకెన్లు ఉన్నవారినే దర్శనానికి అనుమతిస్తామన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై వారంలో రెండుసార్లు వీఐపీ బ్రేక్ దర్శనాలు కల్పిస్తామంటూ సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఈవో స్పష్టం చేశారు. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస గౌడ్ రాజకీయ వ్యాఖ్యల అంశంపై న్యాయపరమైన సలహా కోరామని, పరిశీలించాక చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవాణి టికెట్ల కోసం వస్తున్న భక్తుల సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. కానీ ఆ టికెట్లు ఎక్కువగా ఇస్తే సామాన్య భక్తులకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. వాటి పరిమితి 1,500 టికెట్లకు మించి ఇచ్చే ఉద్దేశం లేదన్నారు. అన్నప్రసాదంలో కియోస్క్ ద్వారా గడిచిన 50 రోజుల్లో రూ.55 లక్షల విరాళాలు అందాయన్నారు. నవంబరులో 20.35 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని చెప్పారు. రూ.111.30 కోట్ల మేర హుండీ కానుకలు వచ్చాయని శ్యామలరావు వివరించారు.

ముగ్గురు మహిళా మావోయిస్టులు అరెస్టు



ఒడిశా పోలీసులు అరెస్టు చేసిన మహిళా మావోయిస్టులు

సీలేరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఒడిశా పోలీసులు ముగ్గురు మహిళా మావోయిస్టులను శనివారం అరెస్టు చేశారు. వారిలో ఒకరు ఏసీఎం కేడర్‌లో, మరో ఇద్దరు దళ సభ్యులుగా పనిచేస్తున్నారు. దీనికి సంబంధించి కోరాపుట్ డీఐజీ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు ఇంటెలిజెన్స్ నివేదిక ఇవ్వడంతో ఒడిశా స్పెషల్ ఆపరేషన్ గ్రూపు (ఎస్ఓజీ) పోలీసులు సీలేరు పోలీస్ స్టేషన్‌కు సమీపాన గుంటవాడ (ఒడిశా రాష్ట్ర పరిధి)లో గాలింపు చర్యలు చేపట్టారు. ముగ్గురు మహిళలు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో ఒకరిని ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ మిలటరీ ప్లాటూన్‌లో పనిచేస్తున్న స్వప్న అలియాస్ చంద్రమ్మగా గుర్తించారు. ఆమెపై ఒడిశా ప్రభుత్వం రూ.4 లక్షల రివార్డు ప్రకటించింది. స్వప్న 2018 నుంచి ఏవోబీలో స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి ఉదయ్‌కు ప్రొటెక్షన్ టీమ్‌లో సభ్యురాలిగా కొనసాగుతోంది. సునీత, సుస్మిత 2021 నుంచి ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరిద్దరిపై రూ.2 లక్షల చొప్పున రివార్డు ఉందని డీఐజీ పేర్కొన్నారు. ముగ్గురిపై ఒడిశాతోపాటు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కూడా పలు కేసులు ఉన్నాయని ఆయన తెలిపారు.

తల్లిని హతమార్చిన కొడుకు, కోడలు అరెస్టు

గుణదల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తన వాటా ఆస్తి ఇవ్వాలని కోరగా నిరాకరించడంతో కన్నతల్లి అన్న ఆలోచన లేకుండా హతమార్చి ఆమె మెడలోని బంగారు ఆభరణాలతో ఉడాయించి పోలీసులకు పట్టుబడ్డ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 25న ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్టు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఆమె ఒంటిపైఆభరణాలు కనబడకపోవడంతో హత్య, చోరీ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మూడు బాలు నాయక్ (68), లక్ష్మీ (62) మధురానగర్ పప్పులమిల్లు సెంటర్ వద్ద నివాసం ఉంటారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె. వీరికి వివాహలై వేర్వేరుగా నివాసాలుంటున్నారు. పెద్ద కుమారుడు ఆటో డ్రైవర్. ఆత్మకూరులో, చిన్న కుమారుడు రామకృష్ణాపురం, కుమార్తె గుణదల లెనిన్ నగర్లో ఉంటుంది. బాలు నాయక్‌కు పక్షవాతం రావడంతో పిన్నమనేని ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. అప్పుల ఊబిలో కూరుకున్న పెద్ద కుమారుడు తన వాటా ఆస్తిని తక్షణమే ఇవ్వాలంటూ తల్లి వద్ద తరచూ వాగ్వాదానికి దిగుతున్నాడు. ఈనెల 25న ఇదే విషయమై అడగ్గా స్పందించలేదు. దీంతో పెద్ద కుమారుడు మూడు పెద సాంబశివరావు (43) భార్య వాణి (35) 25న రాత్రి సమయంలో నిద్రపోతున్న తల్లి లక్ష్మిని దిండుతో ముఖంపై ఒత్తి హత్య చేసి మెడలోని రూ.4లక్షల విలువైన బంగారు నాన్‌తాడు, నల్లపూసల గొలుసు, చేతికున్న ఉంగరాలతో ఉడాయించారు. ఉదయం కుమార్తె భర్త గోపీకృష్ణ వచ్చి తలుపులు కొట్టగా తీయకపోవడంతో మరోమార్గం నుంచి వెళ్లి చూడగా లక్ష్మీ పడి పోయి ఉంది. వెంటనే చిన్న కుమారుడికి సమాచారం ఇవ్వగా అతడు వచ్చి తల్లిని ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలి వంటిపై ఉండాల్సిన బంగారు నగలు కనిపించకపోవడంతో గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, ఎస్ఐ రఫీక్ ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, బంధువులు ఇచ్చిన క్లూస్‌ను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తును వేగవంతం చేసి 24 గంటల్లోనే తల్లిని హతమార్చింది కుమారుడు, కోడలేనని భావించి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజాలు వెలుగులోకి వచ్చాయి. తల్లి మరణం వార్త తెలిసినా కుమారుడు, కోడలు రాకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.4లక్షల చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నట్టు సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్, సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ శనివారం స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియాతో వెల్లడించారు. కేసును త్వరగా ఛేదించిన వారిని సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు, డీసీపీ గౌతమీ షాలి అభినందించినట్టు ఏసీపీ దామోదర్ తెలిపారు.



నిందితుల్ని మీడియా ఎదుట హాజరుపర్చిన ఏసీపీ దామోదర్, చిత్రంలో గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, ఎస్ఐ రఫీక్



ఉద్యోగుల ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

రాజ్యాంగ హక్కుల సాధనే లక్ష్యం

● ఎస్సీ, ఎస్టీ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ నేతలు

గవర్నర్‌పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కులను సాధించుకునేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని ఎస్సీ, ఎస్టీ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర నేత ఎస్ఎస్ స్వామి కోరారు. సూర్యారావుపేటలోని స్టేట్ బ్యాంకు జోనల్ కార్యాలయంలో శనివారం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అమరావతి సర్కిల్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు ఇలాంటి సమావేశాలు నిర్వహించుకుంటే మంచి నిర్ణయాలు తీసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఎస్బీఐ ఎస్సీ, ఎస్టీ సంఘం జనరల్ సెక్రటరీ మేడికొండ సునీల్, ఫెడరేషన్ అమరావతి సర్కిల్ సెక్రటరీ సతీష్ మాట్లాడుతూ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

జాతీయ హ్యాండ్‌బాల్‌లో క్వార్టర్స్‌కు ఏపీ జట్టు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం కొట్టాయంలో ఈ నెల 26న ప్రారంభమైన సీనియర్ పురుషుల జాతీయ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఏపీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. ఇక్కడ ఏపీ జట్టు ఎస్ఎస్‌సీబీ జట్టుతో ఆడనుంది. ఈ మ్యాచ్ గెలిస్తే సెమీస్‌కు చేరనుంది. ప్రీ క్వార్టర్స్‌లో ఏపీ పశ్చిమబెంగాల్‌పై 30-26, జయభేరి మోగించగా, షేక్ వల్లీ 8, రాము 7, అమీర్ 9, జగదీష్ 6 పాయింట్లతో సత్తా చాటారని ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెనుమత్స సత్యనారాయణ రాజు తెలిపారు.

నాలుగేళ్ల తర్వాత జాతీయ వాలీబాల్ టోర్నీకి ఏపీ జట్లు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాలుగేళ్ల జాతీయ టోర్నీకి దూరంగా ఉన్న రాష్ట్ర వాలీబాల్ జట్లు ఎట్టకేలకు ఈసారి టోర్నీలో బరిలో దిగుతున్నాయి. రాష్ట్రంలో రెండు వాలీబాల్ సంఘాల వల్ల క్రీడాకారులకు తీవ్ర నష్టం జరగ్గా శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీసీఎండీ గిరిషా ప్రత్యేక శ్రద్ధతో అడహాక్ కమిటీతో జట్ల ఎంపికలను చేయించారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి 7నుంచి 13వరకు సీనియర్ జాతీయ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ పురుష, మహిళా జట్ల ఎంపికలను వాలీబాల్ అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టామని శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరిషా ఓ ప్రకటనలో తెలిపారు.

పురుషుల టీమ్: పీ ప్రశాంత్, బీ హేమంత్, వై విజయ్ సీతారామారావు, బీ శ్యామ్, బీ సూర్యనారాయణరాజు, ఆర్‌వీఎస్ వినోద్, ఎం మనోజ్ దత్త, మేడా ఈశ్వర్, గోపిరెడ్డి వెంకట శివ, కే గురు చరణ్‌కార్తీక్, ఈఈఎస్ కుమార్, ఎస్ సుధీర్‌కుమార్, బీ నూకరాజు, జీ శ్రీనివాస్, స్టాండ్‌బైలుగా బీ వెంకటేష్, సాయి సిద్ధార్థ్, సీహెచ్ లోహిత్, ఎం సత్యం, వీ మణికంఠ.

మహిళా టీమ్: ఈ నిఖిత, జీ ప్రవల్లిక, కే శివాత్మిక, జాలాది శిరీష, జీ సంజనారెడ్డి, ఏ వెంకట శివపార్వతి, ఎం సుక్తా, తులసీ, బీ డింపుల్, మెడబలిమి నాగలక్ష్మి, కే తేజ, పీ పల్లవి సాయియశ్రీ, టీ లక్ష్మీసాయి దుర్గతో పాటు స్టాండ్‌బైలుగా పీ మేఘన సంధినేని నేహాను ఎంపిక చేశారు.

నేడు జంక్షన్‌లో ప్రపంచ మాదిగ దినోత్సవం

వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు సమీపంలోని కృష్ణాజిల్లా హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం ప్రపంచ మాదిగ దినోత్సవం జరుగుతుందని ఇంటర్నేషనల్ ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.ఆర్ కన్వెక్షన్‌లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయన్నారు. ఫోరం ఫర్ మాదిగాస్ ఆధ్వర్యంలో 'వ్యాపార పారిశ్రామిక రంగంలో మాదిగలు' అనే అంశంపై సదస్సు, ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్, ట్రేడ్ ఇండస్ట్రీ ప్రారంభోత్సవ వేడుక జరుగుతుందన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌రావు, మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెఎస్ఎంఈ ఛైర్మన్ తమ్మారెడ్డి శివశంకర్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావ్, కొలికపూడి శ్రీనివాసరావు, తంగిరాల సౌమ్య, వర్ల కుమార్ రాజా, ముప్పిడి వెంకటేశ్వరరావు, బూర్ల రామాంజనేయులు, చింతమనేని ప్రభాకర్‌రావు, బడేటి రాధాకృష్ణయ్య, బోనెల విజయచంద్ర, గద్దం శేఖర్ బాబు, గాయని విమలక్క పాల్గొంటారన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధే ధ్యేయం

● ఎంపీ కేశినేని శివనాథ్ ● నగరంలో జాబ్‌మేళా ● పాల్గొన్న ఎమ్మెల్యేలు బొండా ఉమ, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ ● జనవరి 5న ఎంఎస్ఎంఈపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

మొగల్రాజపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముందుచూపు కలిగిన నేత చంద్రబాబు సీఎంగా రావడం ఆంధ్రప్రదేశ్ చేసుకున్న అదృష్టమని ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తారని పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ చెప్పారు. వికసిత్ భారత్ జాబ్ మేళా మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శనివారం జరిగింది. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, కలెక్టర్ లక్ష్మీశతో కలిసి ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో పాల్గొని యువత ఉద్యోగాలు పొందడంతో పాటు మరొకరికి ఉద్యోగం ఇచ్చేస్థాయికి ఎదగాలన్నారు. యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు జనవరి 5న ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యువత తాము న్న చోటే ఉద్యోగం పొందాలనే ఆలోచన విరమించుకుంటే మంచి అవకాశాలు ఉంటాయన్నారు. త్వరలో జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరంలోనూ జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రానున్న 5ఏళ్లలో 25 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయలని సంకల్పించారన్నారు. మరో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీవితంలో ఎదగాలనుకునే వారు కింద స్థాయి నుంచి పెద్ద పారిశ్రామిక వేత్తలైన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తొలుత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమా స్టాల్స్‌ను సందర్శించి ఉద్యోగాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న యువతతో, ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న వారితోను మాట్లాడారు. వికసిత్ భారత్ లచ్చన్న, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాస్, ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వెంచరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు,కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావ్, దేవినేని అపర్ణ, టెక్ మహీంద్ర ప్రతినిధి లింగరాజు, స్పాన్ స్పేస్ టెక్నాలజీ ప్రతినిధి లక్ష్మి, వివిధ కంపెనీ ప్రతినిధులు నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఇంటర్వ్యూల్లో పాల్గొని ఉద్యోగాలు పొందిన వారికి ఎంపీ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. 5,500కి పైగా హాజరు కాగా 66 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 1400 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు.

జాతీయ క్రీడలకు స్టేడియాలు సిద్ధం

● నేషనల్ వాలీబాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణలో ఎంపీ కేశినేని శివనాథ్



వాలీబాల్ టోర్నీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో అమరావతిలో 2027 జాతీయ క్రీడల నిర్వహణకు విజయవాడలోని అన్ని స్టేడియాలను సిద్ధం చేస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆతిథ్యంలో జనవరి 6 నుంచి 10 వరకు జరిగే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ వాలీబాల్ బాలబాలికల అండర్-19 టోర్నీ పోస్టర్లను కళాశాల ప్రాంగణంలోని సెమీనార్ హాల్లో ఎంపీ శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలకు సిద్ధార్థ విద్యాసంస్థలకు ప్రత్యేక శ్రద్ధ కనపరచడంపై అభినందించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రాలో జాతీయ క్రీడలు, ఆఫ్రో ఏషియన్స్ గేమ్స్‌ను చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. పీబీ సిద్ధార్థ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మేకా రమేష్, చుండీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఈ జాతీయ వాలీబాల్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీ రవికాంత మాట్లాడుతూ ఈ టోర్నీకి దేశంలోని రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మొత్తం 44 టీమ్‌లు పాల్గొనే అవకాశాలున్నాయని తెలిపారు. శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి, డీవైఈవో సీఎస్ఎస్ఎన్ రెడ్డి, రాష్ట్ర స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ రాధాకృష్ణ, రాజు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, టీఎన్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామకృష్ణంరాజు, కళాశాల పీడీ మార్కండేయులు పాల్గొన్నారు.

నితీష్ రెడ్డికి రూ.25 లక్షల పురస్కారం

వన్‌టౌన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టెస్ట్ మ్యాచ్‌లో ఆరంగ్రేటం చేసిన విశాఖపట్నం జిల్లాకు చెందిన నితీష్‌రెడ్డి సెంచరీ చేయటంపై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రత్యేక అభినందనలు తెలిపారు. శనివారం గురునానక్ నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నితీష్ రెడ్డికి రూ.25 లక్షల నగదు పురస్కారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున అందజేయనున్నట్టు ప్రకటించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరఫున అతడికి అభినందనలు తెలిపారు. నితీష్ కుమార్ రెడ్డి దేశానికి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అతనికి రూ.25 లక్షల నగదు పురస్కారాన్ని అందజేస్తామన్నారు. విజయనగరం, అనంతపురంలో జనవరిలో క్రికెట్ అకాడమీలు ప్రారంభిస్తామని, వచ్చే వేసవి నాటికి విజయవాడలో మరో క్రికెట్ అకాడమీని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. వైజాగ్‌లోని క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేందుకు వీలుగా రూ.45 కోట్లతో ఆధునీకరించనున్నట్టు తెలిపారు. శాప్, మునిసిపల్ శాఖల ఆధ్వర్యంలో ఐజీఎం స్టేడియంలో వచ్చే ఏడాది మార్చి నుంచి పలు అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని శివనాథ్ తెలిపారు. దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియం, మాకినేని బసవపున్నయ్య స్టేడియంను కూడా ఆధునీకరించనున్నట్టు తెలిపారు. ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుశీల నాగేశ్వరరావు, సభ్యుడు కె.బలరాం, రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సెక్రటరీ మోపర్తి శివరాం పాల్గొన్నారు.

13 నుంచి బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్లు

● రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్

ఉంగుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద అవుటపల్లిలోని సుప్రసిద్ధ కథోలికా క్షేత్రమైన తంబి పుణ్యక్షేత్రంలో దైవసేవకుడు బ్రదర్ జోసఫ్‌తంబి 80వ వర్ధంతి మహోత్సవాలు (తిరునాళ్లు) జనవరి 13, 14, 15న ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ అన్నారు. ఏర్పాట్లకు చేపట్టాల్సిన చర్యలపై శనివారం స్థానిక తంబి కళావేదిక ప్రాంగణంలో నిర్వహించిన సమన్వయకమిటీ సమావేశంలో వివిధశాఖల అధికారులు, మతగురువులు, గుడిపెద్దలు, సంఘపెద్దలతో కలిసి సమాలోచనలు జరిపారు. కో-ఆర్డినేషన్ కమిటీలోని అధికారులు, పెద్దలు అందించిన సహకారంతోనే ఏటా తిరునాళ్లను వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా విజయవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, సలహాలు అందించి సహకరించాలని కోరారు. గుడి తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాల్లో చేపట్టాల్సిన చర్యలపై తహసీల్దార్ విమలకుమారి, ఎంపీడీవో సత్యకుమార్, సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ సూచనలు చేశారు.

4 నుంచి నవదిన ప్రార్థనలు

బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా వచ్చేనెల 4నుంచి 12వరకు తంబి పుణ్యక్షేత్ర ప్రాంగణంలో నవదిన ప్రార్థనలు నిర్వహించనున్నట్టు ఫాదర్ జోసఫ్ తెలిపారు. వివిధ ప్రాంతాల మత గురువులు, విచారణ గురువులు దివ్యసందేశాలను అందిస్తారన్నారు.

కార్పొరేటర్ చన్నగిరి రాజీనామా

● టీడీపీలో బయటపడ్డ అంతర్గత విభేదాలు..

సత్యనారాయణపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో అంతర్గత విభేదాలతో 32వ డివిజన్ కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు శనివారం కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. డివిజన్‌లో మరో వర్గానికి ఎమ్మెల్యే పెద్ద పీట వేస్తుండడంతో కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న ఆయన రాజీనామా చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గాలిలో 32వ డివిజన్ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆయన విజయం సాధించారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే నుంచి సహకారం అందటం లేదు. డివిజన్‌లో రెండు వరాలుండడం, కార్పొరేటర్ అయినా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో గతంలోనూ రాజీనామాకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చొరవతో ఉపసంహరించుకున్నారు. ఇప్పుడూ అదే పరిస్థితి. కిందిస్థాయి కేడర్ వైసీపీ మనిషివి అన్నా ఎమ్మెల్యే పట్టించుకోలేదు. దీంతో తన స్థానంలో వేరొకరిని తెచ్చేందుకు పొమ్మనలేక పొగపెడుతున్నారని అర్థమై రాజీనామా చేసినట్టు తెలుస్తోంది.

వ్యక్తిగత కారణాలతోనే... : చన్నగిరి

కేవలం వ్యక్తిగత కారణాల వల్లే రాజీనామా చేస్తున్నాను. కుటుంబ పనులతో తగిన సమయం కేటాయించ లేకపోతున్నాను. కేడర్‌తో విబేధాలు రాజీనామాకు కారణం కాదు.

నెరెడ్కో-2025 డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి నారాయణ, ఎంపీ కేశినేని, ఎమ్మెల్యేలు బొండా ఉమ, యార్లగడ్డ, నెరెడ్కో ప్రతినిధులు

పటమట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రంలో అయినా రియల్ ఎస్టేట్ డెవలప్ అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి నారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ కాలనీ దివెన్యు ఫంక్షన్ హాల్‌లో నెరెడ్కో 2025 డైరీ ఆవిష్కరణ శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు బొండా ఉమ, యార్లగడ్డ వెంకట్రావు, నెరెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అయినా రియల్ ఎస్టేట్ డెవలప్ అయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఐదేళ్లల్లో రియల్ ఎస్టేట్ కుదేలైందన్నారు. నూతన విధానాలను ఈ నెల 30, 31న వి డుదల చేస్తామన్నారు. నెరెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు.

2024లో ప్రపంచవ్యాప్తంగా గూగుల్‌లో నెటిజెన్స్ వెతికిన నటీనటులు ఎవరు? వారిలో మన దేశానికి చెందిన వారెవరైనా ఉన్నారా? ఈ ప్రశ్నలకు సమాధానం మీకు తెలుసా? షారూక్.. సల్మాన్.. అల్లు అర్జున్.. ఇలా రకరకాల పేర్లు మీ మనసులో మెదులుతున్నాయి కదా.. కానీ వీరెవ్వరూ కాదు. ఈ ఏడాది గూగుల్ జాబితాలో పవన్ కళ్యాణ్ రెండో స్థానంలో.. హీనాఖాన్ ఐదో స్థానంలో.. నిమ్రత్ కౌర్ ఎనిమిదో స్థానంలో ఉన్నారు. పవన్ కళ్యాణ్ గురించి తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హీనాఖాన్ గతంలో "యేరిస్తా క్యా ఖేల్‌తా హై", "కసూతి జిందగీ కే" మొదలైన సీరియల్స్‌లో నటించింది. తనకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిందని ప్రకటించిన వెంటనే ఆమె గురించి తెలుసుకోవటానికి నెటిజెన్స్ గూగుల్‌లో సెర్చ్ చేయటం మొదలుపెట్టారు. ఇక నిమ్రత్ కౌర్ బాలీవుడ్‌లో సుప్రసిద్ధ నటి. లంచ్‌బాక్స్, దసవీ, ఎయిర్‌లిఫ్ట్ వంటి సినిమాలలో ఆమె నటించారు. ఆమె అభిషేక్ బచ్చన్‌ను పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వచ్చిన వెంటనే ఆమెకు విపరీతమైన పాపులారిటీ వచ్చింది.



హీనా ఖాన్

నిమ్రత్ కౌర్





ఎప్పుడూ విజయాలు అపజయాలను మాత్రమే లెక్క వేసుకునే టాలీవుడ్ చిత్రపరిశ్రమను ఈ ఏడాది పలు వివాదాలు చుట్టుముట్టాయి. సంక్రాంతి హిట్లతో జోరుగా మొదలైన ప్రయాణం అదే ఊపులో కొనసాగింది. అయితే ఒకదాని వెంట ఒకటిగా వచ్చిపడిన వివాదాలతోనే టాలీవుడ్ ప్రముఖంగా వార్తల్లో నిలిచింది. మొత్తానికి 2024 వివాదాలతో గుర్తుండిపోతుందనేది సినీ విశ్లేషకుల మాట.

అవార్డులు

70వ జాతీయ పురస్కారాలు టాలీవుడ్‌కు నిరాశ మిగిల్చాయి. ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' ఎంపికైంది. తమిళ చిత్రం 'తిరు చిత్రంబలం'కు గాను నిత్యామీనన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్ ఎంపికైనా పోక్సో కేసు నేపథ్యంలో పురస్కారాన్ని కేంద్రం వెనక్కుతీసుకుంది. సినీ పరిశ్రమకు చేసిన కృషికి గుర్తింపుగా చిరంజీవి పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు.

విజయాలతో మొదలై వివాదాలతో ముగిసి...

గూగుల్ సెర్చ్‌లో రెండో స్థానం!

పవన్ గురించి వెతికేశారు...

మొదటి పది స్థానాల్లో ఉన్న నటులు వీరే

1) కాట్ విలియమ్స్ (అమెరికన్ కమెడియన్)
2) పవన్ కళ్యాణ్
3) ఆడమ్ బ్రాడీ (అమెరికన్ నటుడు)
4) ఎల్లా పుర్‌నిల్ (బ్రిటన్‌కు చెందిన నటి)
5) హీనా ఖాన్
6) కిరెన్ కుల్కిన్ (అమెరికన్ నటుడు)
7) టెర్రెన్స్ హవార్డ్ (అమెరికన్ నటుడు)
8) నిమ్రత్ కౌర్
9) సుటన్ ఫాస్టర్ (అమెరికన్ నటుడు)
10) బ్రిగెట్టి బోజో (వెనిజువెలా నటి)

ఈ తారల సందడి లేదు



ఈ ఏడాది తెలుగులో కొందరు అగ్రహీరోయిన్‌ల సందడి అసలు కనిపించలేదు. వారు నటించిన ఒక్క చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాలేదు. గతేడాది సమంత నటించిన 'శాకుంతలం', 'ఖుషి' చిత్రాలు విడుదలయ్యాయి. అవి రెండూ కూడా సమంతకు నిరాశనే మిగిల్చాయి. ఇక ఈ ఏడాది ఆమె నటించిన చిత్రం ఒక్కటి కూడా విడుదలవ్వలేదు. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ప్రకటించినా అది ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. అయితే సమంత 'సిటాడెల్: హనీబన్నీ' వెబ్‌సిరీస్ ద్వారా అభిమానులను ఎంటర్‌టైన్ చేశారు.

మరో అగ్రకథానాయిక అనుష్క శెట్టి కూడా ఈ ఏడాది పెద్దతెరపై కనిపించలేదు. మూడేళ్ల విరామం తర్వాత 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో గతేడాది టాలీవుడ్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చిన అనుష్కశెట్టి మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అయితే అదే ఊపును ఆమె ఈ ఏడాది కొనసాగించలేకపోయారు. ఆమె నటించిన సినిమాలేవి 2024లో విడుదలవ్వలేదు. ఆ లోటు తీర్చేలా కొత్త ఏడాదిలో 'ఘాటీ, కథనార్' చిత్రాలతో ఆమె ప్రేక్షకులను అలరించనున్నారు. మరో సీనియర్ హీరోయిన్ త్రిష కూడా ఈ ఏడాది తెలుగు సినిమాల్లో కనిపించలేదు. చిరంజీవి సరసన నటించిన 'విశ్వంభర' విడుదల చివర్లో వాయిదాపడడంతో ఆమె ఎంట్రీ మిస్సయ్యింది. విజయ్ నటించిన 'గోట్' చిత్రంతో త్రిష ప్రత్యేక గీతంలో కనిపించారు. ఈ ఏడాది ధనుష్‌తో వివాదంతో వార్తల్లో నిలిచిన నయనతార కూడా తెలుగులో స్ట్రెయిట్ చిత్రం చేయలేదు. ఆమె జీవితం ఆధారంగా తెరకెక్కిన 'నయనతార: బియాండ్ ది ఫెరీ టేల్' ఓటీటీలో స్ట్రీమింగ్ అయింది. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా తిరుగులేని ఆధిపత్యాన్ని చలాయించిన పూజాహెగ్డేకు వరుస అపజయాలు షాక్ ఇచ్చాయి. 'రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య' చిత్రాలు వరుసగా డిజాస్టర్ అవ్వడంతో ఆమె టాలీవుడ్‌కు దూరమయ్యారు. ప్రస్తుతం ఆమె హిందీలో నటిస్తున్న 'దేవా, హై జవానీ తో ఇష్క్ హోనా హై', తమిళంలో సూర్య, విజయ్ సరసన నటిస్తున్నారు. గతేడాది, ఈ ఏడాది ఆమె ఒక్క తెలుగు సినిమా చేయలేదు.





చుట్టుముట్టిన వివాదాలు

ఈ ఏడాది తెలుగు సినీ పరిశ్రమను పలు వివాదాలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. యువ హీరో రాజ్‌తరుణ్‌పై లావణ్య అనే యువతి చీటింగ్ కేసు పెట్టింది. మాల్వి మల్హోత్రా అనే నటి వలలో పడి తనను దారుణంగా మోసగించాడని లావణ్య ఆరోపించింది. ఆర్.జె.శేఖర్ భాషా కూడా ఈ వివాదంలో ఇరుక్కున్నారు. కొంత కాలానికి ఈ వివాదం సద్దుమణిగింది.

- నటి సమంత- నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సమంత, అక్కినేని కుటుంబంతో పాటు చిత్రపరిశ్రమ సురేఖకు దీటుగా బదులిచ్చింది. నాగార్జున సురేఖపై పరువు నష్టం దావా వేశారు. అలాగే నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత కూడా పతాక శీర్షికల్లో నిలిచింది.
- కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై ఆయన సహాయకురాలు లైంగిక వేధింపుల కేసు పెట్టింది. ఈ కేసులో జానీ మాస్టర్ అరెస్ట్ అయి బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆయనకు ఇచ్చిన జాతీయ అవార్డును కేంద్రం వెనక్కి తీసుకుంది. ఈ క్రమంలో డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ నుంచి ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారు.
- సీనియర్ నటుడు మోహన్‌బాబు కుటుంబ కలహాలు రచ్చకెక్కాయి. మోహన్‌బాబుతో తనకు ప్రాణహాని ఉందని మనోజ్ పోలీస్ కేసు పెట్టారు. మనోజ్ ఆహ్వానం మేరకు వెళ్లిన మీడియాపై మోహన్‌బాబు దాడి చేశారు. ఈ ఘటనలో ఓ జర్నలిస్టుకు గాయాలు కాగా, మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది.
- నటి కస్తూరి తెలుగు ప్రజల పట్ల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ అంశంలో ఆమెను చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆమె బెయిల్‌పై బయట ఉన్నారు.
- పుష్ప-2 బెనిఫిట్ షో చూడటానికి అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కి వెళ్లినప్పుడు అక్కడ జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందారు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె కుమారుడు శ్రీతేజ్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ కేసులో అరెస్టయిన బన్నీ బెయిల్‌పై విడుదలయ్యారు.
- బెంగళూరు రేవ్ పార్టీలో అరెస్టయిన నటి హేమ కొన్నాళ్లు జైలు జీవితం గడిపారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల రామ్‌గోపాల్ వర్మపై కేసులు నమోదయ్యాయి. పోలీసులకు దొరక్కుండా కొన్నాళ్లు అజ్ఞాతవాసంలో గడిపిన వర్మ కోర్టు జోక్యంతో ఊరట పొందారు.







పెళ్లి కళ

2024లో టాలీవుడ్‌కు పెళ్లి కళ కనిపించింది. పలువురు సినీతారలు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఫిబ్రవరిలో రకుల్ ప్రీత్‌సింగ్ నిర్మాత జాకీ భగ్నానీతో ఏడడుగులు వేశారు. మార్చిలో హీరోయిన్ అదితీరావు హైదరీ, హీరో సిద్ధార్థ్‌ను పెళ్లాడారు. అలాగే కృతి కర్బందా, నటుడు పులకిత్ సామ్రాట్ ఒక్కటయ్యారు. తాప్సీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మతియాస్ బోని పెళ్లాడారు. జూలైలో నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను పెళ్లాడారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్‌ల వివాహం ఆగస్టులో జరిగింది. సెప్టెంబర్‌లో హీరోయిన్ మేఘా ఆకాశ్ తన స్నేహితుడు, ప్రియుడు సాయి విష్ణుని వివాహం చేసుకున్నారు. గాయని గాయకులు రమ్యబెహరా, అనురాగ్ కులకర్ణి ప్రేమవివాహం ఆగస్టులో జరిగింది. ఈ నెల 4న నాగచైతన్య, శోభితా మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. 12న గోవాలో కీర్తిసురేశ్ వివాహం వ్యాపారవేత్త ఆంతోని తట్టిల్‌తో జరిగింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, సందీప్‌రాజ్, నటుడు సుబ్బరాజు, సాయికిరణ్, శ్రీసింహ ఈ ఏడాది పెళ్లి పీటలెక్కారు.




భారీ హిట్లు


మహేశ్‌బాబు 'గుంటూరు కారం', నాగార్జున 'నా సామిరంగ' చిత్రాలతో ఈ ఏడాది సంక్రాంతి విజయాలను అందుకున్నారు. ఇక చిన్నసినిమాగా బరిలోకి దిగిన 'హను-మాన్' పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని నమోదు చేసింది. రూ. 50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి రూ. 300 కోట్లకు పైబడి వసూళ్లను సాధించి అబ్బురపరిచింది. వెంకటేశ్ 'సైంధవ్' ప్రేక్షకులను నిరాశపరిచింది. 'టిల్లూ స్క్వేర్' చిత్రంతో యువహీరో సిద్ధు జొన్నలగడ్డ మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. మార్చిలో విడుదలైన ఈ చిత్రం రూ. 130 కోట్ల వసూళ్లతో ఘన విజయాన్ని నమోదు చేసింది. ఇక ద్వితీయార్థంలో ప్రభాస్ తన పవర్ చూపించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడి' చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్ల క్లబ్‌లో చేరింది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా శివ కొరటాల దర్శకత్వం వహించిన 'దేవర 1' సినిమా టాలీవుడ్‌తో పాటు హిందీ బెల్ట్‌లోనూ మంచి ఆదరణను సొంతం చేసుకుంది.



నాని హీరోగా వివేక్ ఆత్రేయ తెరకెక్కించిన చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ సినిమాతో నాని మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. కిరణ్ అబ్బవరం ఎదురుచూపులు ఫలించి, ఆయన హీరోగా నటించిన 'క' చిత్రం అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. గ్రామీణ నేపథ్యంలో మర్డర్ మిస్టరీ కథతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 50 కోట్ల వసూళ్లను రాబట్టింది. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లక్కీ భాస్కర్'. బ్యాంకింగ్ రంగంలో మోసాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం రూ. వందకోట్ల వసూళ్లను అధిగమించింది. జాతీయ స్థాయిలో 'పుష్ప 2' ప్రభంజనం కొనసాగుతోంది. దాదాపు 12 వేలకు పైబడి స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం ఉత్తరాది బెల్ట్‌లో వీరవిహారం చేస్తోంది. రూ. 2 వేల కోట్ల క్లబ్‌కు చేరువలో ఉంది.



ముత్యాల ముగ్గు



22 చుక్కలు
2 వచ్చేవరకు
సందుచుక్కలు.

సుజాత పి.వి.ఎల్.
సైనిక్‌పురి, సికింద్రబాద్

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్
జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
ఈ-మెయిల్: features@andhrajyothy.com

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్			**డిస్నీ ప్లస్ హాట్‌స్టార్**		
అవిసీ	డాక్యుమెంటరీ మూవీ	డిసెంబర్ 31	ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్	మలయాళ చిత్రం	జనవరి 03
డోంట్ డై	హాలీవుడ్ మూవీ	జనవరి 01	గుణ	హిందీ చిత్రం	జనవరి 03
మిస్సింగ్ యూ	వెబ్‌సిరీస్	జనవరి 01	**మనోరమా మ్యాక్స్**		
రీ యూనియన్	హాలీవుడ్ మూవీ	జనవరి 01	ఐ యామ్ కథలన్	మలయాళ చిత్రం	జనవరి 03
లవ్ ఈజ్ బ్లైండ్	వెబ్‌సిరీస్	జనవరి 03	**ఆహా...**		
సెల్లింగ్ ది సిటీ	వెబ్‌సిరీస్	జనవరి 03	జాలీ ఓ జింఖానా	తమిళచిత్రం	డిసెంబర్ 30
వెన్ ది స్టార్స్ గాసిప్	వెబ్‌సిరీస్	జనవరి 04	**బుక్ మై షో**		
అమెజాన్ ప్రైమ్			క్రిస్మస్ ఈవ్ ఇన్ మిల్లర్స్ పాయింట్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 30
గ్లాడియేటర్ 2	హాలీవుడ్ మూవీ	జనవరి 01			
ది రిగ్	వెబ్‌సిరీస్	జనవరి 02			

ప్రేమ కోసం తపించే హృదయాలు

'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' చిత్రానికి పాయల్ కపాడియా దర్శకత్వం వహించారు. కేన్స్ చిత్రోత్సవంలో రెండో అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ ప్రిక్స్'ను అందుకుంది. ఒక భారతీయ చిత్రం ఈ అవార్డును అందుకోవడం ఇదే తొలిసారి. అలాగే గోల్డెన్ గ్లోబ్ పురస్కారాల్లో రెండు నామినేషన్స్ సాధించింది. ఈ చిత్రాన్ని తెలుగులో నటుడు రానా విడుదల చేశారు. కేరళ నుంచి ముంబైకు వచ్చి అక్కడ నర్సులుగా పనిచేస్తున్న ప్రభ, అను అనే ఇద్దరమ్మాయిల కథ ఇది. ఓ రోడ్ ట్రిప్ వారి జీవితాల్లో ఎలాంటి మార్పుకు కారణమైందనేది కథ. ప్రేమ కోసం తపించే హృదయాలను, ముంబై నగరంలో ఓ గూడు కోసం అలమటించే పేదల ఆవేదనను కపాడియా అద్భుతంగా ఆవిష్కరించారు.





'పుష్ప' స్టయిల్లో..

కెరీర్‌లో తొలి టెస్టు అర్ధ శతకం సాధించిన నితీశ్ 'పుష్ప' మాదిరిగా సంబరం చేసుకున్నాడు. 50 పరుగులు పూర్తి చేయగానే బ్యాటుతో అభిమానులకు అభివాదం చేశాడు. 'పుష్ప' సినిమాలో హీరో మాదిరి బ్యాటును మెడకింద కుడి వైపు నుంచి ఎడమవైపునకు తీసుకొచ్చాడు. అదే వీడియోను 'పుష్పకాదు.. ఫైర్' అంటూ బీసీసీఐ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇక శతకం సాధించిన సందర్భాన్ని నితీశ్ మరింత ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకున్నాడు. బ్యాట్‌ను గ్రౌండ్‌పై నిలువుగా పెట్టి మోకాళ్లపై నిలుచున్నాడు. బ్యాట్ హ్యాండిల్‌పై హెల్మెట్‌ను ఉంచి ఆకాశంలో చూస్తూ సలార్ సినిమాలో హీరోని గుర్తు చేశాడు.

కొడుకు తొలి శతకం తండ్రి భావోద్వేగం

నితీశ్ మొదటి టెస్టు శతకం పూరించగానే..స్టేడియంలో ఉన్న అతడి తండ్రి ముత్యాలరెడ్డి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నితీశ్ 90ల్లోకి రాగానే ఆయన ముఖంలో టెన్షన్ కనిపించింది. కుమారుడు శతకం చేయాలని ఆయన దేవుణ్ణి ప్రార్థించారు. సెంచరీ పూర్తి చేయగానే ఉద్వేగం పట్టలేక ఏడ్చేశారు. తండ్రితో పాటు గ్రౌండ్‌లో మ్యాచ్ తిలకిస్తున్న నితీశ్ తల్లి, సోదరి కూడా ఉద్వేగానికి లోనయ్యారు. శనివారం సాయంత్రం నితీశ్‌ను అతడు బస చేస్తున్న హోటల్లో తల్లి, తండ్రి, సోదరి కలిశారు. డోర్ తీసిన వెంటనే తల్లిని హత్తుకున్న నితీశ్..అనంతరం సోదరిని, చివరగా తండ్రిని ఆలింగనం చేసుకున్నాడు. ఈ సందర్భంగా తండ్రిని చూసి నితీశ్ ఉద్వేగానికి గురయ్యాడు.



అమ్మతో..!

41, 38 నాటౌట్, 42, 42, 16.. తాజా సిరీస్‌లో

నితీశ్ కుమార్ బ్యాట్ నుంచి వచ్చిన స్కోర్లివి. తన బ్యాటింగ్ తీరుతో అందరినీ ఆకట్టుకుంటున్నా కనీసం 50+ స్కోరైనా నమోదు కావడం లేదే అనే వెలితి అందరిలోనూ ఉంది. చివరకు సాధించాడు. జట్టు కష్టాల్లో ఉన్న వేళ బరిలోకి దిగిన తను.. ఓ వైపు ఫాలోఆన్ ప్రమాదం పొంచి ఉండగా.. ప్రఖ్యాత మెల్‌బోర్న్ మైదానంలో అబ్బురమనిపించే షాట్లతో చెలరేగాడు. ఎనిమిదో స్థానంలో వచ్చి ప్రపంచ అత్యుత్తమ స్థాయి బౌలర్లను కాచుకుంటూ 21 ఏళ్ల నితీశ్ వైల్డ్ ఫైర్ బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డాడు. కుమారుడి కెరీర్ కోసం సర్వస్వం త్యాగం చేసిన ఆ తండ్రి కళ్ల ముందే.. కెరీర్‌లో తొలి సెంచరీతో ఈ తెలుగు తేజం క్రీడాభిమానులను ఉప్పొంగిపోయేలా చేశాడు. అటు సుందర్ హాఫ్ సెంచరీతో జట్టును కాపాడే ప్రయత్నం చేశాడు.

అజేయ శతకంతో చెలరేగిన ఆంధ్రా కుర్రోడు నితీశ్

మనోడు నిలబెట్టాడు



నితీశ్ కుమార్ (105 బ్యాటింగ్)

ఆసీస్‌తో బాక్సింగ్ డే టెస్టు

నాన్నకు అంకితం

తన తొలి టెస్టు శతకాన్ని తండ్రి ముత్యాలరెడ్డికి అంకితం ఇస్తున్నట్టు నితీశ్ ప్రకటించాడు. తాను సెంచరీ పూర్తి చేయడాన్ని చూసి ఉద్వేగంతో ఏడ్చేస్తున్న తండ్రి ఫొటోను పోస్ట్ చేసిన నితీశ్.. 'ఇది మీకోసమే నాన్న' అని ఆ ఫొటో కింద రాశాడు. 'నాకోసం నాన్న ఉద్యోగాన్ని వదిలేశారు. నేను ఈస్థితికి చేరడం వెనుక ఆయన త్యాగం ఎంతో ఉంది. తీవ్రమైన ఆర్థిక సమస్యలతో ఒకానొక సందర్భంలో ఆయన ఏడవడాన్ని చూశా. నా తొలి జెర్సీని ఆయనకు ఇచ్చినప్పుడు నాన్న మొహంలో సంతోషాన్ని నేను మాటల్లో వర్ణించలేను' అని నితీశ్ అన్నాడు.

4 ఆస్ట్రేలియా గడ్డపై శతకాలు సాధించిన తెలుగు ఆటగాళ్లలో నితీశ్ నాలుగోవాడు. అంతకు ముందు హైదరాబాదీ ఆటగాళ్లు ఎంఎల్ జైసింహ (1968), అజరుద్దీన్ (1992), వీవీఎస్ లక్ష్మణ్ (2000-08 మధ్య 4 శతకాలు) సెంచరీలు సాధించారు.

కలకాలం గుర్తుండే ఇన్నింగ్స్

ఈ ఇన్నింగ్స్ నితీశ్‌కు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. తొలి టెస్టు నుంచే అతడి బ్యాటింగ్ నన్ను ఆకట్టుకుంది. సిరీస్‌లో ఈరోజు అతి కీలక ఇన్నింగ్స్ ఆడడం ద్వారా నితీశ్ కెరీర్‌లో మరో మెట్టు పైకెక్కాడు. అతడికి సుందర్ చక్కగా సహకరించాడు. -సచిన్

అనేక సెంచరీలకు నాంది

నేను కచ్చితంగా చెప్పగలను.. ఈ శతకం నువ్వు సాధించబోయే అనేక సెంచరీలకు నాంది. భయం లేకుండా నువ్వు ఆడిన స్ట్రోక్ ప్లేను, నీ సానుకూల దృక్పథాన్ని ఎంతో ఆస్వాదించా. ఇకముందూ ఇలాగే ఆడాలి. దేవుడి ఆశీస్సులు నీకెప్పుడూ ఉంటాయి. - వీవీఎస్ లక్ష్మణ్

ఐపీఎల్‌లో సంచలన బ్యాటింగ్‌తో భారత టీ20 జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అంతర్జాతీయ టీ20లలోనూ సత్తా చాటి టెస్టు జట్టులో సైతం చోటు ఖాయం చేసుకున్నాడు. ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినప్పుడు 'పొట్టి ఫార్మాట్‌లో ఎడాపెడా బంతిని బాదినంత సులువుకాదు సుదీర్ఘ ఫార్మాట్‌లో రాణించడం' అని అనుమానాలు వ్యక్తం చేసిన వారు లేకపోలేదు. కానీ వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆస్ట్రేలియాతో తొలి మూడు టెస్టుల్లోనూ నిలకడైన బ్యాటింగ్‌తో తానేమిటో నిరూపించుకున్నాడు. కీలకమైన నాలుగో టెస్టులో జట్టు అత్యంత దయనీయస్థితిలో ఉన్నప్పుడు ఏకంగా శతకంతో కదంతొక్కి ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. క్రికెట్ పండితుల నీరాజనాలు అందుకున్నాడు. అతడే తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి.

ఆపద్బాంధవుడు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఐపీఎల్‌లో ఎన్నో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన అతడు నితీశ్ కుమార్ రెడ్డి క్రీజులో గంటలకొద్దీ పాతుకుపోవాల్సిన టెస్టు క్రికెట్‌లోనూ భళా అనిపిస్తున్నాడు. కంగారూల గడ్డపై బౌన్సీ, స్వింగ్ పిచ్‌లకు అనుగుణంగా తన బ్యాటింగ్‌ను మార్చుకొని నికార్సయిన క్రికెటర్‌గా ప్రశంసలు పొందుతున్నాడు. అరంగేట్రం టెస్టులో..పెర్త్ బౌన్సీ వికెట్‌పై కోహ్లీ, రాహుల్ వంటి హేమాహేమీ బ్యాటర్లు చేతులెత్తేసిన వేళ..తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగులతో నితీశ్ ఆకట్టుకున్నాడు. భారత్ ఘన విజయం సాధించిన ఆ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో అజేయంగా 38 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఇక అడిలైడ్ డే/నైట్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో 42 పరుగుల చొప్పున చేసి తన విలువ చాటిచెప్పాడు. మెల్‌బోర్న్ టెస్టు శతక ఇన్నింగ్స్‌తో 21 ఏళ్ల నితీశ్ ఒక్కసారి సూపర్ స్టార్‌గా మారాడు. సిరీస్‌లో ఇప్పటివరకు మూడు వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గానూ న్యాయం చేశాడు.

ఎన్నో కష్టాలకోర్చి..: నితీశ్ ఈస్థాయికి రావడం వెనుక అతడి కఠోర శ్రమతోపాటు కుటుంబ త్యాగం చాలా ఉంది. విశాఖపట్నానికి చెందిన నితీశ్ తండ్రి ముత్యాలరెడ్డి హిందుస్థాన్ జింక్ సంస్థ నుంచి వీఆర్ఎస్ తీసుకొన్నారు. ఎందుకో తెలుసా..క్రికెటర్ కావాలనే తన 12 ఏళ్ల కుమారుడు నితీశ్ కల నిజం చేసేందుకు. సరైన క్రికెట్ కోచింగ్ సౌకర్యాలు లేని ఉదయ్‌పూర్‌కు బదిలీ కావడంతో ఆయన వీఆర్ఎస్ తీసుకొని మైక్రోఫైనాన్స్ వ్యాపారం ప్రారంభించి నష్టపోయారు. ఆర్థిక ఒడిదుడుకులు ఎదురైనా వెనుకంజ వేయక కుమారుడిని క్రికెటర్‌గా తీర్చిదిద్దేందుకు శ్రమించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏడాదికి ఒక ఇంగ్లిష్ విల్లో బ్యాట్‌తోనే నితీశ్ సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇక..నితీశ్‌లోని క్రికెట్ ప్రతిభను గమనించిన జాతీయ సెలెక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అతడిని ఎంతో ప్రోత్సహించారు. కడపలోని ఆంధ్ర క్రికెట్ అకాడమీలో మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాటుదేలిన నితీశ్ కొద్దికాలంలోనే దేశవాళీ పోటీల్లో భారీ స్కోర్లతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. 2017-18 సీజన్‌లో అండర్-16 'బెస్ట్ ప్లేయర్' అవార్డు సొంతం చేసుకున్నాడు. 2023లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసిన నితీశ్..గత సీజన్‌లో తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఔరా అనిపించాడు. అలా టీమిండియాలో చోటు దక్కించుకొని ఆస్ట్రేలియాలో అదరగొడుతున్నాడు.



భారత్ తొలి ఇన్నింగ్స్ 358/9 • సుందర్ అర్ధసెంచరీ

మెల్‌బోర్న్: ఎవరూ ఊహించని విధంగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ఎంపికైన తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ వహ్వా.. అనిపిస్తున్నాడు. ఆసీస్‌తో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో అజేయ శతకం (105 బ్యాటింగ్) ద్వారా గట్టి పంచే ఇచ్చాడు. తద్వారా జట్టును ఫాలోఆన్ నుంచి కూడా గట్టెక్కించాడు. వాషింగ్టన్ సుందర్ (50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 127 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో మూడో రోజు శనివారం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358/9 స్కోరుతో నిలిచింది. అయితే వెలుతురులేమితో పాటు వర్షం కారణంగా ఆఖరి సెషన్‌ను గంట ముందుగానే ముగించారు. బోలాండ్, కమిన్స్‌లకు మూడేసి, లియోన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్రస్తుతం భారత జట్టు 116 పరుగుల వెనుకంజలో ఉంది. ఇక చేతిలో వికెట్లేమీ లేకపోవడంతో నితీశ్ వీలైనంత వేగంగా పరుగులు రాబట్టాల్సి ఉంది. ఆదివారం అర్ధగంట ముందుగానే మ్యాచ్ ఆరంభం కానుంది.



వాషింగ్టన్ సుందర్ (50)

పంత్ పేలవంగా..: 164/5 ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా, ఆదుకుంటారనుకున్న పంత్ (28), జడేజా (17) తీవ్రంగా నిరుత్సాహపరిచారు. ఆరంభంలో ఇద్దరూ ఆచితూచి ఆడి వికెట్‌ను కాపాడుకునే ప్రయత్నం చేశారు. కానీ ఓపిగ్గా క్రీజులో నిలవాల్సిన పంత్ నిర్లక్ష్యపు షాట్‌కు వెనుదిరిగాడు. బోలాండ్ ఓవర్‌లో అనవసరంగా ర్యాంప్ షాట్‌కు వెళ్లి క్యాచ్ ఇచ్చాడు. దీంతో అతడి షాట్ ఎంపిక తీవ్ర విమర్శలపాలైంది. అటు జడేజా కూడా కాసేపటికే వెనుదిరిగాడు. నితీశ్ మాత్రం ఆత్మవిశ్వాసంతో కనిపించి సుందర్‌తో ఆదుకునే ప్రయత్నం చేశాడు. తొలి సెషన్‌లో జట్టు 27 ఓవర్లలో 80 పరుగులు చేయగా ఇందులో నితీశ్‌వే 40 రన్స్ ఉండడం విశేషం.

ఆదుకున్న నితీశ్-సుందర్: 221 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన వేళ.. ఆసీస్ బౌలర్ల జోరు చూస్తే భారత్‌కు ఫాలోఆన్ తప్పదనిపించింది. అప్పటికి మరో 53 పరుగులు చేయాల్సి ఉంది. అయితే నితీశ్ మాత్రం ఎలాంటి బెరుకు లేకుండా అన్ని రకాల షాట్లతో ఎంసీజీలో బంతిని పరిగెత్తించాడు. అటు సుందర్ కూడా నిలకడ చూపడంతో జట్టుకు ఫాలోఆన్ తప్పింది. రెండో సెషన్‌లో వీరు వికెట్ కోల్పోకుండా ఆడారు. ఇప్పటిదాకా టెస్టుల్లో 40+ స్కోరును దాటలేకపోయిన నితీశ్ ముందుగా అర్ధసెంచరీ పూర్తి చేసి పుష్ప తరహాలో సంబరాలు చేసుకున్నాడు. దీంతో చూస్తుండగానే సుందర్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు వంద పరుగులు జోడించాడు. 97వ ఓవర్‌లో వర్షం కురవడంతో టీబ్రేక్‌కు కాస్త ముందుగానే వెళ్లారు.

తీవ్ర ఉత్కంఠ: అర్ధగంట ఆలస్యంగా ఆరంభమైన ఆఖరి సెషన్‌లో ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేశారు.. చివరకు 108వ ఓవర్‌లో నితీశ్ ఓ ఫోర్ సాధించగా.. సుందర్ తన అర్ధసెంచరీని పూర్తి చేశాడు. ఆసీస్‌ను విసిగిస్తున్న ఈ జోడీని లియోన్ దెబ్బతీశాడు. ఆ వెంటనే 114వ ఓవర్‌లో మూడో బంతికి బుమ్రాను కమిన్స్ డకౌట్ చేశాడు. అప్పటికి నితీశ్ 99 పరుగులతో ఉన్నాడు. అభిమానులతో పాటు స్టేడియంలో కూర్చున్న నితీశ్ తండ్రి ఉద్వేగంతో కనిపించాడు. మిగిలిన ఆ మూడు బంతులను సిరాజ్ ఎలా ఎదుర్కొంటాడా? అని అంతా ఊపిరిబిగపట్టి ఎదురుచూశారు. సిరాజ్ కెరీర్‌లో అత్యంత సవాల్‌తో కూడిన క్షణాలను విజయవంతంగానే అధిగమించాడు. ఇక తర్వాతి ఓవర్‌లో ఫుల్లర్ లెంగ్త్‌తో వేసిన మూడో బంతిని నితీశ్ అమాంతం మిడాన్ వైపు లాఫ్టెడ్ షాట్‌తో బౌండరీకి తరలించాడు. సెంచరీ పూర్తయ్యాక నితీశ్ మోకాలు నేలకు ఆనించి బ్యాట్‌పై హెల్మెట్‌ను ఉంచి ఎడమచేతిని ఆకాశం వైపు చూపిస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ దృశ్యాన్ని ఎంసీజీతో పాటు టీవీల్లో తిలకించిన లక్షలాది అభిమానులు కూడా పులకించిపోయారు. మరో ఓవర్ తర్వాత వర్షంతో మ్యాచ్ నిలిచిపోయింది.

ఆసీస్ గడ్డపై ఎనిమిదో స్థానంలో బరిలోకి దిగి అత్యధిక వ్యక్తిగత స్కోరు (105 బ్యాటింగ్) సాధించిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. గతంలో కుంబ్లే (87) పేరిట ఈ ఫీట్ ఉండేది.

1 147 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలో 8,9 స్థానాల్లో వచ్చిన బ్యాటర్లు (నితీశ్, సుందర్) 150+ బంతులు ఎదుర్కోవడం ఇదే తొలిసారి.

2 ఆసీస్‌లో 8 అంత కంటే దిగువ స్థానాల్లో అత్యధిక భాగస్వామ్యం (127) అందించిన రెండో భారత జోడీగా నితీశ్-సుందర్. టాప్‌లో సచిన్-హర్భజన్ (129) ఉన్నారు.

3 ఆసీస్‌లో భారత్ నుంచి సెంచరీ సాధించిన మూడో అతిపిన్న వయస్కుడి (21 ఏళ్ల 216 రోజులు)గా నితీశ్. సచిన్ (18), పంత్ (21 ఏళ్ల 92) ముందున్నారు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) 82; రోహిత్ (సి) బోలాండ్ (బి) కమిన్స్ 3; రాహుల్ (బి) కమిన్స్ 24; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 36; ఆకాశ్ (సి) లియోన్ (బి) బోలాండ్ 0; పంత్ (సి) లియోన్ (బి) బోలాండ్ 28; జడేజా (ఎల్బీ) లియోన్ 17; నితీశ్ (బ్యాటింగ్) 105; సుందర్ (సి) స్మిత్ (బి) లియోన్ 50; బుమ్రా (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; సిరాజ్ (బ్యాటింగ్) 2; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 116 ఓవర్లలో 358/9. వికెట్ల పతనం:** 1-8, 2-51, 3-153, 4-154, 5-159, 6-191, 7-221, 8-348, 9-350.**బౌలింగ్:** స్టార్క్ 25-2-86-0; కమిన్స్ 27-6-86-3; బోలాండ్ 27-7-57-3; లియోన్ 27-4-88-2; మార్ష్ 7-1-28-0; హెడ్ 3-0-11-0.

అరుదైన గౌరవం

క్లిష్ట పరిస్థితుల్లో శతక్కొట్టి జట్టును ఆదుకున్న నితీశ్ సహచరుల నుంచి గౌరవాన్ని అందుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ సహా జట్టు ఆటగాళ్లంతా నితీశ్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి వస్తున్న సమయంలో గౌరవ సూచకంగా బౌండరీ లైన్ వద్దకు వెళ్లి చప్పట్లతో అభినందించారు. కామెంట్రీ బాక్స్‌లో ఉన్న సునీల్ గవాస్కర్‌లాంటి దిగ్గజాలు కూడా నితీశ్ ఆటను కొనియాడుతూ లేచి నిలుచోవడం విశేషం. మాజీ కోచ్ రవిశాస్త్రికి కన్నీరు ఆగలేదు.



డ్రెస్ కోడ్ పాటించని.. కార్ల్‌సన్‌పై అనర్హత వేటు

న్యూయార్క్: ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు చేదు అనుభవం ఎదురైంది. డ్రెస్ కోడ్‌ను పాటించనందుకు అతడిపై ఏకంగా అనర్హత వేటు పడింది. డిఫెండింగ్ చాంప్ అయిన కార్ల్‌సన్.. వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీకి జీన్స్ ధరించి వచ్చాడు. అయితే, డ్రెస్ మార్చుకుని రావాలని చీఫ్ ఆర్బిటర్ చెప్పినా ససేమిరా అన్నాడు. దీంతో నిర్వాహకులు అతడిపై అనర్హత వేటు వేశారు.

టాప్‌లో అర్జున్..: ఇదే టోర్నీలో బరిలో నిలిచిన అర్జున్ ఇరిగేసి 7 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆడిన 9 రౌండ్లలో ఆరు గెలిచిన అర్జున్.. రెండు గేమ్‌లను డ్రా చేసుకొన్నాడు. ఒక్క గేమ్‌లో మాత్రమే ఓడాడు. ఇక, మహిళల విభాగంలో హంపి, హారిక కూడా చెరో 6.5 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో నిలిచారు. ఆడిన 8 రౌండ్లలో ఆరు గెలిచిన హంపి.. ఒకటి డ్రా చేసుకొంది. మరోవైపు హారిక ఓటమి లేకుండా సాగుతోంది. మరో మూడు రౌండ్లు మాత్రమే మిగిలిన నేపథ్యంలో భారత్‌కు పతకం లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

నితీశ్‌కు ఏసీఏ నజరానా రూ.25 లక్షలు

హైదరాబాద్: నితీశ్ కుమార్‌కు ఆంధ్ర క్రికెట్ సంఘం రూ. 25 లక్షల నజరానా ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు అతడికి అభినందనలు తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటన నుంచి నితీశ్ వచ్చాక సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ నగదు బహుమతిని అందించనున్నామని ఏసీఏ తెలిపింది.



ప్రొ. కబడ్డీ లీగ్ ఫైనల్ నేడు

పట్నా X హరియాణా

రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

దక్షిణాఫ్రికా లక్ష్యం 148

ప్రస్తుతం 27/3 ● పాక్‌తో తొలి టెస్టు

సెంచూరియన్: దక్షిణాఫ్రికా-పాకిస్థాన్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా మారింది. పాక్ నిర్దేశించిన 148 పరుగుల ఛేదనలో.. శనివారం ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 27/3 స్కోరు చేసింది. అంతకుముందు ఆటకు మూడో రోజు ఓవర్ స్కోరు 88/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాకిస్థాన్ 237 పరుగులకు ఆలౌటైంది. జెన్సన్ (6/52) ఆరు వికెట్లతో ప్రత్యర్థి పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 211, దక్షిణాఫ్రికా 301 పరుగులు చేశాయి.

బిజినెస్



రతన్ టాటా 87వ జయంతిని పురస్కరించుకుని టాటా సన్స్ ప్రధాన కార్యాలయం బాంబే హౌస్‌లో రతన్ టాటా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఆవిష్కరించారు.

రిలయన్స్ చేతికి కర్కినోస్ హెల్త్‌కేర్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్).. టెక్నాలజీ ఆధారిత హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ కర్కినోస్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.375 కోట్లకు కొనుగోలు చేసింది. అనుబంధ సంస్థ రిలయన్స్ స్ట్రాటజిక్ బిజినెస్ వెంచర్స్ (ఆర్ఎస్‌బీవీఎల్) ద్వారా ఈ కొనుగోలు చేపట్టినట్లు ఆర్ఐఎల్ తెలిపింది. 2020 జూలై 24న ఏర్పాటైన కర్కినోస్.. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించటం, డయాగ్నోసిస్, చికిత్స వంటి సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 60కి పైగా హాస్పిటల్స్‌తో ఒప్పందాలను కలిగి ఉంది.

రూ.11,650 కోట్ల రుణాలు క్లియర్

వొడాఫోన్ గ్రూప్

వొడాఫోన్ గ్రూప్ భారత్‌లోని తన అనుబంధ సంస్థ వొడాఫోన్ ఐడియాకు చెందిన రూ.11,650 కోట్ల రుణాలను క్లియర్ చేసింది. వొడాఫోన్ ఐడియా ఈక్విటీలో భారత్, మారిషస్‌ల్లోని తన అనుబంధ సంస్థలకు ఉన్న 22.56 శాతం వాటా షేర్లను హెచ్ఎస్‌బీసీ కార్పొరేట్ ట్రస్టీ కంపెనీ (యూకే) వద్ద తాకట్టు పెట్టి ఈ నిధులు సమీకరించినట్టు వొడాఫోన్ గ్రూప్ తెలిపింది. శుక్రవారం ఈ లావాదేవీ పూర్తయినట్టు వెల్లడించింది.

టెల్కోలకు అచ్చిరాని 2024

బెడిసికొట్టిన టారిఫ్స్ పెంపు వ్యూహం

గుడ్‌బై చెప్పిన 2.6 కోట్ల చందాదారులు

పొంచి ఉన్న 'శాట్‌కామ్' పోటీ

భారంగా మారిన పెట్టుబడులు

ఈ సంవత్సరం (2024) దేశంలోని మూడు ప్రైవేట్ టెలికాం కంపెనీలకు పెద్దగా కలిసి రాలేదు. 5జీ సేవల విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్పెక్ట్రమ్ కొనుగోలు కోసం కంపెనీలు దాదాపు రూ.70,200 కోట్లు ఖర్చు చేశాయి. లాభాలు కాపాడుకోవడంతో పాటు ఇందులో కొంతైనా రాబట్టుకునేందుకు ఈ ఏడాది జూలై నుంచి టారిఫ్‌లను 10 నుంచి 26 శాతం వరకు పెంచాయి. ఈ బాదుడు భరించలేక దాదాపు 2.6 కోట్ల మంది చందాదారులు రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు గుడ్‌బై చెప్పారు. వీరిలో 68 లక్షల మంది టారిఫ్‌లు ఏ మాత్రం పెంచని ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు మారిపోయారు. బీఎస్ఎన్ఎల్ ఇంకా 3జీ సేవలు అందించడంతో పాటు త్వరలో 4జీ సేవలకు సిద్ధం కావడం ఇందుకు ప్రధాన కారణం.

పెట్టుబడులు తప్పవు: చందాదారులు గుడ్‌బై చెబుతున్నా ప్రైవేట్ టెలికాం కంపెనీలకు కొత్త పెట్టుబడులు తప్పేలా లేవు. లేకపోతే మార్కెట్లో కొనసాగడం కష్టంగా మారనుంది. 5జీ సేవల విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసమే ఈ సంస్థలు 2022-27 మధ్య కాలంలో రూ.92,100 కోట్ల నుంచి రూ.1.41 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (డీఐపీఏ) డైరెక్టర్ జనరల్ మనోజ్ కుమార్ సింగ్ అంచనా.

శాట్‌కామ్ సంస్థల నుంచి పోటీ: ఇప్పటి వరకు దేశంలోని టెలికాం, బ్రాడ్‌బ్యాండ్ సేవలపై రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలదే గుత్తాధిపత్యం. వచ్చే ఏడాది నుంచి ఈ సంస్థలకు ఎలాన్ మస్క్ నాయకత్వంలోని స్టార్‌లింక్ వంటి ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ (శాట్‌కామ్) సంస్థల నుంచి ముఖ్యంగా డేటా బిజినెస్‌లో తీవ్ర పోటీ ఎదురు కానుంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ సంస్థలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను వేలం లేకుండా ట్రాయ్ సిఫారసు చేసిన ధరకు కేటాయిస్తామని ప్రకటించింది. ఇది అన్యాయమని టెల్కోలు గగ్గోలు పెట్టినా ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదు. ఈ శాట్‌కామ్‌ల సేవలు ప్రారంభమైతే డేటా బిజినెస్‌తో పాటు మారుమూల ప్రాంతాల్లోని జనాభాకు సైతం నిరంతరం టెలికాం సేవలు అందుబాటులోకి వస్తాయి. దీంతో మరో విడత టెలికాం రంగంలో టారిఫ్‌ల యుద్ధం ప్రారంభమై వొడాఫోన్ ఐడియా వంటి సంస్థల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో మరో వీఆర్ఎస్!

ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్‌లో మరో విడత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఉన్న 55,000 మంది ఉద్యోగుల్లో 35 శాతం (సుమారు 18,000-19,000) మందిని ఈ వీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపించాలని భావిస్తున్నారు. ఇందుకోసం రూ.15,000 కోట్లు కేటాయించాలని కోరుతూ టెలికాం శాఖ (డాట్) ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్టు సమాచారం. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ ఆదాయంలో 38 శాతం ఉద్యోగుల జీతభత్యాలకే పోతోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వీఆర్ఎస్‌కు ఆమోదం తెలిపితే ఏటా జీతాల కోసం చేసే రూ.7,500 కోట్ల ఖర్చు.. రూ.5,000 కోట్లకు తగ్గుతుందని భావిస్తున్నారు. 2019లో అమలు చేసిన వీఆర్ఎస్ ద్వారా బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు చెందిన 93,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. అందుకోసం అప్పట్లో దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చు చేశారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	111
వరంగల్	105	గుంటూరు	114
కరీంనగర్	105	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	100
విశాఖపట్నం	110	అనంతపురం	100
గోదావరి	111		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ

హైదరాబాద్	550	విజయవాడ	565
వరంగల్	552	గోదావరి	565
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,840 ▼	71,350 ▼	99,900 ▼
విజయవాడ	78,800 ▼	72,700 ▼	89,500 ▼
విశాఖపట్నం	76,710 ▼	70,320 ▼	88,890 ▼
రాజమండ్రి	77,840 ▼	71,350 ▼	90,900 ▼
ప్రొద్దుటూరు	78,650 ▼	72,830 ▼	89,800 ▼
ముంబై	76,436	70,015	87,831









బాలీవుడ్ బాద్‌షాలు



ఈ ఏడాది బాలీవుడ్‌లో అనేక చిత్రాలు విడుదలయ్యాయి. వాటిలో కొన్ని బాక్సాఫీసు వద్ద బ్లాక్‌బస్టర్ అయ్యాయి. కొన్ని రూ.100 కోట్ల క్లబ్‌లో చేరితే.. మరికొన్ని బొక్కబోర్లా పడ్డాయి. ఈ నేపథ్యంలో 2024లో బాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు రాబట్టిన పది చిత్రాలు ఏవో చూద్దాం!

స్త్రీ-2:

రాజ్‌కుమార్, శ్రద్ధాకపూర్ నటించిన ఈ హారర్ కామెడీ చిత్రం బాక్సాఫీసు వద్ద భారీ కలెక్షన్లతో బ్లాక్ బస్టర్ అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.837 కోట్లు వసూలు చేసి బాలీవుడ్‌లో ఈ ఏడాది తొలి స్థానంలో నిలిచింది.

భూల్ భులయ్యా-3:

ఇది కూడా హారర్ కామెడీ చిత్రమే. గ్లోబల్‌గా రూ.371 కోట్ల వసూళ్లతో రెండో స్థానంలో నిలిచింది. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, మాధురి దీక్షిత్, త్రిప్తీ డిమ్రీ తదితరులు నటించారు.

సింగం ఎగైన్:

రోహిత్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనే, అర్జున్ కపూర్, టైగర్ ష్రాఫ్, కరీనాకపూర్, అక్షయ్ కుమార్ వంటి భారీ తారాగణం నటించారు. అయినప్పటికీ ఇదే సమయంలో విడుదలైన భూల్ భులయ్యా-3ని ఏమ్రాతం అధిగమించలేదు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.367 కోట్లు వసూలు చేసి తృతీయ స్థానంలో నిలిచింది.

ఫైటర్:

హృతిక్ రోషన్, దీపికా పదుకొనే ప్రధాన పాత్రల్లో నటించారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం యావరేజ్ టాక్‌తో గ్లోబల్ వైడ్‌గా రూ.340 కోట్లు వసూలు చేసింది. విదేశాల్లో రూ.140 కోట్లు రాగా, ఇండియా వ్యాప్తంగా రూ. 200 కోట్లను రాబట్టగలిగింది.









షైతాన్:

ఇది ఒక సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ చిత్రం. వికాస్ దర్శకత్వంలో అజయ్ దేవగణ్, మాధవన్, జ్యోతిక తదితరులు నటించారు. గుజరాతి చిత్రం 'వశ్' ఆధారంగా నిర్మించిన ఈ సినిమా రూ.210 కోట్ల కలెక్షన్లు సాధించింది.

క్రూ:

రాజేశ్ కృష్ణన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రమిది. ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేస్తున్న ముగ్గురు మహిళల జీవితం ఆధారంగా నిర్మించిన ఈ చిత్రంలో టబు, కరీనా కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. రూ.150 కోట్లతో పరవాలేదనిపించింది.

తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా:

ఈ సైంటిఫిక్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ చిత్రంలో షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. మానవుడు, రోబోకు మధ్య నడిచే ప్రేమ కథ ఇది. అమిత్ జోషి, ఆరాధనా షా దర్శకత్వం వహించారు. రూ.136 కోట్ల వసూళ్లతో సరిపెట్టుకుంది.

ముంజ్యా:

ఆదిత్య సర్పోత్థర్ దర్శకత్వంలో వచ్చిన సూపర్ నేచురల్ యూనివర్సల్ చిత్రం. శర్వరీ, అభయ్ వర్మ, సత్యరాజ్, మోనా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించారు. విమర్శకుల నుంచి సానుకూల సమీక్షలు పొందినప్పటికీ ఎక్కువగా వసూళ్లు రాబట్టలేకపోయింది. గ్లోబల్ వైడ్‌గా రూ. 128 కోట్లు సాధించగలిగింది.

బ్యాడ్ న్యూజ్:

గుడ్ న్యూజ్‌కి ఆధ్యాత్మిక సీక్వెల్‌గా వాస్తవాధారిత ఘటనల ఆధారంగా నిర్మించిన హాస్య భరిత చిత్రం. విక్కీ కౌశల్, త్రిప్తీ డిమ్రీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆనంద్ తివారీ దర్శకుడు. బాక్సాఫీసు వద్ద రూ.109 కోట్లను వసూలు చేసింది.

బడే మియా చోటే మియా:


ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ సినిమాలో టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో నటించారు. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహించారు. ప్రపంచవ్యాప్తంగా రూ.105 కోట్ల వసూళ్లతో వంద కోట్ల క్లబ్‌లో పదో స్థానంలో నిలిచింది.

రామ్‌చరణ్ భారీ కటౌట్



రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా విజయవాడలో 250 అడుగుల రామ్‌చరణ్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. బృందావన్ కాలనీలోని వజ్రా గ్రౌండ్స్‌లో ఈ భారీ కటౌట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఈ కటౌట్‌ను చిత్ర బృందం ఆవిష్కరించనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు, సంగీత దర్శకుడు తమన్ తదితరులు పాల్గొంటున్నారు. కాగా, వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం విడుదల కానుంది. శ్రీకాంత్, ఎస్‌జే.సూర్య కీలక పాత్రలు పోషించారు.

లబ్బీపేట, (ఆంధ్రజ్యోతి)




ప్రముఖ దర్శకుడు ఎస్‌ఎస్ రాజమౌళి శనివారం బొర్రా గుహలను సందర్శించారు. మహేష్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కించనున్న 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ 29' సినిమా కోసం లొకేషన్లు చూసే క్రమంలోనే ఆయన బొర్రా గుహలను పరిశీలించినట్టు సమాచారం.

అనంతగిరి, (ఆంధ్రజ్యోతి)

త్వరలో దృశ్యం-3

మోహన్ లాల్



"దృశ్యం-3 స్ర్కిప్టు సిద్ధమైంది. త్వరలో షూటింగ్ మొదలవనుంది. మా సినిమాను ఆధారంగా చేసుకుని వివిధ భాషల్లో రీమేక్స్ వచ్చాయి' అని అన్నారు మలయాళ అగ్ర నటుడు మోహన్ లాల్. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన తాజా చిత్రం 'బరోజ్ 3డి'. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా మోహన్‌లాల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'దృశ్యం' చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. "దృశ్యం' తెరకెక్కించడానికి జీతూ జోసెఫ్ ఎంతో శ్రమించారు. కథ సిద్ధమైన తరువాత దాదాపు ఐదేళ్లపాటు ఆయన ఎంతో మంది నటీనటులను కలిశారు. ఎవరు కూడా ఈ కథని అంగీకరించలేదు. ఈ క్రమంలో ఆశీర్వాద్ సినిమాస్‌కు చెందిన ఆంటోనీ ఫోన్ చేశారు. జీతూ జోసెఫ్ దగ్గర కథ ఉంది...వీలుంటే ఒకసారి వినమని చెప్పారు. కథ విన్న నేను వెంటనే ఓకే చేశా. అలా 'దృశ్యం' జర్నీ మొదలైంది. త్వరలోనే 'దృశ్యం-3' కూడా పట్టాలెక్కనుంది' అని చెప్పారు. కాగా, 'దృశ్యం' చిత్రాన్ని తెలుగులో వెంకటేశ్, తమిళంలో కమల్‌హాసన్, హిందీలో అక్షయ్ కుమార్ సేమ్ టైటిల్‌తో రిమేక్ చేశారు.

కీర్తికి నిరాశే



'బేబి జాన్' మూవీతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన నటి కీర్తి సురేశ్‌కు నిరాశ ఎదురైంది. వరుణ్ ధావన్ హీరోగా నటించిన 'బేబి జాన్' ఇటీవలే విడుదలై.. ఈ ఏడాది బాలీవుడ్‌లో పెద్ద డిజాస్టర్‌గా నిలిచింది. రూ.180 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం మూడు రోజుల్లో కేవలం రూ.19 కోట్ల కలెక్షన్స్ మాత్రమే రాబట్టింది. మొదటి రోజుతో పోలిస్తే మూడో రోజు కలెక్షన్స్ 70 శాతం వరకు పడిపోయాయి. ఈ మూవీ బ్రేక్ ఈవెన్ కావడం కష్టమేనని బాలీవుడ్ వర్గాల్లో ప్రచారమవుతోంది.

అందరినీ అలరించే చిత్రం



నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'ఓ చెలియా'. నాగ రాజశేఖర్ దర్శకత్వంలో రూపశ్రీ, చంద్రమౌళి నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు రూపశ్రీ, చంద్రమౌళి మాట్లాడుతూ "ఈ సినిమాను దర్శకుడు అనుకున్న దానికంటే చాలా బాగా తెరకెక్కించారు. కచ్చితంగా అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పనిచేసింది. సినిమా ఘన విజయం సాధిస్తుంది" అని చెప్పారు.



హీరో వినోద్ నువ్వుల ఆధ్వర్యంలో వినోద్ ఫిల్మ్ అకాడమీ నాలుగవ వార్షికోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. అలాగే, ఆయన హీరోగా నటించిన 'ల్యాంప్' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.

కొత్త అనుభూతినిచ్చేలా...



నిరుడు విడుదలైన 'మ్యాడ్' సినిమా సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా వస్తోన్న చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 విడుదలకు సిద్ధమవుతోంది. 'లడ్డు గాని పెళ్లి' అంటూ ఈ చిత్రం నుంచి విడుదలైన మొదటి గీతానికి మంచి స్పందన లభించింది. తాజాగా 'స్వాతి రెడ్డి' అంటూ సాగే రెండో పాటను విడుదల చేశారు మేకర్స్ రెబా మోనికా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సురేశ్ గంగుల సాహిత్యానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించడమే కాకుండా స్వాతిరెడ్డితో కలసి ఆలపించారు. ఈ పాట ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతినిచ్చేలా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.

సంతోషంగా ఉంది

కిరణ్ తిరుమలశెట్టి




ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా కిరణ్ తిరుమలశెట్టి తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమాకు దక్కుతున్న ఆదరణ పట్ల సంతోషంగా ఉంది' అని అన్నారు.

కాంప్రమైజ్ పిటిషన్లలో కక్షిదారుల ఫొటోలు అతికించండి

▸ న్యాయవాది సంతకాలను నిశితంగా పరిశీలించండి

▸ లోక్ అదాలత్ చైర్మన్లకు హైకోర్టు స్పష్టీకరణ



అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ల ద్వారా రాజీమార్గంలో వివాదాల పరిష్కారం విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. లోక్ అదాలత్‌లను ఆశ్రయిస్తున్న కక్షిదారుల్లో కొందరు మోసపూరితంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఇకపై రాజీకి వచ్చే ఇరువైపుల కక్షిదారుల ఫొటోలను కాంప్రమైజ్ పిటిషన్‌లో అతికించాలని లోక్ అదాలత్ చైర్మన్‌లకు స్పష్టం చేసింది. అలాగే కేసుల రాజీకోసం లోక్ అదాలత్ ముందు హాజరైన న్యాయవాది, ట్రయల్ కోర్టులో వకాలత్ వేసినవారు ఒకరేనా? కాదా? అనే విషయాన్ని కూడా నిశితంగా పరిశీలించాలని పేర్కొంది. లోక్ అదాలత్ ద్వారా వివాద పరిష్కారానికి వకాలత్‌లో ఉన్న న్యాయవాది ముందుకు రానప్పుడు, అందుబాటులో లేనప్పుడు రాజీపత్రంపై సంతకాలు చేసే కక్షిదారులు సరైనవారేనా? కాదా అని నిర్ధారించుకొనేందుకు తగిన చర్యలు తీసుకోవచ్చని లోక్ అదాలత్‌లకు స్పష్టం చేసింది. నేషనల్ లోక్ అదాలత్ 2009 నిబంధనల ప్రకారం కాంప్రమైజ్ పిటిషన్‌పై కక్షిదారులు, వారి తరపున హాజరైన న్యాయవాదుల సంతకాలు తప్పనిసరని గుర్తు చేసింది. అలా సంతకాలు చేయకుండా జారీ చేసే అవార్డులు చెల్లుబాటుకావని పేర్కొంది. ప్రస్తుత కేసులో లోక్ అదాలత్ ముందు రాజీపత్రంపై పిటిషనర్ తండ్రి తరపున న్యాయవాది చేసిన సంతకం, ట్రయల్ కోర్టులో వకాలత్ వేసిన న్యాయవాది సంతకం ఒకటిగా లేదని పేర్కొంది. పిటిషనర్ తండ్రి, ఆయన తరపు న్యాయవాది సంతకం లేకుండా లోక్‌అదాలత్ అవార్డు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో ఈ ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ నూనెపల్లి హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. గుంటూరు జిల్లా, తెనాలి మండలానికి చెందిన పుల్లారావు ఆస్తుల పంపకంలో ముగ్గురు కుమారుల్లోని పెద్దకుమారుడు మురళీ కృష్ణ తెనాలి కోర్టులో 2023లో దావా వేశారు. వివాదాన్ని రాజీమార్గంలో పరిష్కరించుకుంటామని, కేసును లోక్ అదాలత్‌కు పంపించాలని అభ్యర్థించారు. దీంతో ఈ వ్యవహారం తెనాలి మండలం లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వద్దకు చేరింది. ఆస్తి మొత్తం తన పెద్దకుమారుడికే చెందుతుందని తండ్రి పుల్లారావు అంగీకరించినట్లు పేర్కొంటూ లోక్ అదాలత్ అవార్డు జారీ చేసింది. ఈ అవార్డును సవాల్ చేస్తూ పుల్లారావు రెండో కుమారుడు శరత్ ఈ ఏడాది మార్చిలో హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. లోక్ అదాలత్ వద్ద కాంప్రమైజ్ పిటిషన్‌లో తన తండ్రి, ఆయన తరపు న్యాయవాది సంతకం చేయలేదన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం లోక్ అదాలత్ అవార్డును రద్దు చేసింది.

ప్రభుత్వంతో ఒప్పందం వల్లే ఆడిట్ చేశాం

▸ అది వ్యవస్థీకృత నేరం కాదు.. కేసు కొట్టివేయండి

▸ హైకోర్టులో పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం పిటిషన్

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీప్ సీ పోర్ట్, కాకినాడ సెజ్‌లోని కాకినాడ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీరావు)చెందిన వాటాలను బలవంతంగా అరబిందోకు బదలాయింపు వ్యవహారంలో మంగళగిరి సీఐడీ పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఎల్ఎల్‌పీ ఆడిట్ కంపెనీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో దర్యాప్తుతో సహా తదుపరి చర్యలు అన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. కాకినాడ పోర్ట్ లావాదేవీల విషయంలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తమ సంస్థతో ఒప్పందం చేసుకొందని పేర్కొంది. ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి రూ.965 కోట్లు మేర ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగినట్లు 2020 మార్చి 3న నివేదిక అందజేశామని తెలిపింది. దానిని నేరంగా పరిగణించడానికి వీల్లేదని తెలిపింది. కేవీరావు చేసిన ఫిర్యాదులో తమపై చేసిన ఆరోపణలు ఎలాంటి ఆధారాలు లేవంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని పిటిషన్‌లో కోరింది.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కాకినాడలో ఉత్సాహంగా క్రియ పిల్లల పండుగ

▸ ఉభయ రాష్ట్రాల నుంచి 8,500 మంది విద్యార్థుల హాజరు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌టీయూ ఆవరణలో రాష్ట్రస్థాయి క్రియ పిల్లల పండుగ శనివారం ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలను కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు ప్రారంభించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వముఖాభివృద్ధికి విద్య, క్రీడలు, సాంస్కృతిక పోటీలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణకు చెందిన 350 పాఠశాలల నుంచి 8,500 మంది విద్యార్థులు సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో పాల్గొన్నారు. సంస్థ ప్రెసిడెంట్ పాలిక శ్రీనివాస్, జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో జరిగిన క్రియ పిల్లల పండుగలో మాట్లాడుతున్న జయప్రకాశ్

గనుల ఫైళ్లు గల్లంతు

లేటరైట్, గ్రానైట్, సిలికా, క్వార్ట్జ్‌కు సంబంధించిన 25 ఫైళ్లు మాయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖలో దొంగలు పడ్డారు. నాడు జగన్ ప్రభుత్వంలో మైనింగ్ కంపెనీల నుంచి బలవంతంగా వాటాలు తీసుకొని సెటిల్ చేసిన కీలక ఫైళ్లు ఇప్పుడు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం రాకముందే వాటిని మాయం చేసేశారు. తాజాగా ఏసీబీ విచారణ సందర్భంగా ఆ ఫైళ్లు కనిపించడం లేదన్న విషయం వెలుగుచూసింది. దీనివెనుక గనుల శాఖలో తిష్ఠవేసిన 'తిమింగలం' పాత్ర ఉన్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. ఆ ఫైళ్లు ఉంటే ఆ అధికారి తెరవెనక చేసిన గనుల పంచాయితీలు, బలవంతపు సెటిల్మెంట్లు, బెదిరింపుల వ్యవహారం బయట పడుతుందని మాయం చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి, నెల్లూరు జిల్లాల పరిధిలో విలువైన లేటరైట్ గ్రానైట్, సిలికా, క్వార్ట్జ్ మైనింగ్ చేసే కంపెనీలు జగన్ ప్రభుత్వంలోని ఓ మంత్రికి వ్యాపారంలో వాటాలు ఇచ్చాయి. ఇందుకు ప్రతిఫలంగా ఆ కంపెనీల మైనింగ్ లీజుల కాలపరిమితిని పొడిగించారు. మరికొన్నింటి లీజులను రెన్యువల్ చేశారు. వాటికి సంబంధించిన 25 ఫైళ్లను గనుల తిమింగలం మాయం చేసినట్లుగా తెలిసింది. ఇప్పటికే ఈ విషయంపై ప్రభుత్వానికి స్పష్టమైన నివేదిక వెళ్లింది.

గనుల్లో మంత్రికి వాటాలు

జగన్ ప్రభుత్వంలో మైనింగ్ వ్యవహారాల్లో అనేక చీకటి కోణాలు చోటు చేసుకున్నాయి. విలువైన గనులను బలవంతంగా చేజిక్కించుకోవడం లేదా తాము చెప్పిన వారి పేరిట వ్యాపార వాటాలు రాయించుకోవడం వంటివి చేశారు. నాటి జగన్ ప్రభుత్వంలోని సదరు మంత్రి.. లీజుదారులు, వ్యాపారులను నయానో, భయానో దారికి తెచ్చుకున్నారు. కీలకమైన గనుల్లో వాటాలు దక్కించుకున్నారు. ఇందుకు ఆయన పేషీలోని ఓఎస్డీ, శశి అనే ప్రైవేటు వ్యక్తి కీలకపాత్ర పోషించారు. ఆ మంత్రి కోసం గనుల శాఖ కీలక అధికారి మంత్రాంగం నడిపారు. లీజుదారుల ఫైళ్లను వెంటనే ఆమోదించకపోవడం... ఫైళ్లలో తప్పులు చూపిస్తూ క్వొరీలు వేసి పెండింగ్‌లో పెట్టడం... ఆఫీసుకు పిలిపించుకొని సెటిల్‌చేయడం వంటివి చేశారు. నాడు సదరు మంత్రి కేంద్రంగా జరిగిన అక్రమాల్లో తెరవెనక పాత్ర ఈ తిమింగలానిదే. గనుల వెంకటరెడ్డి పలు కారణాలతో 2023, 2024లో పక్షం రోజులు, అంతకంటే ఎక్కువ రోజులు సెలవుపై వెళ్లారు. ఆ సమయంలో ఆ మంత్రి స్పీడ్ పెంచి గనులలో వాటాల దందా నడిపించారు. ఇందుకు ఈ అధికారి పూర్తిస్థాయిలో సహకరించారు.

లీజుదారులకు బెదిరింపులు

ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పరిధిలో 8 గ్రానైట్, లేటరైట్ లీజుదారులను పిలిపించి సదరు అధికారి పంచాయితీ నిర్వహించారు. అవి లాభదాయకమైన గనులు కావడంతో మంత్రికి వాటాలు ఇవ్వాలని ఒత్తిళ్లు తీసుకొచ్చారు. లేనిపక్షంలో లీజుల కాలపరిమితిని పొడిగించరని, మరో సంస్థకు కేటాయించాల్సి ఉంటుందని బెదిరించారు. అంతేగాక అప్పటిదాకా చేసిన మైనింగ్‌లో అక్రమాలు జరిగాయని గనుల శాఖ విజిలెన్స్ విభాగంతో తనిఖీలు నిర్వహించి 10-40 రెట్లు పెనాల్టీ వేస్తామని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో భయపడిన లీజుదారులు తమ కంపెనీల్లో వాటాలు ఇస్తామని లిఖితపూర్వక ఒప్పందాలు చేసుకున్నారు. ఆ తర్వాత కంపెనీల యాజమాన్యంలో మార్పులు చేసినట్లు రికార్డులు చూపించి మైనింగ్ చేపట్టారు. అలా మంత్రి రూపాయి పెట్టుబడి లేకుండానే వాటాలు దక్కించుకున్నారు. ఇందుకుగాను సదరు అధికారికి భారీ ప్రతిఫలమే దక్కింది. నెల్లూరు జిల్లాలోనూ ఓ కాంట్రాక్టర్‌ను ఆ అధికారి బెదిరించారు. మాట విననందుకు విజిలెన్స్ తనిఖీలు చేయించి 120 కోట్ల పెనాల్టీ వేయించారు. విశాఖలోనూ కర్ణాటకకు చెందిన ఓ ప్రముఖ మైనింగ్ వ్యాపారిని ఇలాగే బెదిరించారు. తనిఖీలు చేయించి 150 కోట్ల పెనాల్టీ వేయించారు.

సీఎంకు మంత్రి కొల్లు ఫిర్యాదు

గనుల శాఖ తిమింగలం చేసిన అరాచకాలు, అక్రమాలపై నవంబరులో మంత్రి కొల్లు రవీంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసి గనుల శాఖలో అక్రమాలపై నివేదిక ఇచ్చారని సమాచారం. 'ఇలాంటి అక్రమార్కులతో మేం అద్భుతమైన ఫలితాలు ఎలా సాధించగలం? ఆ అధికారులతో కలిసి ఎలా పనిచేయగలం? చర్యలు తీసుకోండి' అని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిసింది. ఆ తర్వాత సదరు అధికారిని సెలవుపై పంపాలని చూసినా ఇద్దరు మంత్రులు, ఓ ఎంపీ ఒత్తిడి చేసి కాపాడారు. దీంతో శాఖలో ఆయన దర్జాగా ఉన్నారు.

అవే కీలకం

గనుల ఘనుడు వెంకటరెడ్డి కేసును ఏసీబీ విచారిస్తున్న సంగతి తెలిసిందే. ఇసుక, ఇతర అంశాల్లో విచారణలో భాగంగా ఎండీసీ, గనుల డైరెక్టరేట్ పరిధిలోని కీలక ఫైళ్లను తమకు అప్పగించాలని కోరింది. గ్రానైట్, లేటరైట్, సిలికా, క్వార్ట్జ్ తదితర గనుల లీజుల పర్మిట్ల పొడిగింపు, రెన్యువల్ ఫైళ్లు తమకు రాలేదని ఏసీబీ గుర్తించింది. వాటి గురించి గనుల శాఖలో ఆరా తీసింది. సంబంధిత ఫైళ్లు కనిపించడం లేదని అధికారులు గుర్తించారు. గత రెండున్నర నెలలుగా వెతికినా ఆ ఫైళ్ల ఆనవాళ్లు దొరకలేదు. ఆ ఫైళ్లు గల్లంతయ్యాయని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఏసీబీకి, ప్రభుత్వ పెద్దలకు గనుల అధికారులు ఈ విషయాన్ని మౌఖికంగా నివేదించినట్లు తెలిసింది. మైనింగ్ లీజుదారుల నుంచి బలవంతంగా వాటాలు దక్కించుకున్న కేసులకు సంబంధించి 25 ఫైళ్లు కనిపించడం లేదు. వాస్తవానికి ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత, కౌంటింగ్‌కు ముందు గనుల శాఖలో అనేక ఫైళ్లను మాయం చేశారు. అందులో లీజు పర్మిట్ల పొడిగింపు, రెన్యువల్స్ ఫైళ్లే ఎక్కువగా ఉన్నాయి. కొన్నింటిని గంపగుత్తగా పోగేసి తగులబెట్టారు. ఈ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' పలు సందర్భాల్లో బయటపెట్టింది.



గొర్రెపాటి మాధవరావు (ఫైల్)

మానవ హక్కుల నేత గొర్రెపాటి కన్నుమూత

▸ విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలవైపు.. నాలుగు దశాబ్దాల అలుపెరుగని పోరాటం

నిజామాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల ఉద్యమ నేత గొర్రెపాటి మాధవరావు(67) శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య మీనా సహాని, కుమార్తెలు మానస, మధుమిత ఉన్నారు. గొర్రెపాటి ఏపీలోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా గురునాధపాలెంలో 1957 మార్చి 4న జన్మించారు. అదే సంవత్సరం ఆయన తల్లిదండ్రులు తెలంగాణకు వలస వచ్చి నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలో స్థిరపడ్డారు. దాంతో ఆయన ఇంటర్మీడియేట్ వరకు నిజామాబాద్ జిల్లాలో, తర్వాత హైదరాబాద్‌లో చదువుకున్నారు. విద్యార్థి దశ నుంచి విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులైన ఆయన 4 దశాబ్దాల పాటు మానవ హక్కుల రంగంలో పోరాటం చేశారు. రాజ్యహింస ఎక్కడ జరిగినా ఎదిరించడంలో గొర్రెపాటి ముందుండేవారు. విప్లవ సాహిత్యంపై మక్కువతో రచనలు, అనువాదాలు చేశారు. 'ఉపా'లాంటి వివాదాస్పద చట్టాలపై వ్యాసాలు రాశారు. న్యాయవాద వృత్తిలో సైతం రాణించారు. తెలంగాణ ఉద్యమంలో కేసులు ఎదుర్కొన్న విద్యార్థుల తరపున ఉచితంగా వాదించారు. మూడు ఎన్‌కౌంటర్లలో పోలీసులు, ప్రభుత్వంపై కేసులు వేసి గెలిచి.. బాధితులకు నష్టపరిహారం వచ్చేలా చేశారు. తెలంగాణవర్సిటీలో న్యాయశాస్త్ర విద్యార్థులకు బోధించారు. మొదట ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘంలో పనిచేసిన ఆయన తర్వాత మానవ హక్కుల వేదిక వ్యవస్థాపక సభ్యుడిగా, రెండుసార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. గొర్రెపాటి భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం నిజామాబాద్ ఎల్లమ్మగుట్టలోని నివాసంలో ఉంచారు. ఆదివారం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేయనున్నారు. గొర్రెపాటి మాధవరావు మృతి సమాజానికి తీరని లోటని మానవ హక్కుల వేదిక ఏపీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ జగన్నాథరావు, వై.రాజేశ్ పేర్కొన్నారు.



ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా మధుమూర్తి బాధ్యతలు


అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ కె.మధుమూర్తి శనివారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హైస్కూల్ ప్లస్‌ను జడ్పీ జూనియర్ కాలేజీలుగా మార్చండి


▸ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పాఠశాలలను రద్దు చేసే క్రమంలో వాటిని జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్చి ఇంటర్ విద్యను బలోపేతం చేయాలని ఏపీ హైస్కూల్ పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్ వ్యవస్థను రద్దు చేస్తే గ్రామీణ బడుగు బలహీనవర్గాల బాలికలు డ్రాప్‌అవుట్స్‌గా మారి విద్యకు దూరమవుతారని తెలిపారు. హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్పు చేయాలని కోరారు.

రామచంద్రయ్యకు పుత్ర వియోగం



సి.రామచంద్రయ్యను పరామర్శిస్తున్నచిరంజీవి



విష్ణుస్వరూప్(ఫైల్)

అమరావతి, కడప మారుతీనగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణుస్వరూప్(42) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం రాత్రి రామచంద్రయ్య భార్య, కుమారుడు విష్ణు కడపకు రావాల్సి ఉంది. జనవరి ఫస్ట్, సంక్రాంతి పండుగలను కడపలో జరుపుకొని తిరిగి హైదరాబాద్‌కు వెళ్లాలనుకున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం హైదరాబాద్‌లో సిద్ధం అవుతుండగా ఒక్కసారిగా విష తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానిక అపోలో హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రామచంద్రయ్య సోదరుడు శశికుమార్ వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం కడప జిల్లా చలమారెడ్డిపల్లెలోని ఫాంహౌస్‌లో అంత్యక్రియలు జరుగనున్నాయని వెల్లడించారు. విష్ణు మృతి విషయాన్ని తెలుసుకున్న హీరో చిరంజీవి, పలువురు నటులు, మంత్రు లు రామచంద్రయ్యను పరామర్శించారు. సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పవన్ సంతాపం..

విష్ణుస్వరూప్ ఆకస్మిక మరణం దురదృష్టకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ప్రజల భద్రతకు భరోసా!

2024లో మెరుగ్గా పోలీసు పనితీరు: డీజీపీ.. మొత్తంగా నేరాలు తగ్గాయి

▸ ఆస్తి, సైబర్, గంజాయి క్రైమ్స్ మాత్రం పెరుగుదల

▸ వీలైనంత త్వరగా కేసుల పరిష్కారం

▸ ప్రతి జిల్లాకో సైబర్ స్టేషన్.. ప్రతి స్టేషన్‌కు ఒక డ్రోన్

▸ మహిళలపై నేరాలు 10% తగ్గుదల

▸ డీజీపీ తిరుమలరావు వెల్లడి.. వార్షిక నివేదిక విడుదల



అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గతంలో కొన్ని నేరాల్లో బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకొచ్చేవారు కాదని, కానీ ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా వస్తున్నారని చెప్పారు. ఫలితంగా పోలీసులు నమోదు చేస్తున్న కేసుల సంఖ్య పెరుగుతోందన్నారు. టెక్నాలజీ వినియోగంతో నేరస్థుల జాడ తెలుసుకుని పట్టుకుంటున్నామని తెలిపారు. ఈ సంవత్సరం(2024) పోలీసు శాఖ పనితీరు మెరుగ్గా ఉందన్నారు. మొత్తంగా నేరాలు తగ్గాయని చెప్పారు. ఆస్తి, సైబర్, గంజాయి సంబంధిత నేరాలు మాత్రం పెరిగాయన్నారు. అయితే సైబర్ నేరాలు దేశవ్యాప్తంగా పెరిగాయని, ఏపీలోనే పోలీసులు అప్రమత్తమై ఎక్కువ ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారన్నారు. పోలీసు శాఖ 2024 వార్షిక నివేదికను శనివారం పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు డ్రోన్లు, సీసీ కెమేరాలు ఎక్కువగా వినియోగిస్తున్నామన్నారు. గతంలో సైబర్ నేరాల్లో మోసపోయినవారు ఫిర్యాదు చేసేవారు కాదు. కానీ ఇప్పుడు ఎక్కువ మంది బాధితులు ముందుకొస్తున్నారు. మొత్తంగా చూస్తే 5.7 శాతం నేరాలు తగ్గాయి. గంజాయి కేసులు 3 శాతం పెరిగాయి. మహిళలపై నేరాలు 10 శాతం తగ్గాయి. అయితే మహిళల హత్యలు 22.5 శాతం పెరిగాయి. దొంగతనాల కేసులు పెరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీలపై కేసులు 5%, రోడ్డు ప్రమాదాలు 6.13%తగ్గాయి. సైబర్ నేరాల్లో సగటున ఒక్కొక్కరు రూ.40 లక్షలు నష్టపోతున్నారు. మన దేశంలో డిజిటల్ అరెస్టుల విధానం లేదు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచుతాం. డిజిటల్ అరెస్టు అని ఎవరైనా ఫోన్ చేస్తే భయపడవద్దు. అలాగే వీడియో కాల్స్ చేసి, ఎదుటి వారి బలహీనతల ను ఆసరాగా చేసుకుని మహిళల ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అలాగే లోన్లు ఇస్తామనే కాల్స్‌తోనూ చాలా మంది మోసపోతున్నారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున ప్రతి జిల్లాకు ఒక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటుచేస్తాం. ఆర్‌బీఐ సహకారం తీసుకుంటున్నాం' అని తెలిపారు. ఇంకా ఏం చెప్పారంటే..

గంజాయిపై ఈగిల్..

'రాష్ట్రాన్ని గంజాయి రహితం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం మాదక ద్రవ్యాల కట్టడికి 'ఈగిల్' దళాన్ని ఏర్పాటుచేసింది. ఈ ఏడాది 52 వేల కిలోల గంజాయి పట్టుబడింది. 4,851 మందిని అరెస్టు చేశాం. గంజాయి సాగుచేసే 10,830 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకూ 25,250 సీసీ కెమేరాలు ఏర్పాటుచేశాం. వచ్చే మార్చి నాటికి మరో లక్ష ఏర్పాటుచేయడం లక్ష్యం. ప్రతి పోలీసు స్టేషన్‌కు ఒక డ్రోన్ ఇస్తాం. గతంలో వేలిముద్రల గుర్తింపు పరికరాలు నిర్వహణ లేకుండా నిరుపయోగంగా మారాయి. వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చాం. ఏలూరు పోలీసులు ప్రయోగాత్మకంగా కృత్రిమ మేధ(ఏఐ)ని ఉపయోగిస్తున్నారు. ఏఐ ద్వారా విచారణ వేగవంతమవుతుంది. అలాగే ఎఫ్ఐఆర్ నమోదు, ఎలాంటి సెక్షన్లు వర్తిస్తాయి. విజయవాడలో ట్రాఫిక్ నియంత్రణకు కూడా ఏఐ వినియోగిస్తున్నాం. సైబర్ నేరాల్లో నగదు కోల్పోయే బాధితులు గోల్డెన్ అవర్‌ను ఉపయోగించుకోవాలి. నగదు పోయిన గంటలోపు 1930కి కాల్ చేసి ఫిర్యాదుచేస్తే నేరస్థుడి ఖాతా నుంచి మరో ఖాతాకు నగదు బదిలీ కాకుండా స్తంభింపజేస్తారు.

ఆస్తి/నగదు సంబంధిత నేరాలు

కేటగిరీ	2023	2024	వ్యత్యాసం (శాతం)
డబ్బు కోసం హ్యతలు	42	46	9.5
బందిపోటు దోపిడీలు	44	33	-25
దోపిడీలు	194	246	26.8
పగలు ఇళ్ల దోపిడీ	682	802	17.5
రాత్రి ఇళ్ల దోపిడీ	2,846	3,114	9.4
దొంగతనాలు	13,441	13,041	-3
మొత్తం	17,249	71,282	0.2

2024లో గుర్తించిన నేరాలు

కేటగిరీ	2023	2024	వ్యత్యాసం (శాతం)
వ్యక్తులపై నేరాలు	21,016	20,106	-4
ఆస్తి నేరాలు	17,249	17,282	0.2
మహిళలు, పిల్లలపై నేరాలు	28,395	25,694	-9.5
రోడ్డు ప్రమాదాలు	18,597	17,688	-5
ఎస్సీ, ఎస్టీలపై నేరాలు	2,479	2,356	-5
సైబర్ నేరాలు	682	916	34
చీటింగ్ కేసులు	7,581	6,233	-18
ఎన్‌డీపీఎస్	1,761	1,819	3
మొత్తం	97,760	92,094	-5.7

మహిళలపై నేరాలు

కేటగిరీ	2023	2024	వ్యత్యాసం (శాతం)
మహిళల హత్యలు	40	49	22.5
కట్నం వల్ల మరణాలు	99	42	-57.5
అత్యాచారాలు, అత్యాచారయత్నాలు	1,562	1,558	-0.26
కట్నం వేధింపులు	11,402	9,635	-15.49
మహిళల ఆత్మగౌరం కించపరిచే ఘటనలు	7,919	7,282	-8.04
ఇతర నేరాలు	6,529	6,200	-5.03
మొత్తం	27,551	24,766	-10

నాపై కేసును కొట్టివేయండి

▸ హైకోర్టును ఆశ్రయించిన నిమ్మల రామానాయుడు

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తనపై ఏలూరు ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలని కోరుతూ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హాజరు నుంచి మినహాయింపుతో పాటు కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. పాలకొల్లు పట్టణంలో టిడ్కో ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వడంలేదంటూ 2022లో నిమ్మల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు, అతని అనుచరులు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని పాలకొల్లు వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా రామానాయుడుతో పాటు మరో 25 మందిపై 2022 ఆగస్టు 5న కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తనపై కేసును కొట్టివేయాలంటూ రామానాయుడు హైకోర్టును ఆశ్రయించారు.

అదానీ మీటర్లపై డిస్కమ్ వెనుకడుగు..!

▸ ఇది ప్రజాందోళన విజయం: సీపీఎం బాబూరావు

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'ప్రజా పోరాటాల ఫలితంగా గృహాలకు అదానీ మీటర్లు బిగించడంపై డిస్కమ్‌లు వెనుకడుగు వేశాయి. ఇది ప్రజా విజయం' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్. బాబూరావు అన్నారు. ఆయన ఈమేరకు శనివారం ఓ ప్రకటన చేశారు. 'గుంటూరు సుందరయ్య నగర్‌లో అదానీ స్మార్ట్ మీటర్లను 16 ఇళ్లకు అమర్చిన సిబ్బంది వెనక్కు మళ్లారు. మీటర్లను తొలగించి మళ్లీ సాధారణ మీటర్లను అమర్చారు' అని బాబూరావు తెలిపారు. దీనిపై ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోశ్‌రావు శనివారం స్పందించారు. 'నెలకు 200 యూనిట్లు దాటిన గృహ విద్యుత్తు వినియోగదారులకు మాత్రమే అదానీ స్మార్ట్ మీటర్లను బిగిస్తాం. అదానీ స్మార్టు మీటర్ల విషయంలో వెనుకంజ వేయలేదు' అని స్పష్టం చేశారు.


వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌కు 377 వినతులు

మచిలీపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌కు 377 వినతులు అందాయి. కృష్ణా జిల్లా మచిలీపట్నం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, కలెక్టర్ బాలాజీతో కలిసి శనివారం ఎస్సీ సామాజిక వర్గాలు, అనుబంధకులాల ప్రతినిధుల నుంచి వినతులను స్వీకరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సంఘాల ప్రతినిధులు వినతులు అందజేశారు.

ఆగ్రోస్ ద్వారానే యంత్ర పరికరాలు: డిల్లీ రావు

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ఈ ఏడాది నుంచి రైతులకు వ్యక్తిగత పరికరాలను ఏపీ ఆగ్రోస్ ద్వారానే సరఫరా చేస్తామని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. పారదర్శకంగా నాణ్యమైన వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు.





విశాఖ తీరంలో నేవీ విన్యాసాలు

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరం శనివారం సాయంత్రం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. తూర్పు నౌకాదళం జనవరి 4వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సమక్షంలో సాహస విన్యాసాలు ప్రదర్శించాలని నిర్ణయించింది. ఏటా డిసెంబరు 4న నేవీ డే నాడు జరిగే ఈ కార్యక్రమాన్ని ఈసారి ఒడిశాలోని పూరీ తీరాన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సమక్షంలో నిర్వహించారు. విశాఖ ప్రజల కోసం జనవరి 4న విన్యాసాల ప్రదర్శనకు నిర్ణయించారు. దానికి ముందు రిహార్సల్స్‌గా శనివారం ఆర్కే బీచ్ వద్ద వివిధ రకాల సాహస విన్యాసాలు ప్రదర్శించారు.

యువ క్రికెటర్ నితీశ్‌కు జేజేలు

▸ విశాఖలోని తుంగ్లాంలో సంబరాలు



తుంగ్లాంలో కేకు కట్ చేస్తున్న నితీశ్ నాయనమ్మ అప్పలకొండ. పెదనాన్న కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం (విశాఖపట్నం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో భారత్ క్రికెటర్ కాకి నితీశ్‌కుమార్‌రెడ్డి శనివారం సెంచరీ చేయడంతో అతడి స్వస్థలమైన నగర పరిధిలోని తుంగ్లాంలో సంబరాలు అంబరాన్నంటాయి. బాణసంచా మోతలతో గ్రామం మార్మోగిపోయింది. నితీశ్ కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీ ప్రజలతో పాటు గాజువాకలోని క్రికెట్ ప్రేమికులు ఈ సంబరాల్లో పాలుపంచుకున్నారు. సాయంత్రం నితీశ్ పెదనాన్న, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవంలో నితీశ్ నాయనమ్మ అప్పలకొండ కేక్ కట్ చేశారు. నితీశ్ చిన్నాన్న కాకి రామిరెడ్డి, పెద్దమ్మ కాకి శ్రీదేవితో పాటు ఇతర కుటుంబ సభ్యులు విందాయిలు పంచిపెట్టారు. కాలనీలో యువకులు నితీశ్ కుమార్ రెడ్డి ఫ్లెక్సీలతో సందడి చేశారు.

పెరిగిన ప్రతి పైసాకూ జగన్ దిక్కుమాలిన పాలనే కారణం

- ఆయన కుంభకోణాలకూ ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారు
- వైసీపీ ప్రభుత్వమే అప్పుడు డబ్బులు చెల్లిస్తే అసలు చార్జీలు ఎందుకు పెరిగేవి?: మంత్రి పార్థసారథి



అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): 'విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా ఆ మొత్తం డబ్బులు కూటమి ప్రభుత్వం భరించాలని వైసీపీ నేతలు ఉచిత సలహాలు ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన మోత ఇప్పుడు ప్రజలపై పడుతోంది. వైసీపీ ప్రభుత్వమే అప్పుడు డబ్బులు ఇచ్చి ఉంటే అసలు చార్జీలు ఎందుకు పెరిగేవి? దీనికి వైసీపీ నేతలు సమాధానం చెప్పాలి' అని మంత్రి కొలుసు పార్థసారథి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'విద్యుత్ సంస్థలకు వైసీపీ ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టింది. అవి గత్యంతరం లేక చార్జీలు పెంచాయి. ఆ విషయాన్ని కప్పిపెట్టి వైసీపీ నేతలు రోడ్ల మీద ధర్నాలు చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మిగులు విద్యుత్‌తో రాష్ట్రాన్ని అప్పగించి వెళ్తే జగన్ తన ఐదేళ్ల పాలనలో ఆ రంగాన్ని కుప్పకూల్చాడు. జగన్ చేసిన కుంభకోణాలకూ ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోంది. హైదరాబాద్‌లో అత్యంత విలువైన పది ఎకరాల భూములను హిందూజా సంస్థ నుంచి జగన్ బినామీలు దక్కించుకొన్నారు. దానికి ప్రతిఫలంగా ఈ రాష్ట్రంలో ఆ కంపెనీకి అప్పనంగా రూ.1,450 కోట్లు విద్యుత్ సంస్థల నుంచి చెల్లించారు. ఆ ఖర్చు ఇప్పుడు జనం నెత్తిన పడింది. దొంగే దొంగ అని అరిచినట్లుగా వైసీపీ వైఖరి ఉంది. జగన్ అంత బాగా పాలన చేస్తే ఐదేళ్లలో పదిసార్లు చార్జీలు ఎందుకు పెంచాడు? ఆ పెంపు వల్ల ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం పడింది. అధికారంలోకి వచ్చీ రాగానే టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పీపీఏలను చట్ట విరుద్ధంగా రద్దు చేశాడు. కోర్టు దానిని కొట్టివేసింది. దాని వల్ల ఆ సంస్థల నుంచి తీసుకోవాల్సిన 7,000 మెగావాట్ల కరెంటు రాలేదు. ఆ కరెంటును విపరీతమైన రేట్లకు బయటకొని ప్రజలకు ఇవ్వాల్సి వచ్చింది. కోర్టు తీర్పు వల్ల పీపీఏలు రద్దు చేసిన కంపెనీలకు డబ్బు చెల్లించాల్సి వచ్చింది. ఒకే కరెంటుకు ఇద్దరికీ డబ్బులు చెల్లించారు. అది జగన్ జేబులో నుంచి ఇవ్వలేదు. కరెంటు చార్జీలు పెంచి జనం నుంచి వసూలు చేశారు. దీనికి వైసీపీ ఏం సమాధానం చెబుతుంది? విద్యుత్ సంస్థల నుంచి రూ.40 వేల కోట్ల అప్పులు తెచ్చి వాటిని ఇతరత్రా అవసరాలకు వాడారు. ఆ అప్పులు తీర్చడానికి విద్యుత్ సంస్థలు చార్జీలు పెంచి జనం నుంచి వసూళ్లు మొదలు పెట్టాయి. పెరిగిన ప్రతి పైసా చార్జీకి జగన్ దిక్కుమాలిన పాలనే కారణం. ఆయన ఐదేళ్ల పాలన వల్ల విద్యుత్ రంగంపై పడిన అదనపు భారం రూ.1.30 లక్షల కోట్లు' అని మంత్రి పార్థసారథి ఆరోపించారు.

నీటి సంఘాలతో రైతులకు సేవలందిస్తాం: ఆళ్ల

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ద్వారా రైతులకు సేవలు అందించే అవకాశం కల్పించినందుకు సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు సీఎం చంద్రబాబు, జలవనరుల మంత్రి రామానాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నీటి సంఘాల ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో గోపాలకృష్ణారావును పల్లా శ్రీనివాసరావు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, సాగునీటి సంఘాల ద్వారా సేవలందించేందుకు 6వేల మంది రైతు ప్రతినిధులకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 49 వేల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, 6,149 మంది నీటి సంఘాల అధ్యక్షులు, 245 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, 58 మంది ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు.

కొత్త ఏడాదిలో జిల్లాల పర్యటనకు పవన్

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగనున్నారు. కొత్త ఏడాది జనం మధ్యకు వెళ్లి వారి ఇబ్బందులు తీసుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రతి నెల ఒక జిల్లాను ఎంచుకొని పర్యటిస్తారు. ఆ జిల్లాలో వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాల్లో క్యాంపు చేసేలా ఏర్పాట్లు ఉండాలని తన కార్యాలయ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని సమస్యలు, ప్రజల స్థితిగతులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ఈ పర్యటనలో ఆయన పరిశీలిస్తారు. రోజంతా ప్రజలతో మమేకమవుతారు.



వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.కోటీ 18 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేస్తున్న టీటీడీ ఉద్యోగులు



వరద బాధితుల సహాయార్థం రూ.71.59 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేస్తున్న టీటీడీ పెన్షనర్లు

ఏఐతో వైద్య సేవలు

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఏఐ వినియోగానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)సేవను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖను గాడిన పెట్టి, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో అందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్‌పై వైద్య ఆరోగ్యశాఖ దృష్టిపెట్టాలని సూచించారు. వైద్యశాఖలో పేరుకుపోయిన సమస్యలు, తీసుకురానున్న సంస్కరణలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలకు సీఎం ఆమోదం తెలిపారు. అనారోగ్య సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ ఆసుపత్రికి వచ్చే అవసరం లేకుండా, సాంకేతికత ద్వారా వైద్య సాయం పొందే పరిస్థితి తీసుకురావాలని సూచించారు. ప్రజల హెల్త్ రిపోర్టులు రూపొందించడం, ప్రభుత్వ పరంగా ఆరోగ్య పరీక్షలు చేసి హెల్త్‌కార్డు ఇచ్చే విధానాలను అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. 104 సర్వీసుల ద్వారా రక్త పరీక్షలు సహా పలు టెస్టులు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునే విధంగా పైలట్ ప్రాజెక్టు ప్రారంభించాలని ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 1.43 కోట్ల కుటుంబాలకు చెందిన 4.30 కోట్ల మందికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవలో 3,257 రకాల జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల మేర హెల్త్ కవరేజ్ ఉంటుంది. ట్రస్ట్ పద్ధతిలో ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఈ కార్యక్రమాన్ని బీమా విధానంలో తీసుకొచ్చే అంశంపై చర్చించారు. ఆరోగ్య బీమా విధానం వల్ల మరింత మెరుగ్గా, నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. రాష్ట్రాన్ని రెండు యూనిట్లుగా విభజించి బీమా విధానాన్ని ప్రారంభించాలని సీఎం చెప్పారు. పబ్లిక్, ప్రైవేటు సెక్టార్‌లోని బీమా కంపెనీల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి మండలంలో జనఔషధి మందుల షాపులను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

కొత్త 108లు కొనుగోలుకు ఓకే

ప్రభుత్వాసుపత్రుల బలోపేతం, 108, 104 సేవలు, ఎన్టీఆర్ వైద్యసేవను బీమా విధానంలో తీసుకువచ్చి నాణ్యమైన వైద్యసేవలు అందించే విషయంపైనా సీఎం చర్చించారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 108, 104 సర్వీసులకు విడివిడిగా ఆపరేటర్లు ఉండేవారని, 2020 తర్వాత కాల్ సెంటర్‌తో కలిపి ముగ్గురు ఆపరేటర్లను ద్వారా సేవలు అందించారని గుర్తుచేశారు. మళ్లీ కొత్తగా టెండర్లకు వెళ్లనున్న నేపథ్యంలో సింగిల్ ఆపరేటర్ ద్వారా మూడు సేవలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న 108 అంబులెన్స్‌ల్లో 190 ఫిట్‌నెస్ కోల్పోయాయని, 2016లో కొనుగోలు చేసిన వీటిని అన్నింటినీ పూర్తిగా మార్చి కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. వీటికోసం రూ.60కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. గ్రామాల్లో వైద్యసేవలు అందించడంలో కీలకమైన 104 సర్వీసుల్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీఎం మండిపడ్డారు. 104 అంబులెన్స్‌లను బలోపేతం చేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు పలు రకాల టెస్టులు చేసే సౌలభ్యాన్ని తిరిగి తీసుకురావాలని సూచించారు.

కొత్తగా 58 మహాప్రస్థానం వాహనాలు

108 సర్వీసు సిబ్బందికి జీతంతో పాటు అదనంగా రూ.4వేలు ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వం దీనిని రూ.2వేలకు కుదించిందని విమర్శించారు. ఆసుపత్రుల్లో చనిపోయిన వారి మృతదేహాలు తరలించే మహాప్రస్థానం వాహనాల సంఖ్యను పెంచాల్సి ఉందని అధికారులు తెలపగా సీఎం అంగీకరించారు. 58 మహాప్రస్థానం వాహనాలను సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా అందుబాటులోకి తేనున్నారు. దీనికి ఏడాదికి రూ.9.45కోట్లు అదనంగా ఖర్చు అవుతుందన్నారు. ఆసుపత్రుల వద్ద అంబులెన్స్ మాఫియా వంటి ముఠాల ఆగడాలు సాగడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు. బాధలో ఉన్న వారిని పీడించే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వైసీపీ నేతల కబ్జాపై విచారణ జరపాలి

టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుదారుడి విజ్ఞప్తి

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసిన ఉదంతాలపై విచారణ జరిపి, ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ భవన నిర్మాణాలకు వినియోగించాలని టీడీపీ గ్రీవెన్స్‌లో ఓ వ్యక్తి కోరారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడేటి చంటి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 'కోనసీమ జిల్లా రావులపాలెంలో 2.83 ఎకరాల ప్రభుత్వ భూమిని మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రోద్బలంతో అతని మేనమామ ఎం శ్రీనివాసరెడ్డి, గోపాలపురం మాజీ సర్పంచ్ పద్మనాభరెడ్డి ఆక్రమించుకున్నారు. దానిపై కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. విచారణ చేసి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి' అని చంద్రశేఖర్ అనే వ్యక్తి విజ్ఞప్తి చేశారు. అమలాపురానికి చెందిన రాజులపూడి ఆరుద్ర అర్జీ ఇస్తూ, ఆస్తుల విషయంలో తమపై దౌర్జన్యానికి దిగిన వారిపై చర్యలు తీసుకుని, రక్షణ కల్పించాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరుకు చెందిన తేజస్విని విజ్ఞప్తి చేస్తూ, 'నా కుమారుడికి బ్రెయిన్ డ్యామేజ్ అయింది. బ్రెయిన్‌కు ఆక్సిజన్ సరిగా అందక ఇబ్బంది పడుతున్నాడు. వైద్యానికి తగిన సాయం చేయండి' అని వేడుకొన్నారు.

'చీఫ్ మినిస్టర్ ఫెలోస్'!

- సీఎం కార్యాలయానికి అనుబంధంగా ఏర్పాటు
- ప్రజల నాడి తెలుసుకోవడానికి రాబిన్ శర్మ బృందం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబు తన కార్యాలయానికి అనుబంధంగా యువరక్తంతో కొత్త బృందం ఏర్పాటు చేయనున్నారు. వీరికి 'చీఫ్ మినిస్టర్ ఫెలోస్' అని పేరు పెట్టారు. పాలనలో సమస్యలు, పథకాల అమలులో లోటుపాట్లు, వాటికి పరిష్కారాలపై అధ్యయనం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో నేరుగా ముఖ్యమంత్రికి నివేదించడం ఈ బృందం ప్రధాన విధి. టీం తనకు పాలనలో సహాయకారిగా ఉండాలని సీఎం భావిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు ఇప్పటికే ఇటువంటి బృందాలను ఏర్పాటు చేసుకొన్నారు. గుజరాత్ సీఎంవో కోసం ఐఐఎం అహ్మదాబాద్ తొలుత ఇటువంటి బృందాన్ని ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఈ బృందాల పనితీరును పరిశీలించి రాష్ట్రంలో మరింత మెరుగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆశిస్తున్నారు. 'చీఫ్ మినిస్టర్ ఫెలోస్' పేరుతో మొత్తం 25మందిని నియమించుకోవాలని నిర్ణయించారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ప్రతిభావంతులను ఈ టీం కోసం ఎంపిక చేస్తారు. వీరికి ఆకర్షణీయమైన జీతభత్యాలు ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం ఒక్కొక్కరికి ఒక్కో జిల్లా బాధ్యతలు కేటాయిస్తారు. వచ్చే ఏప్రిల్ నుంచి వీరు రంగంలోకి దిగే అవకాశం ఉంది. సీఎం కార్యాలయం మరింత మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ బృందం ఉపకరిస్తుందని ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రభుత్వానికి సహాయకారిగా రాబిన్ శర్మ బృందం

గత ఎన్నికల్లో టీడీపీకి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన రాబిన్ శర్మ టీం సేవలను ఇకముందు కూడా వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయం ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకొని సూచనలు, సలహాలు ఇవ్వడానికి కొత్తగా ఒక చిన్న బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఇటీవల సీఎం ఆయనకు సూచించినట్లు సమాచారం. రాబిన్ టీంలో కీలక సభ్యుడు శంతన్ స్థానంలో నియమితుడైన అనంత్ తివారీ నేతృత్వంలో ఈ కొత్త బృందం ప్రభుత్వానికి సహాయకారిగా పని చేయనుంది. దీనిని పార్టీ తరఫున ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయం ఎలా ఉంది? వివిధ పథకాల విషయంలో ప్రజల్లో సంతృప్త శాతం... జిల్లాల్లో టీడీపీ పనితీరును తెలుసుకోవడంతో పాటు ఇతర పార్టీల కార్యకలాపాల సమాచారం సేకరించి అందచేయడం ఈ బృందం విధి. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఎన్నికల వ్యూహకర్తలకు చెందిన సంస్థలతో బృందాలను ఏర్పాటు చేసుకొన్నా వాటివల్ల పెద్దగా ఫలితాలు రాలేదు. వాటి అనుభవాలపై టీడీపీ అధినాయకత్వం అధ్యయనం చేయిస్తోంది. అక్కడ జరిగిన పొరపాట్లు చేయకుండా చూసుకోవాలన్నది దీనివెనుక ఆలోచనగా తెలుస్తోంది.

మంత్రుల వద్ద మరో టీం

రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో ఒక బృందాన్ని మంత్రులందరి వద్ద నియమించనున్నారు. ఎంబీఏ పూర్తిచేసిన తెలుగు యువతను ఎంపిక చేసి ప్రస్తుతం వారికి శిక్షణ ఇప్పిస్తున్నారు. తర్వాత ఒకో మంత్రి వద్ద ఒక్కొక్కరు చొప్పున నియమించాలని నిశ్చయించారు. ఆ శాఖ పరిధిలో విజన్-2047 లక్ష్యాలను సాధించడానికి జిల్లా, మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించడం, అవి అమలయ్యేలా చూడటం వీరి విధి. సదరు శాఖ రోజువారీ విధుల్లో జోక్యం చేసుకోకుండా విజన్ లక్ష్యాలను చేరుకోవడంపైనే వీరు దృష్టిపెట్టి పనిచేస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

రేపు నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్

నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం

సూళ్లూరుపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లేందుకు సిద్ధమైంది. ఈ వాహక నౌక ద్వారా స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు. ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించి ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నారు. ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) శనివారం వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన శాస్త్రవేత్తలు సమావేశమై ప్రయోగంపై చర్చించిన తరువాత ప్రయోగానికి సంసిద్ధత తెలిపారు. ప్రయోగ నేపథ్యంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఆదివారం షార్‌కు రానున్నారు.



పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్

సాగరంలో వివాహిత సాహసయాత్ర

- విశాఖ నుంచి ఈదుతూ కాకినాడకు

విశాఖపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సముద్రంలో సాహస యాత్రకు ఐదు పదుల వయసులో ఓ వివాహిత సిద్ధమయ్యారు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన శ్యామల గోలి(51) విశాఖ నుంచి సముద్రంలో ఈదుకుంటూ 150 కి.మీ. దూరంలో ఉన్న కాకినాడ చేరుకునేందుకు సిద్ధమయ్యారు. గతంలో అనారోగ్యానికి గురైన శ్యామల.. శ్రేయోభిలాషుల సూచనతో ఈత నేర్చుకున్నారు. ఈతపై పట్టు సాధించడంతో సాగరయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. శనివారం ఉదయం ఆర్కే బీచ్ వద్ద ఆమె యాత్రను ఎంపీ ఎం. శ్రీభరత్ ప్రారంభించారు. శ్యామల చేపట్టిన సాహస యాత్ర ఆమె ఆత్మవిశ్వాసానికి, మహిళా శక్తికి ప్రతీకగా నిలుస్తుందని, ఇది మహిళలు, సమాజానికి స్ఫూర్తిదాయకమని ఎంపీ కొనియాడారు. సాయంత్రానికి శ్యామల విశాఖ ఉక్కు కర్మాగారం వెనుక ఉన్న అప్పికొండకు చేరుకున్నారు. సముద్రంలో ఈదే క్రమంలో ఆమె వెంట ఒక బోటు ఉంటుంది. శ్యామల పగటిపూట ఈదుతూ రాత్రి ఆ బోటులో విశ్రాంతి తీసుకుంటారు. గతంలో ఆమె అమెరికాలో ఒక దీవి నుంచి మరో దీవికి, శ్రీలంక నుంచి కన్యాకుమారికి ఈదుకుంటూ చేరుకున్నారు.



శ్యామల గోలిని అభినందిస్తున్న ఎంపీ శ్రీభరత్

ఫీజు బకాయిలపై ఆందోళన వాయిదా: బొత్స



విశాఖపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైసీపీ జనవరి 3న నిర్వహించతలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని 29కి వాయిదా వేసినట్టు శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ శనివారమిక్కడ విలేకరులకు తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,800 కోట్లు, వసతి దీవెన కింద రూ.1,100 కోట్లు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జనవరి 2న విద్యార్థులకు పరీక్షలు ఉండడంతో ఇబ్బంది లేకుండా ఉండేందుకు వాయిదా వేశామన్నారు.

టెండర్.. రీటెండర్!

పౌరసరఫరాల కార్పొరేషన్‌లో సిత్రాలు

- స్టేజ్-1 ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టుకు 4 నెలల్లో రెండోసారి టెండర్
- ఒకే నంబరు.. అవే నిబంధనలతో మళ్లీ నోటిఫికేషన్
- ప్లాట్‌ఫాం మార్పుపై అనుమానాలు.. 22 జిల్లాలకు కుదింపు
- టెండర్ల కాలక్షేపంతో పాత కాంట్రాక్టర్లకు రూ.కోట్లలో బిల్లులు
- కమీషన్ల కక్కుర్తితోనే అంటూ అధికారులపై ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో అతిపెద్దదైన స్టేజ్-1 ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టు టెండర్ల ప్రక్రియలో ఎన్నెన్నో సిత్రాలు వెలుగుచూస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే టెండర్లను కావలసినవారికి కట్టబెట్టేందుకు పౌరసరఫరాల కార్పొరేషన్‌లో టెండర్లాట రసవత్తరంగా నడుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్ల వ్యవహారాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన పౌరసరఫరాల కార్పొరేషన్ అధికారులు ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తున్నారు. అధికారుల పనితీరులో మార్పు కనిపించడం లేదు. 'టెండర్ల ప్రక్రియలో రూల్సూ గీల్సూ జాన్తా నై. భారీ మొత్తాల్లో కమీషన్లు, నెలవారీ మామూళ్లు ఇచ్చేవారికే జైజై' అన్నట్టు వ్యవహరిస్తున్నారని టెండరుదారులు ఆరోపిస్తున్నారు. స్టేజ్-1 ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో తెరవెనుక జరుగుతున్న వ్యవహారాలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

వైసీపీ కాంట్రాక్టర్లతో పెనవేసుకున్న అనుబంధం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని రేషన్‌కార్డుదారులకు ప్రతినెలా ఉచిత బియ్యం, సబ్సిడీ ధరలపై పంచదార, కందిపప్పు తదితర సరుకులను పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా సరఫరా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కార్పొరేషన్ ఆధ్వర్యంలోని బఫర్ గోడౌన్లు, ఎఫ్‌సీఐ, ఇతర ప్రైవేటు గోడౌన్ల నుంచి మండల కేంద్రాల్లోని గోడౌన్ల(మండల స్థాయి స్టాక్ పాయింట్లు)కు పీడీఎస్ బియ్యం, ఇతర సరుకులను రవాణా చేసేందుకు రెండేళ్ల కాల వ్యవధితో జిల్లాలవారీగా టెండర్లు పిలుస్తున్నారు. గత ఐదేళ్లూ వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లే స్టేజ్-1 టెండర్లు దక్కించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో చివరిసారిగా పిలిచిన టెండర్ల కాలపరిమితి గతేడాది ఫిబ్రవరితోనే ముగిసిపోవడంతో కార్పొరేషన్ అధికారులు కొత్తగా టెండర్లు పిలిచారు. అయితే ఆ టెండరు డాక్యుమెంటులో కొన్ని పాయింట్లను తప్పులుగా చూపిస్తూ పాత టెండరుదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు స్టే ఇవ్వడంతో కొంతకాలం పాత టెండరు ప్రకారమే స్టేజ్-1 ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టును కొనసాగించి.. ఒక్కొక్క కాంట్రాక్టరుకు ప్రతి నెలా రూ.కోట్లలో బిల్లులు చెల్లించారు. గత ఐదేళ్లుగా పాత టెండరుదారులతో ఏర్పడిన విడదీయరాని అనుబంధంతో పౌరసరఫరాల అధికారులే తెరవెనుక ఉండి ఈ స్టే కథ నడిపించారనే ఆరోపణలున్నాయి. పాత టెండరు పొడిగింపు కుదరదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో అధికారులు మరో ఎత్తుగడ వేశారు. స్టేజ్-1 ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టు కోసం జిల్లాల వారీగా టెండర్లు పిలవడం.. ఆ తర్వాత జరిగే ప్రక్రియలో లేనిపోని కారణాలను చూపిస్తూ టెండర్లను అర్ధంతరంగా నిలిపివేయడం.. మళ్లీ రీటెండర్లు పిలవడం... ఇలా గత 8 నెలలుగా కాలం గడుపుతూ వస్తున్నారు. అధికారికంగా టెండర్లు ఖరారు కాకపోవడంతో రేషన్ బియ్యం, ఇతర సరుకులను డిపార్ట్‌మెంటల్ మూవ్‌మెంట్ పేరుతో ఆయా జిల్లాల్లో వైసీపీకి చెందిన పాత కాంట్రాక్టర్ల ద్వారానే రవాణా చేయిస్తూ ప్రతినెలా రూ.కోట్లలో బిల్లులు దోచిపెడుతున్నారు. ఇందుకు ప్రతిఫలంగా కాంట్రాక్టర్ల నుంచి పెద్దమొత్తంలో కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఒకే నెంబరు.. అవే నిబంధనలతో రెండోసారి..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పౌరసరఫరాల సంస్థ అధికారులు తమ పంథాను మార్చుకోవడం లేదు. జిల్లాలవారీగా స్టేజ్-1 ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టుల కోసం గత ఆగస్టు 13న ఎల్ఆర్ నెం: పీడీఎస్.3/18/2755/2024-28తో టెండరు నోటీసు ఇచ్చారు. దీనిద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాలకు రెండేళ్ల కాలపరిమితితో విడివిడిగా టెండర్లు పిలిచారు. ఒక్కొక్క జిల్లాలో టెండరు విలువ దాదాపు రూ.15 కోట్లు. దీంతో పాత, కొత్త కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎలాంటి కారణాలూ చెప్పకుండానే టెండర్లను రద్దు చేసేశారు. డిపార్ట్‌మెంటల్ మూవ్‌మెంట్ పేరుతో పాత కాంట్రాక్టర్లతోనే పీడీఎస్ బియ్యం, ఇతర సరుకులను రవాణా చేయిస్తూ ప్రతినెలా వారికి యథావిధిగా రూ.కోట్లలో బిల్లులు చెల్లిస్తున్నారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతుండటంతో ఈనెల 13న తాజా టెండరు నోటీసులు ఇచ్చారు. సాధారణంగా తొలిసారి పిలిచిన టెండర్ నోటీసులో నిబంధనలు మార్చాల్సి వచ్చినప్పుడు దానిని రద్దు చేసి మరోసారి కొత్తగా టెండరు పిలుస్తారు. దానిని 'సెకండ్ కాల్' అని పేర్కొనాలి. కానీ, పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరు గత ఆగస్టులో ఇచ్చిన టెండరు నోటీసునే.. కనీసం టెండరు నెంబరు కూడా మార్చకుండా అదే నెంబరు.. అవే నిబంధనలతో తాజా టెండరు నోటిఫికేషన్ జారీ చేశారు. కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేయడానికి ఈనెల 27ను ఆఖరు తేదీగా పేర్కొన్నారు. అయితే రెండోసారి ఇచ్చిన టెండర్ నోటీసులో 26 జిల్లాలకు బదులు 22 జిల్లాలకు కుదించారు. పైగాముందు ఇచ్చిన టెండరులో గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్(జీఈఎం) ప్లాట్‌ఫాం ద్వారా టెండరుదారులు బిడ్లు వేయాలని పేర్కొనగా.. రెండో టెండరు నోటీసులో ఎస్ఈఎంఎల్(ఎస్సీడెక్స్ ఈ-మార్కెట్స్ లిమిటెడ్) ప్లాట్‌ఫాం ద్వారా టెండర్లు ఆహ్వానించారు. నిబంధనలు మార్చకుండా పదేపదే ఒకేలా టెండరు పిలవడం, ప్లాట్‌ఫారాలను మార్చడం వెనుక మతలబు ఏమిటి? ఎవరికి మేలు చేయడానికనే ప్రశ్నలకు కార్పొరేషన్ అధికారులే సమాధానాలు చెప్పాలి. పాత కాంట్రాక్టర్లు మళ్లీ కోర్టును ఆశ్రయించేలా అవకాశం కల్పించడానికి కావాలనే తప్పుల తడకలతో టెండరు నోటీసులు జారీ చేస్తున్నారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ గుడుపుఠాణీ గురించి తెలియని కొంతమంది కొత్త కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు తక్కువ మొత్తాలను కోట్ చేసి టెండర్లు వేస్తున్నారు.

కొత్తవారికి అడ్డంకులు.. బెదిరింపులు

కొత్త కాంట్రాక్టర్లకు టెండర్లు దక్కడం ఇష్టంలేని అధికారులు సహేతుకమైన కారణాలు చెప్పకుండా ఏకంగా టెండర్లనే రద్దు చేసేస్తుండం గమనార్హం. భవిష్యత్తులోనూ కొత్త కాంట్రాక్టర్లు టెండర్లు వేసే సాహసం చేయకూడదనేలా వారికి చుక్కలు చూపిస్తున్నారు. కార్పొరేషన్‌లో పాతుకుపోయిన పాత కాంట్రాక్టర్లకే మళ్లీ మళ్లీ టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు వక్రమార్గాలను అనుసరిస్తున్నారు. తెరవెనుక గోల్‌మాల్ వ్యవహారాలను నడిపిస్తూ కొత్తవారిని అడ్డుకునేందుకు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో టెండర్లు వేసిన కొత్త కాంట్రాక్టర్లకు పాత కాంట్రాక్టర్ల నుంచి బెదిరింపులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని స్టేజ్-1 రవాణా కాంట్రాక్టును నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'సాగర్' గట్టుపై హైడ్రామా!

- డ్యాం భద్రత నుంచి ఆకస్మికంగా వైదొలగిన సీఆర్‌పీఎఫ్
- కేంద్ర హోం శాఖ ఆదేశాలతో మళ్లీ వెనక్కి

అమరావతి/మాచర్ల టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ డ్యాం మీద శనివారం హైడ్రామా నడిచింది. అక్కడ గస్తీ కాస్తున్న సీఆర్‌పీఎఫ్ బలాలు.. కేంద్ర హోం శాఖ నుంచి మౌఖికంగా గానీ.. లిఖితపూర్వకంగా గానీ ఎలాంటి ఆదేశాలూ లేకుండానే అకస్మాత్తుగా వైదొలగడం కలకలం రేపింది. భద్రత బాధ్యతలను సీఐఎస్ఎఫ్‌కు అప్పగించి.. సాగర్ తెలంగాణ వైపు గట్టు నుంచి ములుగు కేంద్రంగా ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం వెళ్లిపోయాయి. ఆంధ్ర సరిహద్దు వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు విశాఖపట్నం వెళ్లాల్సి ఉంది. అయితే.. వాహనాలు రావడం ఆలస్యం కావడంతో అక్కడే ఉండిపోయాయి. సీఐఎస్ఎఫ్ దళాలు వచ్చేలోపు తెలంగాణ ప్రత్యేక పోలీసు (ఎస్‌పీఎఫ్) బలగాలు తమ రాష్ట్ర సరిహద్దు వైపు మోహరించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా చోటు చేసుకున్న ఈ పరిణామాలు 2023 నవంబరు 29వ తేదీన తెలంగాణ సార్వత్రిక ఎన్నికల తరుణంలో బీఆర్ఎస్‌కు మేలు చేయడం కోసం, తెలంగాణ భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ పోలీసులు సాగర్ డ్యాంపైకి వెళ్లి గేట్లను స్వాధీనం చేసుకుని జలాలను దిగువకు వదిలిన ఘటనను గుర్తుకు తెచ్చాయి.

కేంద్ర జలశక్తి, హోం శాఖలతో చర్చలు..

సీఆర్‌పీఎఫ్ బలగాలు భద్రతా విధుల నుంచి వైదొలగిన సమాచారం రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులకు తెలిసిన వెంటనే.. ప్రభుత్వ సలహాదారు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ అతుల్ జైన్‌తో మాట్లాడారు. ఈ పరిణామంపై జైన్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. తనకేమీ తెలియదన్నారు. అటు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కూడా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీని సంప్రదించారు. ఈ పరిణామం తన దృష్టికి రాలేదన్న దేబశ్రీ.. వెంటనే కేంద్ర హోం శాఖతో సంప్రదింపులు జరిపారు. అయితే సాగర్ భద్రత బాధ్యతల నుంచి సీఆర్‌పీఎఫ్‌ను తొలగిస్తూ తామెలాంటి నిర్ణయమూ తీసుకోలేదని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆమెకు తెలియజేశారు. వెనక్కి మళ్లిన బలగాలు తక్షణమే సాగర్‌పై గస్తీని పునరుద్ధరించాలని హోం శాఖ సీఆర్‌పీఎఫ్‌ను ఆదేశించింది. దీంతో.. ములుగు వెళ్లిన బలగాలు మళ్లీ వెనక్కి వచ్చి విధుల్లో చేరాయి. విశాఖ వెళ్లేందుకు ఎదురుచూస్తున్న రెండో దళం కూడా యథావిధిగా బాధ్యతలు చేపట్టింది.

ఏం జరిగిందో..?

తాజా పరిణామంపై జల వనరుల శాఖ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర హోం శాఖ నుంచి ఆదేశాల్లేకుండా సీఆర్‌పీఎఫ్ ఎందుకు తప్పుకొంటుందని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరగాలని అంటున్నారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల ప్రజల మధ్య సుహృద్భావ వాతారణం నెలకొందని.. భావోద్వేగాలు లేవని.. ఇలాంటి తరుణంలో అకస్మాత్తుగా ఈ పరిణామం ఎలా జరిగిందో వారికి అంతుపట్టడం లేదు. దీనిపై విస్మయం చెందిన జలశక్తి, హోం శాఖల ఉన్నతాధికారులు సైతం తమకేమీ తెలియదని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము సాగర్ డ్యాం భద్రత నుంచి వైదొలగి ములుగు వెళ్లిపోయామని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ షాహీర్ తెలిపారు. వారి నిర్దేశం మేరకే మళ్లీ విధుల్లోకి చేరామని చెప్పారు. అయితే వసతులు సరిగా లేనందునే బలగాలు వెనక్కి వెళ్లాయన్న వాదన వినిపిస్తోంది. ఈ అంశంపై విశాఖ సీఆర్‌పీఎఫ్ జవాన్లు తమ డైరెక్టర్‌కు ఇదివరకే విన్నవించనట్లు తెలిసింది. వీరు సాగర్ సమీపంలోని విజయపురిసౌత్ ఏపీఆర్‌జేసీ కళాశాలలో బసచేసి వంటావార్పు చేసుకుంటున్నారు. అటు తెలంగాణ వైపు జవాన్లు హిల్‌కాలనీలోని బాలవిహార్‌లోని క్యాంపు ఏర్పాటు చేసుకున్నారు.

‘భాష’ ధ్యాస ఉన్నవారికే ఓట్లు!

ప్రజలు ఆ దిశగా అడుగులేయాలి అప్పుడే భాషకు ప్రభుత్వాల పెద్దపీట

- రాష్ట్రంలో తెలుగు వర్సిటీ ఏర్పాటు చేయాలి
- వైసీపీ జారీ చేసిన జీవో 85ను రద్దు చేయాలి
- ‘సుప్రీం’లో ఉన్న ఎస్‌ఎల్పీని వెనక్కి తీసుకోవాలి
- భాషా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ప్రారంభోపన్యాసంలో జస్టిస్ ఎన్వీ రమణ

విజయవాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): “భాషాభివృద్ధికి పాటుపడే పాలకులకు మాత్రమే ఓట్లు వేస్తామని ప్రజలు నిర్ణయించుకుంటే అన్ని రాజకీయ పార్టీలు తెలుగు భాషకు పట్టం కడతాయి. ప్రభుత్వాలు పెద్దపీట వేస్తాయి. భాష ధ్యాస ఉన్నవారికే ఓట్లు వేయాలి” అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. రాజకీయ పార్టీలకు ప్రజల మద్దతు అవసరం కాబట్టి ప్రజలే ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అప్పుడు ప్రతి రాజకీయ పార్టీ భాషాభివృద్ధిపై దృష్టి సారిస్తుందని అభిప్రాయపడ్డారు. తెలుగు భాషా రచయితలు, కవులు, భాషాభిమానులు ఎన్ని మహాసభలు నిర్వహించినా, ఎన్ని నినాదాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఈ పరిస్థితిని మార్చే ఆయుధం ప్రజల ఓటేనని స్పష్టం చేశారు. ప్రజలను ఆ విధంగా చైతన్యపరిచేలా రచయితలు తమ రచనలు సాగించాలని సూచించారు. ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభలు విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజా కిరణ్ జ్యోతి వెలిగించి మహాసభలను ప్రారంభించారు. అనంతరం జస్టిస్ ఎన్వీ రమణ ప్రారంభోపన్యాసం చేశారు. “భాషాభిమానం ఉన్నవారు ముఖ్యమంత్రులు, మంత్రులుగా ఉన్నప్పుడు భాషకు న్యాయం జరుగుతుంది. రచయితలు దివిటీ పట్టుకుని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే రచనలు చేయాలి. మానవ సంబంధాలను స్ఫురింపజేసే రచనలు చేసేవారికి ప్రజాభిమానం ఉంటుంది. రచయితలు.. ప్రభుత్వాలు ఇచ్చే అవార్డులు, రివార్డులు మరిచిపోయి రచనలు చేయాలి. ప్రజలే భాషను నిర్మించుకోవాలి. భాషను పరిపుష్టి చేయడమంటే ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. భావవ్యక్తీకరణకు భాష ఒక ఆయుధం. భాష అంతరించిపోతే పత్రికలు చదివేవారు, చానళ్లు వీక్షించేవారు కూడా ఉండరు. పత్రికలు, చానళ్లు భాషాభివృద్ధికి పాటుపడాలి. భాష విషయంలో తమిళనాడులో ఉన్న ఐక్యత తెలుగు ప్రజల్లోనూ రావాలి. రాష్ట్రంలో వీలైనంత త్వరగా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో ఉన్న తెలుగు వర్సిటీ తెలంగాణకు వెళ్లిపోయినందున అక్కడ ఉన్న సిబ్బంది, విద్యార్థుల గురించి కూటమి ప్రభుత్వం ఆలోచించాలి. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయడానికి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 85ను కూటమి సర్కారు రద్దు చేయాలి. దీనికి సంబంధించి గుంటుపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు జీవోను రద్దు చేసింది. అయినా, వైసీపీ ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. దాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి. రాష్ట్రంలో తిరిగి భాషా ప్రాధికార సంస్థను నెలకొల్పాలి. తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ భాషల్లోకి అనువదించాలి. ప్రబంధాలు, పురాణాలు, ఇతిహాసాల నుంచి తెలుగు అనేక రూపాలు తీసుకుంది. కథలు, నాటకాలు, కవిత్వంగా మారింది. తెలుగు పలుకుబడి ఎంతో వినసొంపుగా, వినడానికి సంగీతంలా ఉంటుంది. రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం మాతృభాషను కొల్లగొట్టడం సహింపరానిది” అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.

మాతృభాషతోనే అభివృద్ధి

స్వాతంత్ర్య పోరాటంలో తెలుగువారికి తగిన గుర్తింపు రాలేదని జస్టిస్ ఎన్వీ రమణ ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాష అభివృద్ధితోనే దక్షిణ కొరియా అమెరికా కంటే మెరుగైన మేధోసంపత్తిని, అభివృద్ధిని సాధించిందన్నారు. దక్షిణ కొరియాలో పరిశోధనలన్నీ అక్కడి మాతృభాషలోనే జరుగుతున్నాయని తెలిపారు. భాషాభిమానంతోనే బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా అవతరించిందని, పాలకులు ఈ విషయాలను గుర్తించాలని సూచించారు. పరభాషా సంస్కృతిలో ఉన్న మంచి విషయాలను నేర్చుకోవడంలో తప్పులేదని, అయితే, మొత్తంగా పరభాషనే గుడ్డిగా ఉపయోగిస్తే మొదటికే ప్రమాదం వస్తుందని హెచ్చరించారు. తెలుగులో చదవడం, మాట్లాడడమంటే వెనకబడిపోవడం అన్న భావన చాలామందిలో ఉందని, ఇది చాలా తప్పని వ్యాఖ్యానించారు. మన సుఖదుఃఖాలను పిల్లలతో తెలుగులో పంచుకోవడానికి, సంభాషించడానికి సిగ్గుపడాల్సిన అవసరం లేదని జస్టిస్ ఎన్వీ రమణ సూచించారు. శ్రీశ్రీ, ఆరుద్ర, సి.నారాయణ రెడ్డి, గురజాడ, కందుకూరి వంటివారు తెలుగు భాష పరిరక్షణకు కంకణం కట్టుకుని పనిచేశారని తెలిపారు. తెలుగు వారసత్వ భాష అని, దీని గురించి పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలని సూచించారు.



ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వేదికపై మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సుజనా చౌదరి, శైలజా కిరణ్ తదితరులు

నేనూ బాధితుడినే!



వైసీపీ ప్రభుత్వం వేధించిన వారిలో తాను కూడా ఒక బాధితుడినేనని జస్టిస్ ఎన్వీ రమణ పరోక్షంగా వ్యాఖ్యానించారు. తెలుగు భాష అభివృద్ధి, పాఠశాలల్లో తెలుగు మాధ్యమం గురించి మాట్లాడినప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగును అణగదొక్కడానికి గత ప్రభుత్వం జీవో 85ను తీసుకొచ్చిందన్నారు. ఆ ప్రభుత్వంలో అనేక ఘటనలు జరిగాయని, వాటిలో తాను కూడా ఒక బాధితుడిగా మిగిలానని పేర్కొన్నారు.

అదనపు మార్కులు ఇవ్వాలి



తెలుగు మాధ్యమంలో చదువుతున్నవారికి విద్య, ఉద్యోగాల్లో 3-5 శాతం అదనపు మార్కులు ఇవ్వాలి. ఈ విధానాన్ని అమలు చేస్తే తెలుగు భాష మనుగడకు ఎలాంటి ప్రమాదం ఉండదు. దేశంలో ఒకప్పుడు రెండోస్థానంలో ఉన్న తెలుగు భాష నాలుగో స్థానానికి పడిపోవడం బాధాకరం. దేశంలో 15కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారు. భాష విషయంలో ప్రజల్లో వస్తున్న మార్పులు చూస్తుంటే భయమేస్తోంది. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాలను తీసేస్తున్నారు. భాష లేనప్పుడు జాతికి మనుగడ ఉండదు.

\- ఎన్. తులసిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత

‘తెలుగు’ కోసం నిరాహారదీక్ష



రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి. ప్రజలు దీనికోసం పోరాటం చేయాలి. అవసరమైతే నేనే నిరాహార దీక్షకు దిగుతాను. నేను ఎప్పటికీ తెలుగు బిడ్డనే. తమిళనాడులో అన్ని పాఠశాలల్లో తమిళ మాధ్యమాన్ని కచ్చితంగా అమలు చేయాలని అక్కడి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తెలుగు పత్రికల సర్క్యులేషన్ పెరిగేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలి. తమిళులకు ఇబ్బంది వస్తే ఆ సమాజం మొత్తం రాజకీయాలకతీతంగా స్పందిస్తుంది. అదే ఐక్యత తెలుగు జాతిలోనూ రావాలి. - ఎంపీ గోపీనాథ్ (కృష్ణగిరి, తమిళనాడు)

ఆధునికతను ఆహ్వానిస్తూనే ‘అమ్మ’ను కాపాడుకోవాలి



సమాజంలో రోజురోజుకూ వస్తున్న ఆధునికతను ఆహ్వానిస్తూనే మాతృభాష, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి. ఇప్పటికీ గ్రామాల్లో రైతులు 1,000 రకాల ధాన్యాల పేర్లను చకచకా చెబుతారు. మార్కెట్ శక్తులు మొట్టమొదట దాడి చేసేది భాష మీదే. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా తెలుగు భాష పరిరక్షణకు పాటుపడాల్సిన అవసరం ఉంది.

\- గోరటి వెంకన్న, తెలంగాణ ఎమ్మెల్సీ

సాహిత్యంతో సమాజంలో మార్పు

శాసనాల ద్వారా సమాజాన్ని కొంతవరకే నియంత్రించగలం. అధిక శాతం మార్పు రావాలంటే సాహిత్యం ద్వారానే సాధ్యం. రచయితలు, కవులు, కళాకారులు కలిసి రేపటి తరానికి ఈ సభల ద్వారా దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇలాంటి సభల ద్వారా తెలుగు భాష పరిపుష్టం కావడంతోపాటు సాహిత్యం, పద్యం, గద్యం, కథ, కథానికలు వంటి కవితా ప్రక్రియలన్నీ చిరస్థాయిగా నిలుస్తాయి. రేపటి తరం కోసం ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించడం అభినందనీయం. - జస్టిస్ దుర్గాప్రసాద్, హైకోర్టు జడ్జి

కొత్త సీఎస్‌గా విజయానంద్

- నేడో రేపో అధికారిక ప్రకటన.. నవంబరులో ఆయన రిటైర్మెంట్
- ఆ తర్వాత సాయిప్రసాద్‌కు చాన్సు?: సీఎం నిర్ణయం



అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్ నియమితులు కానున్నారు. ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు పొడిగించిన పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఆయన స్థానంలో విజయానంద్‌ను నియమించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడనుంది. సీనియారిటీ ప్రాతిపదికన మొదట జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ పేరు వినిపించినప్పటికీ.. ఆయన్ను నియమిస్తే ఆయన పదవీకాలం ముగిసేలోగా విజయానంద్ రిటైరవుతారు. అందువల్ల విజయానంద్‌కు ముందుగా అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది నవంబరులో ఆయన రిటైరయ్యాక సాయిప్రసాద్‌ను సీఎస్‌గా నియమించాలని నిర్ణయానికి వచ్చారు. మరో ఆరు నెలల పదవీకాలం పొడిగిస్తే ఆయన కూడా ఏడాది కాలం పనిచేసినట్లవుతుందని సీఎం భావిస్తున్నారు. ఇద్దరికీ అవకాశమివ్వాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. విజయానంద్ కడప జిల్లాకు చెందిన వ్యక్తి. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన బీసీ వర్గానికి చెందినవారు. దాంతో ముఖ్యమంత్రి ఆయన వైపు మొగ్గుచూపారు.

ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్

- 31న ప్రస్తుత కార్యదర్శి పదవీ విరమణ.. అదే రోజు ఎన్నిక



విజయవాడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీఎన్‌జీజీఓ) అసోసియేషన్ అగ్రనేతగా విజయవాడకు చెందిన ఎ.విద్యాసాగర్ ఎన్నిక కాబోతున్నారు. ఈ నెల 31న విజయవాడలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సాగర్ పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీహెచ్ పురుషోత్తమ నాయుడు డిసెంబరు 31న తాను పనిచేసే వాణిజ్య శాఖలో పదవీ విరమణ చేయనున్నారు. ఏపీఎన్‌జీజీఓ బైలా ప్రకారం ప్రభుత్వ శాఖలో పదవీ విరమణతోనే సంఘం నుంచి కూడా విరమణ పొందాల్సి ఉంటుంది. దీంతో ఖాళీ అయ్యే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థానానికి అదేరోజు ఎన్నిక నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉమ్మడి 13 జిల్లాల కార్యవర్గాలు ఏకగ్రీవంగా విద్యాసాగర్ పేరును ప్రతిపాదించాయి. విద్యాసాగర్ పేరును రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ఖరారు చేశారు. 31న పురుషోత్తమ నాయుడుకు వీడ్కోలుతో పాటు విద్యాసాగర్‌కు అభినందన కార్యక్రమాన్ని ఒకే వేదికపై నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్ గాంధీనగర్‌లోని ఏపీఎన్‌జీజీఓ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత స్థానిక జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. తిరిగి అక్కడి నుంచి భారీ ర్యాలీగా ఏపీఎన్‌జీజీఓ భవన్‌కు చేరుకుని ముఖ్యులు, జిల్లాల నాయకత్వాలతో సమావేశమవుతారు. విద్యాసాగర్ ప్రస్తుతం ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్‌కు పశ్చిమ కృష్ణా అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. విద్యార్థి జీవితం నుంచే ఉద్యమాలే ఊపిరిగా సాగర్ ప్రస్థానాన్ని సాగించారు. సమైక్యాంధ్ర పోరాటాన్ని తెర వెనుక ఉండి నడిపించారు. ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య వారధిలా పనిచేసేవారు. వైసీపీ హయాంలో సాగర్‌పై ప్రభుత్వ పెద్దలు పరోక్షంగా కుట్రలు చేసి ఆయనను రాష్ట్ర నాయకత్వంలోకి రానీయకుండా చేశారు. సకలశాఖ మంత్రిగా పేరొందిన సజ్జల రామకృష్ణారెడ్డి విద్యాసాగర్‌ను రాష్ట్ర కార్యవర్గంలోకి రానీయకుండా ఎన్నో ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం మారడం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవీ విరమణ చేస్తుండడంతో ఆయన స్థానాన్ని సాగర్‌కు అప్పగించాలని అన్ని జిల్లాల కార్యవర్గాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. మరో నాలుగు నెలల్లో ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కేవీ శివారెడ్డి కూడా పదవీ విరమణ చేయనున్నారు. తరువాత ఆ పదవికి విద్యాసాగర్‌ను ఎన్నుకోవటానికి ఇప్పటికే జిల్లా కార్యవర్గాలు ప్రతిపాదించాయి.

వైసీపీ నేతలకు అహంకారం తలకెక్కింది

తోలుతీసి కూర్చోబెడతాం.. పవన్ కల్యాణ్ హెచ్చరిక.. ఎంపీడీవో జవహర్‌బాబుకు పరామర్శ



కడప రిమ్స్‌లో ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కడప/రాయచోటి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): “గతంలో ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌నాయక్, శ్రీనివాసులరెడ్డిపై దాడి చేశారు. ఇప్పుడు జవహర్‌బాబుపై దాడి చేశారు. వైసీపీ నేతలకు అహంకారం తలకెక్కింది. తోలుతీసి కూర్చోబెడతాం. ఆధిపత్యపు అహకారంతో దాడిచేస్తే మీ అహంకారాన్ని అణిచేస్తాం” అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం త్రికరణశుద్ధితో పనిచేస్తోందని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఎలా నియంత్రించాలో తెలుసనని వ్యాఖ్యానించారు. “వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా గాలిలో విహరిస్తున్నారు. 11 సీట్లే వచ్చినా అహంకారం తగ్గలేదు” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కడప జిల్లా గాలివీడు మండలం ఎంపీడీవోపై శుక్రవారం దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడిలో గాయపడి ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీడీవో జవహర్‌బాబును శనివారం డిప్యూటీ సీఎం పరామర్శించారు. 15 నిమిషాల పాటు ఆసుపత్రిలో ఉండి ఎంపీడీవో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జవహర్‌బాబు, ఆయన భార్య అర్చన, కుమార్తె హాన్సి, కుమారుడు వినీత్‌లను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. “గాలివీడు ఎంపీడీవోపై దాడి చేసిన వ్యక్తి జల్లా సుదర్శన్‌రెడ్డి. ఈయన లాయర్. స్టేట్ లా ప్రాసిక్యూషన్ ఆఫీసర్‌గా పనిచేసిన వ్యక్తి. ఆయన తల్లి మండల అధ్యక్షురాలు. తాళాలు అడిగితే ఇవ్వలేదని.. దాదాపు 11 మంది వ్యక్తులు దాడి చేశారు. కుటుంబ సభ్యులకు తాళాలు ఇవ్వడం కుదరదన్నందుకు ఇష్టానుసారం దాడికి తెగబడ్డారు. ఎంపీడీవో అంటే మండలానికి కలెక్టర్‌లాంటి వారు. ఆయనపై జరిగిన దాడిని రాష్ట్ర యంత్రాంగంపై జరిగిన దాడిగా భావించా” అని అన్నారు. జవహర్‌బాబును సుదర్శన్ రెడ్డి కులం పేరుతో దూషించినట్టు తెలిపారు. “ఎలా తిరుగుతావో చూస్తామని బెదిరించారు. గదిలో తలుపు వేసి అమానుషంగా కొట్టారు. గత ప్రభుత్వంలో మాదిరిగా రెచ్చిపోయారు. ఇష్టారాజ్యంగా అధికారులపై దాడి చేస్తే కూటమి ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదు. ఆధిపత్యంతో దాడి చేస్తే తోలుతీస్తాం. 11 సీట్లు వస్తేనే గాల్లో తేలుతున్నారు. అవి కూడా లేకుండా చేస్తాం. మిమ్మల్ని ఎలా కిందికి దించాలో నాకు తెలుసు. చేసి చూపిస్తాం. ఏ అధికారిపై అయినా దాడులకు దిగినా, విధులకు అడ్డుపడినా కఠిన చర్యలు ఉంటాయి. దాడి చేసిన వారు లాయర్లు అయినా సరే ఏ చట్టాలు గానీ అధికారాలు గానీ మిమ్మల్ని రక్షించలేవు” అని హెచ్చరించారు. “ఆధిపత్య దాడులు చేస్తే ఎదుర్కోండి. మీకు అండగా మేముంటాం” అని రాయలసీమ యువతకు, ప్రజలకు పిలుపునిచ్చారు. దాడి చేసిన వారు ఎన్నికల్లో పోటీ చేయడానికి భయపడేలా వ్యవహరించాలని సూచించారు. కడప జిల్లా సింహాద్రిపురం మండలంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం తనకు తెలిసిందని చెప్పారు. కారణాలు తెలియాల్సి ఉందన్నారు. పూర్తి విచారణ చేస్తున్నారన్నారు. అభివృద్ధిలో ముందుకు వెళ్తున్న సమయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సరైన రీతిలో అధికార యంత్రాగానికి స్పందించకపోతే.. తగిన రీతిలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

సీఎం సహనాన్ని పరీక్షించొద్దు

“సుదర్శన్‌రెడ్డి గత ఐదేళ్లలో గాలివీడు మండలంలో ప్రభుత్వ ఉద్యోగులైన ప్రతాప్ అనే ఓ దివ్యాంగుడిపైన, శ్రీనివాసులరెడ్డి, శేఖర్‌నాయక్ మీద దాడిచేశారు. ఇప్పుడు జవహర్‌బాబు మీద దాడిచేసిన ఏ ఒక్కరినీ వదిలేది లేదు. ఎక్కడ దాక్కున్నా బయటకు తెచ్చి జైలుకు పంపుతాం. సీఎం చంద్రబాబు చాలా సంయమనంతో ఉన్నారు. ఆయనను పరీక్షించకండి” అని పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

సీమలో క్యాంపు కార్యాలయం పెడతా

గాలివీడులో ఎంపీడీవోపై దాడి జరిగిన కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. “అధికారంలో ఉన్నామని మర్యాద కోసమే మంచిగా మాట్లాడుతున్నా.. పిచ్చిపిచ్చి వేషాలు వేస్తే దుస్తులిప్పి కొడతాం. అవసరమైతే రాయలసీమలో నా క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేస్తా. వైసీపీ నాయకులను సరిదిద్ది వెళ్తా” అని అన్నారు. మన్యం జిల్లాలో జరిగిన తన పర్యటనలో ఓ నకిలీ ఐపీఎస్ అధికారి పాల్గొన్న విషయమై పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ విషయం కడప పర్యటనకు వస్తున్న సమయంలో తెలిసిందన్నారు. “నా భద్రత చూసే బాధ్యత పోలీసులు, హోం శాఖదే” అని స్పష్టం చేశారు.

ఏంటయ్యా మీరు.. ఫ్యాన్స్‌పై అసహనం

మీడియాతో పవన్‌కల్యాణ్ మాట్లాడేటపుడు అభిమానులు ‘ఓజీ ఓజీ, సీఎం సీఎం’ అని బిగ్గరగా నినాదాలు చేశారు. దీంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. “ఏంటయ్యా మీరు? ఎక్కడ ఏం చేయాలో తెలియదా” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ విషయం మీడియా ప్రస్తావించగా సినిమా కంటే పెద్ద విషయాలు ఉన్నాయని, అరాచకాలు జరుగుతున్నాయని, మనుషులు చచ్చిపోతున్నారని, ఇప్పుడు సినిమాల గురించి మాట్లాడతారా అని ప్రశ్నించారు. అరాచకాల గురించి మాట్లాడాలని సూచించారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

జవహర్‌బాబుపై దాడి చేసిన ముగ్గురు నిందితులకు లక్కిరెడ్డిపల్లె కోర్టు జడ్జి ఫైజున్నీసా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. వారిని కడప సెంట్రల్‌జైలుకు తరలించినట్లు చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

అమరావతి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో సి.జవహర్‌బాబుపై దాడిని నిరసిస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. జవహర్‌బాబుకు మద్దతుగా అన్ని మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల వద్ద అధికారులు, ఉద్యోగులు ఆందోళనలు నిర్వహించారు. బాధిత ఎంపీడీవోను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరామర్శించడం, చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం ద్వారా ఉద్యోగుల్లోనూ ఆత్మస్థైర్యం నింపారని ఏపీ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు కేఎస్ వరప్రసాద్, డి.వెంకట్రావు, జీవీ సూర్యనారాయణ, కేఎన్‌వీ ప్రసాద్, మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఉద్యోగుల జేఏసీ నేత వైవీడీ ప్రసాద్, కార్యదర్శుల సమాఖ్య అధ్యక్షుడు వర్ల శంకర్, డిప్లమో ఇంజనీర్ల అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, మహంతి పేర్కొన్నారు.

పవన్ పర్యటనలో నకిలీ ఐపీఎస్!

- అరెస్టు చేసిన పోలీసు అధికారులు



సాలూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనలో హల్‌చల్ చేసిన నకిలీ ఐపీఎస్ గుట్టు ఎట్టకేలకు రట్టయింది. పోలీసులు ఆ వ్యక్తిని అరెస్టు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, అంకిత శనివారం విలేకరులకు వివరాలు తెలిపారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాంకు చెందిన సూర్యప్రకాశ్ 2003 నుంచి 2005 వరకు ఆర్మీలో పని చేశాడు. అక్కడి నుంచి వచ్చేశాక బొబ్బిలిలో బీటెక్ చేశాడు. ఓపెన్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ కూడా చేశాడు. కొద్దిరోజుల తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయాడు. 2020లో తండ్రి తవిటిబాబు చనిపోయాక. ఆయన భూమిని దక్కించుకోడానికి నకిలీ ఐపీఎస్ అవతారం ఎత్తాడు. 2024లో ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యానని చెప్పి, హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉండి.. యూనిఫాం కుట్టించుకుని, నకిలీ ఐడీ కార్డులు తయారు చేసుకున్నాడు. ఆరు నెలల కిందట విజయనగరం తిరిగి వచ్చాడు. ఈనెల 20న పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా పనసభద్ర వెళ్లాడు. అక్కడ వీఐపీలతో ఫొటోలు దిగాడు. కొన్నింటిని వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. దీనిపై పోలీసులు విచారణ జరపగా గుట్టురట్టయింది. సూర్యప్రకాశ్‌ను అరెస్టు చేసి, రెండు నకిలీ ఐడీ కార్డులు, యూనిఫాం, కారు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

7న విచారణకు రండి

ఫార్ములా ఈ-కార్ కేసులో కేటీఆర్‌కు ఈడీ సమన్లు

- 2, 3 తేదీల్లో అర్వింద్, బిఎల్ఎన్ రెడ్డిల విచారణ

హైదరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) ఫార్ములా ఈ ఈ-కార్ రేసు కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సమన్లు జారీ చేశారు. జనవరి 7న విచారణకు హజరు కావాలని స్పష్టం చేశారు. ఇదే కేసుకు సంబంధించి నాటి పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను జనవరి 2న, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్‌రెడ్డిని జనవరి 3న విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. కేటీఆర్ తదితరులపై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసినవెంటనే ఈ నెల 20న అధికారులు కేటీఆర్‌ను ఏ1గా, అర్వింద కుమార్‌ను ఏ2గా, బిఎల్ఎన్ రెడ్డిని ఏ3గా పేర్కొంటూ మనీ లాండరింగ్, ఫెమా చట్టాల కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్) నమోదు చేశారు. ఆ తర్వాత పరిణామాల్లో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయడంతో ఈడీ మెల్లిగా ఆధారాల సేకరణ ప్రారంభించింది. విదేశాలకు డబ్బు బదిలీ చేసిన హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్ ఏసీబీకి ఇచ్చిన ఫిర్యాదు కాపీని, ఆయన ఏసీబీకి ఇచ్చిన వాంగ్మూలాన్ని సేకరించారు. బ్రిటన్‌కుచెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈఓ) సంస్థతో నాటి పురపాలక శాఖ ఒప్పందం చేసుకుంటే హెచ్ఎండీఏ జనరల్ ఖాతా నుంచి డబ్బుఎందుకు పంపించాల్సి వచ్చింది? విదేశీ కంపెనీతో ఒప్పందాలు జరిగినపుడు తీసుకోవాల్సిన అనుమతులు తీసుకున్నారా? విదేశీ కరెన్సీలో రెండు విడతలుగా రూ.45,71,60,625కోట్లు చెల్లింపు చేసినపుడు రిజర్వ్ బ్యాంక్ అనుమతులు తీసుకున్నారా లేదా అనే కోణంలోనూ ఈడీ అధికారులు వివరాలు సేకరించారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్ సందర్భంగా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో... ఫార్ములా ఈ కారు రేసు ప్రాజెక్టుఒప్పందంలో నిబంధనలు తుంగలో తొక్కారని, కేబినెట్, ఆర్థిక శాఖ, గవర్నర్ అనుమతులు లేకుండా కేటీఆర్ ఆదేశాల మేరకు నిధులను విదేశీ కంపెనీకి చెల్లించారని... ఏసీబీ స్పష్టం చేసింది. వీటికి సంబంధించిన అన్ని పత్రాలను ఇప్పటికే ఈడీ అధికారులు సేకరించి పెట్టుకున్నారు. నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చెప్పినట్లే చేశానని ఇప్పటికే తెలంగాణ సీఎస్ శాంతికుమారికి రాతపూర్వకంగా జవాబు ఇచ్చిన అర్వింద్ కుమార్‌ను కేటీఆర్ కన్నా ముందే విచారించడానికి సమన్లు జారీ చేయడం వ్యూహాత్మకమే. కేటీఆర్ చెప్పినట్లు చేసినందుకు తాను చిక్కుల్లో ఇరుక్కున్నానని, తనను బయట పడేయాలని అర్వింద్ కుమార్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు పైరవీలు చేస్తున్న క్రమంలో ఆయన్ను విచారిస్తే కేసు స్వరూపం పూర్తిగా అర్థం చేసుకోవచ్చునని, అన్ని ఆధారాలు సేకరించిన తర్వాత వాటి ఆధారంగా కేటీఆర్‌ను ప్రశ్నించాలని ఈడీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.